SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

Jayaram Row, A.

Asokudu

Rajahmundry, 1921

Record no. 281

Bibliographic Record Target

Jayaram Row, A.

Asokudu / A. Jayaram Row Pantulu .- 3. edition.- Rajahmundry : K. L. N. Somayajulu, 1921.

2, 128 p. ;17 cm.

Record no. 281

ASOKUDU

THE GODAVARI BOOK DEPOT.

RAJAHMUNDRY.

Re. 1—0—0

ASOKUDU

GENERAL EDITOR

M. R. RY. A. JAYARAM ROW PANTULU GARU B. A., L. T.

HEADMASTER,

Taylor High School,

NARSAPUR,

THIRD EDITION 1000

PUBLISHED BY

K. L. N. SOMAYAJULU.

PROPRIETOR,

THE GODAVARI BOOK DEPOT,

Rajahmundry.

1921.

Price Re. 1.

సూచీపత్రము.

PREFACE.

There has been a great out-put of Telugu Works in recent years and yet an adequate supply of biographical literature has been a desideratum. This little book on Asoka, the Great Buddhist Emperor of India, is therefore a welcome addition to the smaller number of biographies in Telugu of Indian worthies, ancient or modern.

The purpose of a Biography, especially as one of the chief agents in influencing young minds, is too well-known to need any mention in this foreword. This book is, I believe, mainly intended for juvenile readers and I have no hesitation in saying that both from the point of the simplicity and lucidity of style in which it is written and the accuracy of facts, it is eminently suitable for them.

It is written in short chapters, each dealing with either an episode of the story or the features of an important movement or the character of men and women of these times. Short, rippling sentences, full of power, animated descriptions of war, hunt and natural scenery, free from the usual taint of extravagance, delineation of character in its true historical setting and rapid narration where necessary, are some of the characteristics of style in this book. On the whole there is a happy blending of the new and the old methods of writing Telugu books.

The material for this short sketch has been drawn from the little volume on "Asoka" in "The Rulers of

India " series. It must be said to the credit of the author that in steering clear of the ugly stories connected with one of the queens of Asoka, Tishyarakshita, he has shown commendable discretion, and that so far as the main facts of Asoka's life and times are concerned, he has faithfully followed that book. The chief lessons from the life of that great Emperor that an ugly exterior can be a shell to intellectual and moral eminence, and that blood thirsty ambition can under the potent influence of a living faith and by divine grace through miracles, be transformed into humanitarian piety, have been brought out with such vividness that they cannot fail to make a deep impression on the minds of the reader.

When I have mentioned these outstanding features of the book, I have not exhausted all its merits. But I am sure I have said enough to commend the book to the Telugu reading public especially the student population. I trust the book will find a wide circle of readers, even without its being prescribed as an Examination pill.

I trust the gifted author of this book will, ere long contribute more of such books and also treatises on Scientific subjects to the Telugu literary world and lead it into healthy channels of reading.

At the special request of the Publisher, I have written this foreword in English.

NARSAPUR,
February 13, 1920.

A. JAYARAM RAO B.A., L.T.

అశోకుఁడు.

మొదటి ప్రకరణము.

దైవజ్ఞుఁడు.

ఇప్పుడు 1919 వ క్రీస్తుశకవత్సరము నడచుచున్నది. ఇప్పటికించుమించుగ 2,15[illegible] సంవత్సరములకుఁ బూర్వపుచరిత్రను గూర్చి వ్రాయుచున్నారము. భాగల్పురమునకుఁ బశ్చిమభాగమున గంగాశాఖానది యొకటి ప్రవహించుచున్నది. ఆనది పేరు చంపావతి. ఆనదియొడ్డుననే చంపకనగరముండెను. చంపకనగరమునందొక మహారాజు నివసించి యుండెను. ఆనగరమునం దనేకధనవంతులును వర్తకులును వాసము చేయుచుండిరి. ఆ పట్టణ మతిలోకసుందర మైనది. రాజప్రాసాదములును, ధనవంతులసుందరసౌధములును, వారివిలాసోద్యానములును, వణిగ్వరులయమూల్యవివిధవస్తుప్రపూర్ణంబులగు విపణిశ్రేణులును గలసి యానగరసౌభాగ్యమును వర్ధిల్లఁజేయుచుండెను. ఆనగరమధ్యప్రదేశమున ధనవంతులకును దరిద్రులకునుగూడ ననుకూలముగ నుండు నట్లు మహారాజ్ఞీమణి యొక ప్రశస్తసరోవరమును బ్రతిష్ఠించి యుండెను; ఆసరోవరము నలువంకలను గల సమున్నతవిశాలతీరములు ఫలపుష్పతరులతావిలసితములుగఁ జేయించెను. మహారాజును, రాణియు, గొప్పగొప్ప రాజోద్యో

షులును, సంపన్నగృహస్థులును, ధనవంతులును, శ్రేష్ఠులగు వణిగ్జనులును, యశస్సుకొఱకును, బుణ్యముకొఱకును, సాధారణజనులసౌఖ్యముకొఱకును, బ్రాహ్మణులు యతులు మొదలగువారి ప్రీతికొఱకును, నగరమధ్యప్రదేశమునను బురబాహ్యప్రదేశములనుగూడ ననేకకూపములను, దటాకములను, చైత్యములను, మఠములను మందిరములను బ్రతిష్ఠించియుండిరి. అచ్చటిరాజు గుణవంతులనాదరించుచుండెను; పండితగణములకు భూములను వృత్తులను గల్పించి వారిగౌరవోత్సాహములను వర్ధిల్లఁజేయుచుండెను. ఆమహారాజు దీనులదుఃఖములను, పీడితుల కష్టములను దొలఁగించుట కనేక సౌకర్యములను గావించియుండెను. ఏనగరమున నిట్టిమహారాజు నివసించి యుండెనో, యెచ్చట నింతటిదానశీలురగు నైశ్వర్యవంతులు వాసము చేయుచుండిరో, యేస్థానమునందుఁ గృషివాణిజ్యము లింతటి యున్నతస్థానము నలంకరించి యుండెనో యట్టిపట్టణమున నానావిధంబులగు జనసంఘములు వచ్చుచుఁబోవుచుండె ననియు, ధనవంతులును, దరిద్రులునుగూడఁ గలసినివసించుచుండిరనియుఁ జెప్పుటకంటె నింకను నాశ్చర్యకర మగువిషయ మేమున్నది ?

ఆచంపకనగరమునఁ జంపావతీనదీతీరమునం గలవిష్ణుమందిరసామీప్యమునందుఁ గొంతమంది బ్రాహ్మణులు వాసము చేయుచుండిరి. అది వైశాఖమాసము—ఒకబ్రాహ్మణకన్యక నదీజలముల స్నానము చేసి శుచియై భక్తిభావముతో మాధవుని బూజించుటకై దేవాలయమునకుఁ బోయెను. అచ్చట నవమల్లికాకుసుమముల తోడను, దులసీదూర్వాంకురముల తోడను, శ్వేతచందనాదికములతోడను మాధవుని బూజించి యాబాలిక మరల గృహాభిముఖియై వచ్చుచుండెను. ఆమె పచ్చని పట్టుచీరను ధరించియుండెను. ఆమెకపోలములు శ్వేతచందనచర్చితములై యుండెను. ఆబాలికదక్షిణకరంబునఁ జిన్నిజలకలశమును, వామకరంబునఁ బూలపళ్లెరమును గలవు. ఆబాలిక యతిత్వరితముగ వచ్చుచుఁ దమయింటిగుమ్మముకడ నొక యపరిచితుఁడు నిలువఁబడి యుండుటను జూచెను. ఆతఁడొక బ్రాహ్మణుఁడు—ఆతనిహస్తమునం దొకపుస్తక ముండెను; గృహస్వామిని దర్శింపవలయునని యాతఁ డచ్చటనుండి నిరీక్షించుచుండెను. ఆబాలిక నాతఁడు దూరమునుండియే చూచుచుండెను. ఆమె సమీపించినతోడనే యాబ్రాహ్మణుఁ డామెతో " నేనిచ్చట నిరీక్షించుచుంటి నని నీజనకునితోఁ జెప్పుము " అనియెను.

బాలిక లోపలికిఁబోయి యాసంగతి తండ్రితోఁ జెప్పెను. గృహస్థుఁడు వెలుపలికి వచ్చినతోడనే యాబ్రాహ్మణుఁ డాతనితోఁ దానొక దైవజ్ఞుఁడనని చెప్పెను. ఆయిరువురకు నించుక సంభాషణ మైనతరువాత దైవజ్ఞుఁడు "అయ్యా ! మీరు విచారముతో నున్నట్లగపడుచున్నా రేమి ? " అని ప్రశ్నించెను.

గృహ—అందుల కాశ్చర్య మేమున్నది? వయసువచ్చినబిడ్డ యింకను బెండ్లిగాకుండ నింట నున్నప్పు డేజనకుఁడు

నిశ్చింతుఁడై యుండఁగలుగుదును? నేను దరిద్రుఁడను—నా కుమార్తెకుఁ దగినయనుకూలవరుని నేనెట్లు తేఁగలుగుదును? రేయుంబవ లీవిషయమునుగూర్చియే యాలోచించుకొనుచు నిట్లుంటిని.

దైవ—అగు నామాట నిజమే. రాజులును, మహారాజులును, ధనికులును, గొప్పవారందఱును గూడఁ దమకుమార్తెల ననుకూలవరులకుం గూర్చి కన్యాదానఫలము నందవలయు ననియే యపేక్షించుచుందురు. కాకేమి? మీ రెఱింగియే యుందురు—జననమరణవివాహములు మూఁడును దైవాధీనములు! వివాహవిషయమునఁ గన్యకయదృష్టమే ప్రధానమైనది.

గృహ—అవును. అవి దైవాధీనములే. ఎఱుంగుదును. కాని, ప్రయత్నముకూడ నావశ్యకమే కదా!

దైవ—సర్వవిషయములయందునుగూడ దైవపురుషకారములు రెండు నావశ్యకములే. ఈమాట నెవ్వఁడు కాదనఁగలఁడు? కాని యదృష్టముమాత్ర ముపేక్షణీయము కాదు. ఏమైననేమి? మీకొక్కమాట చెప్పెదను—మీరు మీకుమార్తెవివాహవిషయమున నెంతమాత్రమును జింతింప నక్కఱ లేదు.

ఇంతవఱకు వారిరువురు నిలిచియుండియే సంభాషించుచుండిరి. దైవజ్ఞుఁడిట్లు చెప్పినతోడనే గృహస్థుఁ డానందించి యాతనిం దనతోఁగూడ లోనికిం దీసికొనిపోయి యొకచాఁపపైఁ గూర్చుండఁ జేసెను.

ఇరువురును గూరుచుండిరి. పిమ్మట దైవజ్ఞుఁడు "మీ బాలిక నొకసారి పిలువుఁడు" అనియెను.

గృహ—అమ్మా! సుభద్రాంగీ! ఇటుఁ రమ్మా.

బాలిక యచ్చటకు వచ్చి తండ్రియానతిచే దైవజ్ఞునకు నమస్కరించి యచ్చటఁ గూరుచుండెను

దైవ—అమ్మా! నీచేయొకసారి చూపుము!

బాలిక యించుకసిగ్గుతోఁ దనవామహస్తమును జాఁచెను—చందనమలఁదినచెక్కులును, దుమ్మెదలంగేరుపెన్నెఱులును, సిగ్గునను దొంతరలం దరళంబు లగుచెలువంపుఁజూపులును నాబాలికసౌందర్యమునకు మనోహరత్వము నాపాదించుచుండెను. కోమలారుణపల్లవసదృశంబు లగుమృదులహస్తములును, చంపకకోరకసన్నిభంబు లగురుచిరాంగుళులును నామెయదృష్టమును జెప్పకయె చెప్పుచున్నవి—ఇఁక ఫలాఫలముల విశదీకరించుటకు దైవజ్ఞుఁడేల కావలయును? ఆబాలికను జూచినతోడనే పరమేశ్వరుఁ డేదియో విశేషోద్దేశముతో నీమెను సృష్టించి యుండునని బోధపడుచుండెను.

దైవజ్ఞుఁ డాబాలికహస్తమును బరీక్షించెను. ఆమె జన్మదినము, సమయము, లగ్నము మొదలగునవి తెలిసికొని గణనము చేసిచూచెను. పిమ్మట "అమ్మా! ఇఁక వెళ్లుము!" అనియెను.

ఒక్క గంతులో నాబాలిక తల్లియొద్దకుఁ బోయెను.

దైవజ్ఞుఁడాబాలికశుభలక్షణములఁ గూర్చి తండ్రికి విశదీకరించెను. మఱియు నీబాలికగర్భమునం దిరువురుపుత్రులుజనియింతురనియు నందొకఁడు విశాలభూమండలమునకుఁ బ్రభుఁడగుననియు, రెండవవాఁడతిలోకప్రతిభానిధియగుధర్మమతబోధకుఁడగు ననియు గణించిచెప్పెను. ఆబాలికశుభలక్షణప్రశంసయు, భవిష్యదైశ్వర్యప్రస్తావమును విని యామెతల్లిదండ్రులు మిగుల నానందించిరి. అప్పుడొక్కించుకసేపా బ్రాహ్మణుఁడు తనపేదతనమును మఱచిపోయెను. అప్పుడాతనిగృహిణి యా దైవజ్ఞునకు "ఈదినమున మాయింటనే యాతిథ్యమును స్వీకరింపవలయును" అని తెలియఁజేసెను.

రెండవ ప్రకరణము.

బ్రాహ్మణదంపతులు.

ఆదరిద్రబ్రాహ్మణునియిల్లు మిక్కిలి చిన్నదిగ నుండెను. గృహద్వారములును జిన్నవిగనే యుండెను. అందువలనఁ బైవారెవ్వరైన నింటికి వచ్చినప్పు డింటివారికి మిగుల ననుకూలముగనుండదు. దైవజ్ఞుఁడు శుభఫలములను జెప్పి యున్నాఁడు. అది యాదంపతుల కానందదాయకముగనే యున్నది. ఆకారణముననే వారాతని దమయింటికి భోజనమునకుఁ బిలిచి యున్నారు. కాని తాము దరిద్రులగుటచే ననుపపత్తివలన నాతిథ్యవిషయమునం దాతని కేమేమిలోపములు జరిగియుండెనో యనియు

నందువలనఁ దమకేమగునోయనియుమిగులసంకోచించిరి. కాని యాసంకోచము వారిహృదయమున నెంతయోసేపుండలేదు. అతిథిసత్కారముల నంది దైవజ్ఞుఁడు వెడలిపోయెను.

సుభద్రాంగి యింతవఱకు సిగ్గుచే నొకచోటఁ గూర్చుండి యుండెను. ఆతఁడు వెడలిపోయినతరువాత నెప్పటివలె నాయింట మసలుచుఁ దల్లి కింటిపనులలో నించుక తోడుపడుట కారంభించెను.

ఆసమయమునందు గృహస్థుఁడు గృహిణింబిలిచి దైవజ్ఞుఁ డేమేమి చెప్పియుండెనో యన్నిసంగతులను సవిస్తరముగఁ దెలుపనారంభించెను. మొదటినుండియు నెల్లసంగతులను వినవలయునని గృహిణి యాత్రముతోడనే యుండెను. కాని పనులతొందరవలనను గుమారితెనయొద్దనుండుటవలనను దనభర్తం గూర్చి యింతవఱకు నామె యావిషయమున బ్రశ్నించియుండలేదు. అప్పుడాదైవజ్ఞునిభవిష్యద్వాణింగూర్చి యెంతవఱకుఁ దనభర్త తనకుఁ జెప్పియుండెనో యామాటలు మరలమరలవినవలయు ననియే యామె వేఁడుకపడఁజొచ్చెను.

గృహ—ఇప్పుడు మన మేమి చేయవలయును?

గృహి—నేనేమి చెప్పఁగలను?

గృహ—ఎట్లో యొకవిధముగ నాలోచించి యేదైన నుపాయమును జెప్పుము!

గృహి—ఇంకను నుపాయమేమి? దేవుఁడు మనయెడల నెంతదయ కలిగియున్నాఁడు! మనసుభద్రాంగి నిజముగా మహారాజ్ఞి యగునా?

అని చెప్పుచుండఁగా నామెకన్నులలో నానందబాష్పములు మిలమిల మెఱయఁజొచ్చెను.

గృహ—మనసుభద్ర పరమసుందరి—ఉమాసమానురాలు. అదృష్టవశమున నీమె నేమహారాజునకైన నుపాయనముగ నొసంగినచో నాతఁడీమెను దనపుత్రవధువుగ ననుగ్రహించు ననుట యసంభవముకాదు. కాని యిట్టిదరిద్రబ్రాహ్మణునియింటి కేమహారాజువచ్చును?— వారికటాక్షావలోకన మెట్లు లభియించును?

గృహి—ఇఁక నేమియుపాయము?

గృహ—నేనీ చిన్నిబాలికను వెంటఁబెట్టుకొని మహారాజగుబిందుసారునిరాజధానికిఁ బాటలీపుత్రమునకుఁ బోయెదను. ప్రయత్నించెను—భగవదనుగ్రహ మున్నచో మహారాజుశుభదృష్టి లభియించును.

గృహి—ఈయాఁడుబిడ్డను వెంటఁబెట్టుకొని దూరదేశమునకుఁ బోవుట యేమంతమంచిది? ఇందునుగూర్చి లోక మేమనుకొనును ?

గృహ—అనుకొననిమ్ము! ధర్మమును దైవమునుసాక్షిగ నుంచుకొని నేనీకార్యమునఁ బ్రవేశించెదను. నాచిన్నిసుభద్రమేలుకొఱకుఁ బనిచేయుచున్ననాకు లోకమువలనినిందాస్తుతులతో నిమిత్తము లేదు. నేను తప్పక పాటలీపుత్రమునకుఁ బోయెదను. ఈప్రయాణము శుభదాయక మగునని దైవజ్ఞుఁడు చెప్పియున్నాఁడు.

మూడవ ప్రకరణము.

పాటలీపుత్రయాత్ర.

బ్రాహ్మణుఁడు తనభార్యతోఁ బాటలీపుత్రమునకుఁ బోయెద నని చెప్పినతరువాత నందులకుఁ దగినప్రయత్నములను జేయ నారంభించెను.

అది వేసవికాలము—వైశాఖమాసము—సుడిగాల్లువీచు దినములు. నౌకాయాత్రకది మంచిసమయముకాదు. ఇంతేకాక విదేశమునకుఁ బోవలసి వచ్చినచోఁ బ్రయాణవ్యయమునకును గృహవ్యయమునకునుగూడ ధనము కావలయును. ఎట్లో యన్నియును సమకూర్చుకొనుట కాబ్రాహ్మణున కించుక యాలస్యమయ్యెను. ఆచంపకనగరమునందలి దయాళుఁడగు నొకవర్తకుఁ డాతనికిఁ దగినసాహాయ్యము చేసెదనని మాట యిచ్చెను. ఆశ్వీజమాసమునం దావర్తకునిపెద్దయోడ యొకటి వాణిజ్యవస్తుఫలం దీసికొని పాటలీపుత్రమునకుఁ బోవలసి యుండెను. బ్రాహ్మణుఁడు తనకుమార్తెం దీసికొని యాయోడపై నెక్కిపోవుటకు స్థిరపఱచుకొనియెను.

క్రమముగ వర్షాకాలము వచ్చెను. నదీనదములు జలప్రపూర్ణము లయ్యెను. చంపావతీనది చిన్నదియేయయ్యునిప్పు డుభయకూలముల నొఱసి ప్రవహించుచుండెను. ఇప్పు డానదీతీరమునకుఁ జిన్నవియుఁ బెద్దవియుఁగూడ వర్తకనౌకలు వచ్చుచుఁ బోవుచుండెను. ఆశ్వీజమాసము వచ్చినది. బ్రాహ్మణుఁడు

నిర్దిష్టదినమున సుభద్రాంగిని వెంటఁబెట్టుకొని యావర్తకుని యోడపై నెక్కి రాజధానికిఁ బ్రయాణ మయ్యెను.

నాలుగవప్రకరణము.

పాటలీపుత్రము.

మహారాజగు బింబిసారుని కాలమున మగధరాజ్యమునకు రాజగృహము రాజధానిగ నుండెను. రాజగృహమునకు నలుదెసలను బర్వతపంక్తు లుండుటచే నానగరము శత్రుదుర్భేద్యమై యుండెను. రాజులు తమరాజ్యరక్షణవిషయంబున నెప్పుడును నిర్విచారముగ నుండఁజాలరు; ఎల్లప్పుడును దమరాజ్యమును విస్తరింపఁజేయవలయు ననియే ప్రయత్నించు చుందురు. బింబిసారునిపుత్రపౌత్రులు తామారాజగృహమునందే యున్న యెడలఁ దమరాజ్యమును విస్తరింపఁజేయుటకును, దామున్నతిం బడయుటకును దగినంతయవకాశ ముండదని తలంపసాగిరి. క్రమముగా బింబిసారునిసంతతివారిదృష్టి పాటలీపుత్రమువైపునకుఁ బ్రసరింపసాగెను. గిరిరాజసుహిత యగుగంగయు, వింధ్యాచలసుతుం డగుహిరణ్యబాహువు (శోణనదము) ను గలసికొన్న రమణీయస్థానమునఁ బాటలీపుత్రనగరము నిర్మింపఁబడియెను. శత్రువులకు దుర్భేద్యముగ నుండుటకును, రాజ్యము విస్తరించుటకును, నగరశోభ యతిశయించుటకును, నాగరకులసౌకర్యము

నకును, వాణిజ్యము వర్ధిల్లుటకునుగూడ నీనదీనదసంగమస్థానము సర్వవిధముల ననురూపమైనదని నిరూపింపఁబడియెను. చంద్రగుప్తుని రాజ్యకాలమునుండియుఁ బాటలీపుత్రనామము దేశవిదేశములఁ బ్రఖ్యాతినందఁ దొడంగెను. ఆకాలమునందుఁ బాటలీపుత్రము గంగాశోణసంగమస్థానమున శోణనదమున కుత్తరతీరమునం దున్నట్లు తెలియవచ్చుచున్నది. కాలవశమున నిప్పటికా పాటలీపుత్రనగరచిహ్నములుకూడ మన కగపడుట లేదు. ఉన్నను మన కది దుర్బోధ్యము—

చంద్రగుప్తసార్వభౌముని కాలమునఁ బాటలీపుత్రసౌందర్యసమృద్ధుల కవధియే లేకయుండెను. చంద్రగుప్తుని రాజప్రాసాదము దారునిర్మితమైనది. ప్రాసాదప్రాచీరములును, స్తంభములును సమస్తమునుగూడ రమణీయదారునిర్మితములే యై యుండెను. గృహస్తంభము లన్నియును సువర్ణరజతద్రవములతోఁ జిత్రరూపమునఁ బూఁతలు పెట్టఁబడి యుండెను. విశాలాయతరమణీయోద్యానమధ్యమునం దారాజమందిరము నిర్మింపఁబడుటచే దానిశోభాసౌందర్యములు శతగుణాధికవిలసితములై యుండెను. ఆవిశాలప్రాంగణమధ్యమునం దచ్చటచ్చట సరోవరములును, జలయంత్రములును, బుష్పవాటికలును శోభిల్లుచుండెను. రాజధాని దృఢప్రాకారసమన్వితమై, యగాధపరిఖావేష్టితమై యుండెను. అసంఖ్యాకసైన్యముచే నానగరము సర్వదా రక్షింపఁబడుచుండెను. నగరమునం దంతటను బ్రజలసుఖస్వాస్థ్యములకై యనేకవిధము లగుసదుపాయములు చేయఁ

బడియెను. చంద్రగుప్తుని ప్రబలప్రతాపమును, రాజప్రాసాదశోభాసంపత్తియు, నగరసౌందర్యమును, సంపత్సమృద్ధియు, సకలనియమానుకూల సమీకరణమును, సమీచీనశాసనమును గారణముగ నా పాటలీపుత్ర మాకాలమునందే కాక తరువాతఁ జాలా కాలమువఱకును భారతవర్షమునందును విదేశములందు నుగూడ విశేషవిఖ్యాతి నంది యుండెను.

చంద్రగుప్తసార్వభౌముని యనంతరము క్రీ॥ పూ॥ 297 వ సంవత్సరమున నాతని కుమారుఁ డగు బిందుసారుఁడు పైతృకం బగు పాటలీపుత్రసింహాసనము నధిరోహించెను. క్రమముగ మహారా జగు బిందుసారుని ప్రతాపకీర్తులు సర్వదేశము లయందును బ్రచారితము లయ్యెను.

చంపకనగరదరిద్రబ్రాహ్మణుఁ డా బిందుసారుని కీర్తిప్రతాపముల నాలకించి విశేషముగ నాశపడి తనకుమారీరత్నమును వెంటఁ బెట్టుకొని యా పాటలీపుత్రనగరమునకుఁ బ్రయాణమయ్యెను.

అయిదవ ప్రకరణము.

రాజదర్శనము.

ఆ బ్రాహ్మణుఁడు తనకుమారీమణిని సౌకయం దుంచి తా నొక్కఁడును బాటలీపుత్రనగరమునం బ్రవేశించెను. ఆ పట్టణమునందలి సుప్రశస్త రాజపథంబులను, సుందరసౌధమాలికలను, మనోహరవస్తుప్రపూర్ణంబు లగు విపణిశ్రేణులను, నానాదేశజనసమూహములను జూచి యా దరిద్రబ్రాహ్మణుఁడు విస్మయవిభ్రాంతులకు లోనై పోయెను. ఎట్లో యాతఁడు నాలుగైదు దినములలో నగరమధ్యమునం దొకచోట నాశ్రయమును సంపాదించుకొనియెను. క్రమముగ నెంతయో ప్రయత్నించి రాజమంత్రి యగు రాధాగుప్తుని దర్శించి మహారాజసందర్శనము చేయింపవలయునని ప్రార్థించెను. రాధాగుప్తుఁడు సదయహృదయుఁడై యా బ్రాహ్మణునకు రాజసందర్శనభాగ్యమును లభియింపఁ జేసెద నని చెప్పెను.

నిర్దిష్టదినమున శుభముహూర్తమునందా బ్రాహ్మణుఁడు రాజసభాంతరాళమునఁ బ్రవేశించెను. ఆ బ్రాహ్మణుఁడు క్రొత్తవాఁడు. రాజసభయందలి యందఱు నాతని కపరిచితులు. ఒక్క మంత్రిని మాత్ర మాతఁడు కొంతసేపటికిఁ జూడఁగలిగెను. ఆ బ్రాహ్మణుఁడు గ్రంథములలో నింద్రసభావర్ణనమును విని యుండెను. ఇప్పు డాతఁ డింద్రసభలోఁ బ్రవేశించితినని యనుకొనియెను. మహారాజమణి యగు బిందుసారుఁడు మయూరసింహాసనమున నధివసించి యుండెను. అమాత్యు లమరులం బోలి యథాస్థానము నలంకరించియుండిరి. ఇంద్రచంద్రవాయువరుణప్రముఖు లెల్లరు నాతని కొక్కచో నగపడుచున్నట్లుండెను. ఎవ్వరిని వదలి యెవ్వరిని జూడవలయునో యాతనికి బోధపడుట లేదు. ఎవ్వరినైనఁ దదేకదృష్టితో వింతగఁ జూచుచుండినచో నసభ్యజనోచితముగ నుండు నేమో యని యాతఁడు

సంకోచించుచుండెను. అప్పు డాతఁ డాశాదృష్టులతో మంత్రి యెచ్చటనుండెనో కనుపెట్టవలయు ననియు, నాతనికిఁ దన్ను గాన్పించుకొనవలయు ననియు నలుదెసలఁ బరికించుచుండెను. పిమ్మట నాతఁడు మంత్రిచేసన్నచే నించుక స్వస్థచిత్తుఁడై కూర్చుండి యుండెను.

దైనికరాజకార్యములు పూర్తియైనతరువాత రాజాజ్ఞచే మనవులఁ దెలుపుకొనవలసినవా రొక్కరొక్కరుగ మహారాజ సమ్ముఖమునకుఁ బోయి తమతమప్రార్థనములం దెలుపుకొని వెడలిపోవుచుండిరి. తుదకుఁ జంపకనగరబ్రాహ్మణుఁడు కూడ రాజసమీపమునకుఁ బోయి నిలువఁబడియెను. బ్రాహ్మణుఁడు యథావిధిగ సార్వభౌము నభినందించి, ధాన్యమును దూర్వాంకురములను నొసంగి యీవిధముగ నాశీర్వదించెను.

"నిగమమంత్రార్థసిద్ధి నీ కగునుగాక!
అఖిలశత్రువినాశన మగునుగాక!
ఆప్తబంధుమిత్రులకు మే లగునుగాక!
ధనము, ధాన్యంబు, ధర్మంబు ధరణితలము
చిరతరాయుష్యము, సుఖంబు, వరయశంబు,
వారణతురంగయానాది వైభవంబు
భాసురాపత్యసిద్ధి, సుశ్రీసమృద్ధి,
అభిమతార్థోపలబ్ధి నీ కగునుగాక!"

సార్వభౌముఁ డగుబిందుసారుని యమూల్యమణిమయకిరీటాలంకృతం బగునుత్తమాంగ మాదరిద్రబ్రాహ్మణునియాశీ

ర్వాదపరిగ్రహణమునకై యించుక యవనత మయ్యెను. రాజాజ్ఞానుసారముగ నప్పు డాబ్రాహ్మణుఁడు "రాజపరమేశ్వరా! నాకొకకన్యారత్న మున్నది. ఆమె పరమరూపలావణ్యవతి; సకలశుభలక్షణసమన్విత—ఎందఱో దైవజ్ఞు లీమె రాజమహిషి యగునని వాక్రుచ్చి యున్నారు. మహారాజా! నేనీకన్యకు జనకుఁడను. ప్రేమవశమున నాశాలుబ్ధుఁడనై దేవరకు శరణాగతుఁడ నైతిని. ప్రభూ! అనుగ్రహముంచి మాకన్యను బరిగ్రహింపవలయును. ఇదియే యీదరిద్రబ్రాహ్మణునివినయపూర్వకవిజ్ఞాపనము." అనియెను.

చక్రవర్తి యగుబిందుసారుఁడు "స్త్రీరత్నం దుష్కులాదపి" అనువాక్యమును స్మృతికిఁ దెచ్చుకొని యాకన్య నంతఃపురమునకుఁ బంపవలయు నని యాజ్ఞాపించెను. మంత్రి యగు రాధాగుప్తుఁడు రాజాజ్ఞను యథావిధిగఁ బ్రతిపాలించెను.

దరిద్రబ్రాహ్మణునిరాజసందర్శన మీవిధముగా ఫలించెను.

ఆఱవ ప్రకరణము.

రాజాంతఃపురము.

బ్రాహ్మణుఁడు రాజాస్థానమునుండి తిరిగి వచ్చి సుభద్రకు సమస్తవృత్తాంతమును దెలియఁజేసెను. భవిష్యత్సుఖచిత్ర మతిమనోహర మైనదే యైనను చిరకాలమువఱకుఁ దండ్రి తన

యను విడిచి యుండుటయు, బాలిక తల్లిదండ్రులను విడిచి యుండుటయుఁ దటస్థించుటవలన నది విచారకరముగనే యుండెను. కన్నీరు భవిష్యత్సుఖప్రదర్శనమునకు మార్గమునందుంచిన నుంచుఁగాక! వర్తమానమునందైన నొండొరులు పరస్పరముఁ జూచుకొనకుండ నామార్గమున కడ్డమువచ్చి నిలిచినది!! కొంతసేపీవిధముగఁ గడచిపోయినది. పిమ్మట నియమితసమయమున వాహనాదికవైభవములతో సుభద్రాంగి రాజాంతఃపురమునకుఁ దీసికొనిపోఁబడియెను.

అనంతర మాబ్రాహ్మణుఁడు పాటలీపుత్రమునఁ గొన్ని దినములుమాత్ర ముండి శూన్యహృదయుఁడై తనముద్దుబిడ్డ మహావైభవమునుభవించుచు సుఖపడఁగలదనునాలోచనతో మరలఁ జంపకనగరమునకుఁ బ్రయాణ మయ్యెను. సుభద్రాంగి యప్పటినుండి పితృగృహస్మృతి, కల్పనములు, కథలు మొదలగు వానిమూలమున సంతుష్టి నందుచు రాజాంతఃపురమునందుండి తల్లిదండ్రుల కించుక యూరటను గల్పించుచుండెను.

ఎక్కడిదరిద్రకుటీరము!—ఎక్కడిరాజాంతఃపురము!!!

చిన్నిగోరవంకను గులాయమునుండి విడఁదీసి శోభనప్రమోదోద్యానమందిరమున విశాలకనకపంజరమునందు బంధించినచో దానిమనోభావ మెట్లుండునో, సుభద్రాంగిమనోభావముకూడఁ జాలవఱ కట్లేయుండెను. సుభద్రాంగిపుట్టినయింటిముంగిటివాఁకిలి చిన్నదియే—కాని యదియామెచిన్నిపాదములకును, లీలా

తరళనయనయుగళంబునకును బరిమితస్థానమై యుండలేదు. దానికిమాఱుగా నిప్పుడాబాలికకుఁ బ్రాకారవేష్టితప్రాసాదములును విశాలసరోవరంబులును, జలయంత్రములును, పుష్పలతామనోహరవిశాలప్రాంగణములును లభించి యున్నవి. కాని యివియన్నియు నామె కూపిరి త్రిప్పుకొనుటకైన నవకాశములేనంతటిపరిమితస్థలములుగనే తోఁచుచుండెను. మానవప్రకృతులయెడల సహవాసప్రభావ మనంతమైనది—క్రమముగ నాబాలికకు రాజాంతఃపురమునందలి దృశ్యము లన్నిటితోడను బరిచయమయ్యెను. అప్పు డామెచంచలహృదయము సుస్థిరమైన దయ్యెను. ఈవిధముగా బాలిక నవయౌవనవతి యయ్యెను. క్రమముగా యువతియయ్యెను. ఆమెరూపలావణ్యములు శుక్లపక్షచంద్రకళలవలె దినదినప్రవర్ధమానములు కాఁజొచ్చెను. వానితోఁగూడ నామెసపత్నీగణముల యీర్ష్యాద్వేషములును వర్ధిల్లసాగెను. అప్పుడు వారందఱును మిగులఁ గౌశలముతో సుభద్రాంగి మహారాజుకంటఁ బడకుండునట్టిప్రయత్నములను జేయ నారంభించిరి.

పరమేశ్వరునియజ్ఞాతనియమవశంబున మనుష్యహృదయములయందు విస్మృతి యుదయించుచుండును. ఈనియమముచేతనే యొకప్పుడు సార్వభౌముఁ డగుదుష్యంతుఁడు శకుంతలను మఱచిపోయెను. మహారాజగుబిందుసారుఁడుకూడ నీనియమమున కతీతుఁడై యుండలేదు. అంతఃపురవధూజనముల చాతుర్యమువలనను విస్మృతివశమునను బిందుసారుఁడు సుభ

ద్రాంగిమాటయే మఱచిపోయెను. కాని సుభద్రాంగిమాత్రము నిశ్చింతురాలై యుండలేదు.

ప్రపంచమునందలిజనుల కందఱకును శత్రులును మిత్రులుఁగూడ నుందురు. సుభద్రసవతు లామెరూపలావణ్యములం గాంచి యీర్ష్యాపరవశలై శత్రుత్వమును జూపుచున్నమాట సత్యమే—కాని యంతఃపురపరిచారికలలోఁ జాలమంది యా సుభద్రాంగితో మైత్రి నెఱపుచు నామెయెడల సహానుభూతిఁ జూపుచు మంచిచెడ్డలను గూర్చి నివేదించుచుండిరి.

లోకమునం దనేకవిధములగుజను లున్నారు. కొందఱు జరగిపోయినదానింగూర్చి విచారించుచుందురు. కొందఱు వర్తమానముం జూచుకొనుచు నానందించుచుందురు. మఱికొందఱు అతీతవర్తమానములయందు విరక్తులై కేవలముభవిష్యత్కాలముకొఱకే తలయెత్తుకొని చూచుచుందురు. రాజాంతఃపురమున యమున యనుపేరుగల పరిచారిక యున్నది. ఆమెవయసు నలువదియేండ్లకు మించి యుండును. ఆమె రాజాంతఃపురమునందలి యెల్లసంగతుల నెఱుంగును. అనేకుల నామె బాగుగ నెఱుంగును; వారిస్వభావములఁగూడ నెఱుంగును. మఱియు నామె రాజస్వభావమునుగూడ నామూలముగ నెఱుంగును. సుభద్రాంగిరూపలావణ్యమునుగూర్చియు నామెగుణగణములను గూర్చియు నామె తనలో ''ఇట్టిరూపమును, నిట్టిగుణములును గూడ నెప్పుడును వ్యర్థములు కాఁజాలవు. ఎప్పుడో యీమె కొకశుభదినము రాఁగలదు. కావుననే యిప్పటినుండియు నీమె

తో మైత్రి సంపాదించుకొందును. కష్టకాలమునందుఁగావించిన యుపకార మెన్నటికి నెవ్వరును మఱచిపోఁజాలరు'' అని యీ విధముగ నాలోచించుకొని యమున సుభద్రాంగిని ప్రత్యక్షముగను నప్రత్యక్షముగనుగూడ సేవించుచుండెను—ప్రేమించుచుండెను; ఆమెకష్టసుఖములు తనవిగ భావించుకొనుచుండెను. ఈవిధముగ నామె సుభద్రాంగికి సర్వవిధముల మంగళాకాంక్షిణియై యుండెను.

యమునాసుభద్రలు శుభసమయమున కెదురుచూచుచుండిరి. దినము గడచిపోవుచుండెను; రాత్రియును గడచిపోవుచుండెను; మాసములును వత్సరములునుగూడఁ గడచిపోవుచుండెను. కాని శుభసమయచిహ్నమైనను వారి కగపడుట లేదు. తుద కొకనాఁడు మంచిసమయము దొరకెను.

అది ఫాల్గునమాసము—పూర్ణిమారాత్రి రెండవజాము గడచిపోయినది. మందమందమారుతములు వీతెంచుచుండెను. ఆవాతపోతస్పర్శనమున నొడలు పులకించుచుండెను. సమీపవృక్షాంతరాళమునందుండి యొకకోకిలతనకలకుహూస్వరంబున నమృతసేచనముఁ గావించుచు దిగంతముల నమృతరసప్లావితములుగఁ జేయుచుండెను. పూర్ణచంద్రుఁడు వెన్నెలలఁ గ్రుమ్మరించుచుండెను. ఆమధురకుహూనినాదమును, నావిసర్మలకౌముదీవిలాసమును, నేకీభవించి తమమోహిసీదివ్యశక్తిచే లోకమును ముగ్ధప్రాయముగఁ జేయుటకుఁ బ్రయత్నించుచుండెను—మహారాజాధిరాజులు మహావైభవసంపన్నులై యుందురు;

కాని వారి కొక్క విషయమునమాత్రము గర్భదరిద్రులకంటెను మించిన దారిద్ర్యము కలదు. ప్రకృతిసౌందర్యమును గాంచు భాగ్యము వారికిఁ దఱచుగ లభియింపదు. వారు చారముఖంబున నెల్లవారలనువినుచుందురు. చాటుకారులవలన గుణపరిచయము గావించుకొనుచుందురు. చిత్రరూపములమూలమున సౌందర్యమును భావించుకొనుచుందురు. ఒక్కరును సుఖముగనుండుటకు వారి కెప్పటికో గాని సమయముదొరకదు. నిరంతరమును బార్శ్వచరులచేఁ బరివేష్టింపఁబడి వారికర్ణములతోడనే వినుచు వారిదృష్టులతోడనే చూచుచు నుందురు—ఇప్పుడొక్కించుక సేపు మహారాజగు బిందుసారుఁ డట్టిపరాధీనతాహస్తములనుండి విడివడి యొకపుష్పారామమధ్యమునం బ్రచారము చేయుచు నేమేమియో భావించుకొనుచుండెను.

ఆసమయమునం దాకస్మికముగ నొకయువతీమూర్తి యచ్చటకు వచ్చెను. ఆమె యతిలోకసుందరీమణి—మహారాజు దృష్టి యింకను నామెపైఁ బ్రసరించియుఁ బ్రసరింపకమునుపే యారమణీమూర్తి మహారాజుపాదపద్మసాన్నిధ్యమున సాష్టాంగపడి యుండెను. ఆసందర్భమున సార్వభౌముఁ డించుక యులికిపడియెనుగాని యొక్కించంత సేపటిలో స్థిరహృదయుఁడై యామెను జూచి "తెమ్మా! నీకోరిక యేమియో తెలుపుము!" అనియాదరముతోఁ బలికెను. అప్పుడు సుభద్రాంగితనచరిత్ర మంతయు నాప్రభుచంద్రునకు విన్నవించెను. బిందుసారున కప్పుడెల్లసంగతులు నింతలో స్మృతికి వచ్చెను. ఆమెయెడలఁ దన

భార్యలందఱును జేసినమోసము నప్పు డాతఁడు గ్రహింపఁగలిగెను. తా నింతవఱకును సందేహించినసంగతి వట్టిభ్రమ యని నిశ్చయించుకొనియెను—బిందుసారుఁ డా బ్రాహ్మణకుమారీ రామణీయకవిలాసములం బ్రత్యక్షముగఁ గన్నులారఁ గనుంగొనియెను.

ఏడవ ప్రకరణము.

పుత్రలాభము.

మహారాజగు బిందుసారున కేఁబదిమంది రాణులుకలరు. ఇంతకాలమువఱకు వారిలో ధర్మాదేవి యొక్కతెయే సార్వభౌమునకుఁ బ్రధానమహిషియై యుండెను. మఱియు నామె యువరాజగుసుషీమకుమారుఁ గన్నతల్లి!—అందుచే నామె రాణులకందఱకు నధికారిణియై యుండెను. మహారాజుకూడ నామెమాటకు జవదాటలేదు. ఈవిధముగఁ జాలదినములు గడచినవి. బిందుసారుఁడు సుభద్రాంగిం జూచినతరువాతనుండి యీవిషయమునం దించుకవ్యతిక్రమము గానవచ్చుచుండెను. రాజానుగ్రహము తీవ్రము గలనదీప్రవాహమువంటిది. అది యొకప్పు డొకతీరము నొఱసి భంగించుచున్నప్పుడు మఱియొకతీరమును బలపఱచుచుండును. ఇప్పుడు మహారాజ్ఞీమణియగు ధర్మాదేవితల తిరిగిపోవుచుండెను. క్రమక్రమముగా నిప్పు డామెప్రభావప్రతిపత్తి తగ్గిపోవుచున్నది.

రాణి యగుసుభద్రాంగి కిప్పుడు మంచికాలము వచ్చినది. ఆమె యిప్పుడు రాజాధిరాజగుబిందుసారునకు రాణులలో నెల్లఁ బ్రియతమురాలై యుండెను. సుభద్రాంగికిఁ గష్టసమయము గడచిపోయినది; సుఖసమయము వచ్చినది. అదియును గడచిపోవుచున్నది. దినము, యామిని, మాసము, వత్సరము, శిశిరము, వసంతము మొదలగునవి యన్నియుఁ జక్రివర్తన్యాయమునఁ దీవ్రవేగముతో వచ్చుచుఁ బోవుచుండును.

వానితోఁగూడఁ గోరుకొనఁదగిన సుఖసమయమునందలి నూతనత్వముకూడ జరగిపోవుచున్నది. ఇప్పు డామెహృదయమింకను నట్టినూతనత్వముకొఱకు వ్యాకులపడుచుండెను. ఆనూతనత్వమునందలి మనోహరత్వముం గూర్చి తెలుపుచు యమున యామెకోరికలను మఱింతవర్ధిల్లఁజేయుచుండెను. సుభద్రాంగిసపత్ను లందఱును బుత్రవతులై యుండిరి. ఆమెకు మాత్రమింకను బుత్రముఖసందర్శనసుఖలాభము కలుగలేదు. ఆకారణముచేఁ దనపై మహారాజున కించుకయనాదరము కలుగునేమో యనువిచార మామెహృదయమును వేధింపసాగెను.

రాణి యగుసుభద్రాంగి సంపూర్ణయౌవనవతియై యుండెను. ఆమెహృదయమున నిరాశచ్ఛాయ లించుకించుక ప్రసరించుచుండుటచే నామెరూపయౌవనవిలాసకాంతు లించుకించుక మ్లానములు కాఁజొచ్చెను. కాని,యారాజ్ఞీమణి కిట్టియవస్థ యెన్నియోదినములవఱకు నిలిచియుండలేదు. ఆమె కిప్పు డించుక యస్వస్థతగా నున్నట్లు తోఁచుచుండెను. హంసతూలికా

తల్పమున శయనించుటకూడ నామెకుఁ గష్టముగా నుండెను; సుఖాద్యములుకూడ ననపేక్షితము లైపోయెను; అమృతమునందును నరుచి యుదయించెను—మట్టిదినవలయునని మనసయ్యెను. అప్పుడు సుభద్రాంగి యమునతోఁ దనశరీరపీడంగూర్చి యంతయును జెప్పెను. ఆమాటల నాలించి యమున పరమానందముతో "అమ్మా! ఇవియన్నియును బీడాలక్షణములు కావు—సర్వమును శుభలక్షణములే" అని బోధించెను.

క్రమముగా నీసంగతి యంతఃపురమునం దంతటను వ్యాపించెను. నూత్నరాజ్ఞీమణికూడ సంతానవతి యగునని యందఱు ననుకొనుచుండిరి. గర్భస్థశిశువు దినదినము నెట్లు వర్ధిల్లుచుండెనో యట్లే సుభద్రాంగిసపత్నులయీర్ష్యానలముకూడ వర్ధిల్లఁజొచ్చెను. అప్పుడు రాణులలోఁ గొందఱు "మంచిది. సుభద్రాంగి గర్భవతి యైనది. అదృష్టవంతురాలు! మంచిసంతానమే కలుగును. కాని, రాకరాక గర్భము వచ్చినది. ఇంతవయసులోఁ దొలుచూలు! నిరపాయముగఁ బ్రసవింపవలయునుగద! ఏమో! ఏనాఁటి కెట్లు వచ్చునో యెవ్వరికిఁ దెలియును" అని యనుకొనుచుండిరి. కోటయం దంతటను నామెగర్భముంగూర్చినమాటలే. ఆగర్భమే యామెజీవితమార్గమును నిష్కంటకముగఁ జేసివైచెను; అదియే యామెరాజ్ఞీస్థానమును దేవతాస్థానముగఁ బరిణమింపఁజేసెను!!

దేవత లెల్లప్పుడు నందఱిప్రార్థనములను—అన్నిప్రార్థనములను సంపూర్ణముగ సిద్ధింపఁజేయరు. సుభద్రాంగిసపత్నుల

మనోగతప్రార్థనములు సంపూర్ణముగ ఫలియింపలేదు. రాణియగుసుభద్రాంగి యొకశుభముహూర్తమునం దొకకుమారుని గనియెను. క్రొత్తరాణి పుత్రవతి యయ్యెను. ప్రసవసమయమునం దామె కెట్టికష్టమును గలుగలేదు. ఆకారణముచేఁ గుమారున కశోకుఁడని నామకరణము గావింపఁబడియెను.

ఎనిమిదవ ప్రకరణము.

అశోకుని శైశవము.

రాజ్ఞీరత్న మగుసుభద్రాంగి పుత్రముఖసందర్శనమునఁ బరమానందభరితహృదయ యయ్యెను. మహారాజుకూడఁ దనవలెనే యానవకుమారసందర్శనమునఁ బరమానందరసనిమగ్నుఁడగు నని యామె యనుకొనియెను. కాని యామెకోరిక యీవిధముగ ఫలియింపలేదు. మహారాజు యథాసమయమునం దే పుత్రముఖావలోకనముం గావించెను. కాని యప్పు డాతనికన్నులలోఁ బ్రేమరసతరంగములు పొడసూపలేదు; ఆతనిముఖమండలమున నానందకౌముదీవిలసిన మగపడలేదు. కేవల మప్పుడాతఁడు ధనరత్నాదికముల దానముచేసి కుమారుని నాశీర్వదించిమాత్రము వెడలిపోయెను. సుభద్రాంగి యిదియంతయును బరిశీలించి చూచుచునే యుండెను. మఱికొందఱుపరిచారికలుకూడ నాభావమును గ్రహించియుండిరి.

ఒక్కనిముసములో నీసంగతి యంతయును సుభద్రాంగి సవతులచెవులఁ బడియెను. మహారాజు వాసీనుఁడై యుండెనని వినుటవలన వారియీర్ష్యానల మించుక శాంతించెను. ఆరాణులలో నొక్కరొక్క రొక్కొక్కవిధముగఁ జెప్పుకొనసాగిరి. తుదకు వారందఱు గర్వితురా లైనసుభద్రాంగికిఁ దగినశాస్తి యైనదని నిశ్చయించుకొనిరి. "ఎంతగర్వము! ఇంతటిగర్వము ధర్మాదేవి యెట్లుసహించినదో?—దర్పహారి యగుమహారాజు సుభద్రాంగిదర్పభంగమును బాగుగఁ గావించినాఁడు—ఇప్పటికిది ప్రథమసూచనామాత్రము" అని యనుకొనిరి. కాని ప్రకృతస్థితి యది కాదు. సుభద్రాంగియపరాధ మేమనిన:—ఆమెకుమారుఁ డితరరాజకుమారులవలె సుందరుఁడు కాఁడు. ఇంతియకాక చూపులకు మిగులఁ గురూపియై యుండెను. ఆతని కంతగా నంగసౌష్ఠవము లేదు. ఆతనిశరీరచ్ఛాయ గౌరవర్ణవిలసితమై యుండలేదు.

ఈసకలకారణములచేతను రాజప్రథమదృష్టి యశోకకుమారునిపైఁ బ్రేమపూర్ణముగఁ బ్రసరించినది కాదు. బిందుసారుని యేకాధికశతపుత్రులలోఁగూడ నాతని ప్రథమమహిషీతనయుఁ డగుయువరాజు సుషీముఁ డొక్కఁడుమాత్రమే ప్రియతముఁడై యుండెను.

ఎవ్వ రేమనుకొన్న నేమి? సుభద్రాంగిమాత్రము కన్నబిడ్డ యగునశోకునిం జూచి యెల్లకష్టములను మఱచిపోయెను. ఆమెప్రేమోపచారములచే నశోకుఁడు శుక్లపక్షచంద్రుని

వలె దినదినప్రవర్ధమానుఁ డగుచుండెను. బాలుఁ డగునశోకుఁడు తనగురువులు తనుంగూర్చి చెప్పుకొనువారిమాటలయర్థ మెంతమాత్రమును గ్రహియించియుండలేదు. కేవలమాతఁ డెన్నఁడు నొక్కనిమిషమందైన దుఃఖించియుండలేదు. అశోకుఁడు రాజగృహమునం గలయెల్లరాజకుమారులతోడను సమానానందముననే — సమానోత్సాహముననే యాటలాడుకొనుచుండెను. క్రమముగ నశోకునకుఁ బసితనము వదలుచుండెను. బాలకుఁ డగునశోకున కప్పుడు విద్యాశిక్ష ప్రారంభ మయ్యెను. క్రమముగ నాతనికి లోకజ్ఞానము కలుగుచుండెను. అప్పటినుండియే బాలకుఁ డగునశోకుఁడు తనతండ్రిచర్యలయందలిపక్షపాతమును గ్రహియించియుండెను. ఆరాజగృహంబున నాచంద్రశాలామంటపమధ్యమున నవవికసితశతశతపత్రంబులంబోలి విలసిల్లుచున్న తనకుమారులనడుమ భ్రమరనీలవర్ణుండును, శోభాసౌరభహీనుండును గురూపియు నగునశోకుని జూచినప్పుడు బిందుసారుఁ డించుక యప్రతిభుఁడైపోవుచుండెను — తుదకు విరక్తుఁడై పోయెను. బాలకుఁ డగునశోకున కాసంగతి యంతయుం దెలిసిపోయినది. కాని యందులకుఁ గారణముమాత్ర మాతనికి బాగుగ బోధపడలేదు. అశోకుఁడు తల్లియొద్దకు వచ్చి యావిషయముంగూర్చి యడుగునప్పుడు సుభద్రాంగి మ[illegible]రణిలో నాతని కామాట మఱపించివైచుచుండెను.

ఈసకలకారణములచేతను సుభద్రాంగి భ[illegible]ప్రియతమురాలయ్యెను, నిరంతరచింతాసంతప్తహృదయ[illegible]యుండె

ను. కుమారునియెడలఁ దండ్రికిం గలయింతటియుదాసీనత — ఇంతటియసహ్యాభావము తుద కేవిధముగఁ బరిణమించునో యని యామె నిరంతరము విచారించుచుండెను.

అశోకునియెడల బిందుసారున కిట్టియసహ్యాభావమున్నదని తెలియనివా రెవ్వరును లేరు. ఏమైననేమి? జనకునియింతటియసహ్యాభావము కుమారుఁ డగునశోకునికులోచితవిద్యాశిక్షణమునకుమాత్ర మొంతమాత్రమును వ్యాఘాతముం గల్పించియుండలేదు. అదియేమో కాని యశోకుఁడు తనవైమాత్రేయసోదరులకంటె నల్పకాలమునందే యధికవిద్యావంతుఁ డగుచుండెను; సకలవిషయములయందును విజ్ఞానలాభము నందుచుండెను. కుమారుని కుశాగ్రబుద్ధింగూర్చినప్రశంసావచనముల ప్రతిధ్వనులు క్రమముగాఁ దల్లిచెవులఁ బడుచుండెను. అందుచే సుభద్రాంగి పరమానందభరితహృదయ యగుచుండెను.

తండ్రివైముఖ్యము, సవతితల్లులయసూయ, సోదరుల తూష్ణీభావము, గురువులబోధనము, ఉత్సాహసంకల్పనము, జననీప్రేమము, యత్నము, సాంత్వనము మొదలగువానినడుమ నశోకుని శైశవజీవితము గడచుచుండెను.

తొమ్మిదవ ప్రకరణము.

అశోకునిభవిష్యత్తు.

ఒకదినమున మహారాజగుబిందుసారుఁడు తనకుమారుల విద్యాశిక్షణముంగూర్చి పరీక్షింపవలయునని తలంచెను. విద్యా

విషయంబున నెవ్వరెంతటి జ్ఞానమును సంపాదించిరో తెలిసికొనుట యావశ్యకమని మహారాజు భావించెను. రూపగుణశీలంబుల నధికుం డగు రాజకుమారుఁడే భవిష్యత్ప్రభుపదంబున కర్హుఁడై యుండునని యాతనియభిప్రాయము.

శక్తిమంతులును విత్తవంతులు నగువారికోరికలు కార్యరూపమునఁ బరిణమించుటకు విశేషకాలము పట్టదు. మహారాజు తనయుద్దేశమును బ్రకటించినతోడనే రాజకుమారులను బరీక్షించుటకుఁ దగిన స్థలమును, దగిన సమయమునుగూడ నిర్దిష్టములయ్యెను. అన్నియును సంసిద్ధము లయ్యెను.

నగరోపకంఠమున నొకవిశాలోద్యానమునందు రాజకుమారులను బరీక్షించుట కేర్పాటయ్యెను. రాజకుమారులందఱు నాదినమున నచ్చటనే యుండవలయు నని స్థిరపఱచిరి. ఉద్యానమధ్యంబున విశాలంబును, వివృతంబును నగుసమప్రదేశమునఁ గౌముదీప్రభలు కన్నులపండువు సేయుచుండెను. ఆవెన్నెలబయట విచిత్రాసనము లలంకరింపఁబడి యుండెను. ఆచట్టును నవదూర్వాంకురశ్యామంబును, వర్తులాకారంబును నగుభూతలము నయనాభిరామంబై యుండెను.

సూర్యోదయమైనదిమొదలుగ నాసభాస్థలమునకు జనులు వచ్చుటకారంభించిరి. రాజకుమారులుకూడ నొక్కరొక్కరుగ నాయాసమయములయందువచ్చి యాసీనులగుచుండిరి. రాజపుత్రులందఱు నుమనోజ్ఞవేషభూషణాలంకృతులైయుండిరి. రథారూఢులై కొందఱును, తురగారూఢులై కొందఱునువచ్చి

ప్రవేశించుచుండిరి. క్రమముగ నందఱును వచ్చిరి. మహారాజును మంత్రులునుకూడ సభాస్థలమునకు విచ్చేసి యుండిరి. కేవలమొక్కఁడుమాత్ర మచ్చటికి వచ్చియుండలేదు. రాజకుమారుఁడగునశోకునకు యథాసమయమునందీసంగతి తెలిసినది కాదు. అందులకుఁ గారణము వేఱుగఁ జెప్పవలయునా? ఆచంద్రశాలారంగమున—ఆసుందరకుమారమధ్యమునఁ గురూపి యగునశోకుఁడు ప్రవేశించుటకు మహారాజున కిష్టము లేదు. కాని యాతఁడంతస్పష్టముగా నెట్లుచెప్పఁగలఁడు? రాణియగుసుభద్రాంగి కెట్లో యీవార్త తెలియవచ్చెను. తోడనే యామె తనకుమారునిఁ గూడఁ బరీక్షాపరిషత్తునకుఁ బంపించెను. సుభద్రాంగి తనకుమారుని బరీక్షాసభకుఁ బంపఁబోవునప్పటికి రాజాస్థానమునందలి సుందరామూల్యవాహనాదికముల నన్నింటినుపయోగించుకొని తక్కినప్రభుకుమారు లందఱును సభకుఁ బోయియుండిరి. ఒకముసలి యేనుఁగుమాత్రము మిగిలియుండెను. అశోకుఁడు తల్లియొద్ద సెలవు దీసికొని యాయేనుఁగుపై నెక్కి బయలుదేరెను. అప్పటి కాసభారంగ మంతయును జనసమ్మర్దముగ నుండుటం గాంచి యశోకుఁ డాచంద్రాతపబహిర్భాగమునఁ గోమలశాద్వలతలంబునఁ గూర్చుండి యుండెను.

సన్న్యాసి యగుపింగళవత్సజీవుఁడు పరీక్షకుఁడుగ నియమింపఁబడియెను. క్రమక్రమముగ రాజకుమారు లందఱును

పరీక్షింపఁబడిరి. విద్యాబుద్ధులయందు రాజకుమారు లందఱి లోనను నశోకుఁడే యున్నతస్థానము నలంకరించినట్లునిరూపిత మయ్యెను. అతఁడే సుశీలుఁడును సూక్ష్మబుద్ధియు నని యందఱకును బోధపడియెను. కాని యాతఁడు కురూపి; శోభాహీనుఁడు; జనకుని కప్రియుఁడు !! అప్పు డయ్యశోకునియుత్తమత్వముంగూర్చి యంతబహిరంగముగ నంతవిస్పష్టముగఁ బ్రశంసించుట కెవ్వరును సాహసింపఁజాలకపోయిరి. పరీక్షకుఁడగుపింగళవత్సజీవుఁ డెల్లవిధముల బాగుగ నాలోచించెను. "ఈయశోకుఁడు మహారాజునకుఁ గేవల మప్రియుఁడు. సర్వవిధములను రాజసింహాసనమున కశోకుఁడే యర్హుఁడని చెప్పినచో నది యాతనికి మిగులఁ బ్రతికూలముగఁ బరిణమింపఁగలదు. కావున మిగులనిపుణముగ మహారాజునకుసత్యమును బ్రదర్శింపవలయును." అని నిశ్చయించుకొని "మహాప్రభూ! నేనీరాజకుమారుల నందఱను బరీక్షించితిని. వీరిలో నెవ్వరివాహనము సర్వవిధముల నున్నతమైనదో, యెవ్వరిపీఠ మెల్లరీతుల నుత్కృష్టమైనదో, యెవ్వరిపానీయ మెల్లభంగుల నుత్తమమైనదో వారే సర్వవిధములను భవిష్యత్ప్రభుత్వమున కర్హులు" అని చెప్పెను.

ఆమాటల నాలించి రాజకుమారు లందఱును బ్రత్యేకముగఁ దమలోఁదా మాలోచించుకొని తమతమయాసనపానీయములే యితరులవానికంటె శ్రేష్ఠము లని నిశ్చయించుకొనుచుఁ దమయిచ్చవచ్చినతెఱంగున సిద్ధాంతము చేసికొనఁజొచ్చిరి. కురూపి యగునశోకుఁడు సభముగిసినతరువాతఁదల్లియొద్దకు

వచ్చి పింగళవత్సజీవుఁ డొనరించిననిర్ధారణముంగూర్చి యెల్ల సంగతులను దెలియఁజేసెను. అనంతర మశోకుఁడుతల్లియెదుటఁ బింగళవత్సజీవునివాక్యముల కీవిధముగ వ్యాఖ్యానముం గావించెను — నేను పితృపితామహోచితం బగువృద్ధభద్రగజము నధిరోహించి పోయితిని; అదియే సర్వోన్నతవాహనము. నేను శ్యామలదూర్వాదళశోభితం బగుధరణీతలంబున నుపవసించితిని; అదియే సర్వోత్కృష్టమృదులాసనము. నేను వినిర్మలస్నిగ్ధపావనగంగాజలంబులఁ బానము చేసితిని; అదియే సర్వోత్తమపానీయము. కావున మహాత్ముఁ డగునాపింగళవత్సజీవునివాక్యములు సత్యములే యైనచో నేనే భవిష్యత్కాలమునందుఁ బితృసింహాసనమును బొందఁగలుగుదును.

మాతాపుత్రులప్రియసంభాషణ మీవిధముగ జరిగినది. అదిమొదలుగ వారిహృదయము లాశాన్వితము లగుటచే భవిష్యత్సుఖసమయమునకై వారిరువురు నెదురుచూచుచుండిరి.

పదియవప్రకరణము.

జనకునియాజ్ఞ.

మహారా జగుచంద్రగుప్తుఁడు తనబుద్ధిబలమునను బాహుబలముననుగూడ మగధరాజ్యమును జాలదూరము వఱకును వ్యాపింపఁజేసెను. ఆకాలమునఁ దక్షశిల మగధరాజ్యాం

తర్గతమైయుండెను. చంద్రగుప్తుఁడు తానెంతవఱకుఁ దనరాజ్యమును విస్తరింపఁజేసెనో యంతవఱకుఁ దనసత్యశాసనములను గూడఁ బ్రసరింపఁజేసెను—కాని యెల్లకాలము నొక్కరీతిగా నుండదు; ఎల్లదినములు నొక్కలాగున జరుగవు. ఇప్పుడు మహారాజగు బిందుసారుని రాజ్యసమయమునఁ దక్షశిలయందు విద్రోహములు బయలువెడలెను. సామంతరాజులు తమలోఁ దాము కలహించుచుండిరి. రాజ్యలాలసత్వమే యిందులకుఁ బ్రధానకారణము—మఱియుఁ బ్రజావిద్రోహము మఱియొక విధముగ నుండెను. రాజోద్యోగులదోషములవలనను, వారి కఠినశాసనములవలనను, దుష్టకృత్యములవలనను దూరదృష్టి లేనిప్రజలు విద్రోహులగుచుండిరి. రాజగుబిందుసారుఁ డీవిద్రోహవార్తలనాలకించెను. మొట్టమొదట నాతఁడు యువరాజగు సుషీమునిససైన్యముగ నాస్థలమునకుఁ బంపించెను. ప్రప్రథమమునఁ బ్రజలందఱును యువరాజగుసుషీమునింగాంచి యించుక శాంతివహించి యుండిరి. యువరాజు తమతమకష్టములం గూర్చి యాలకించి యందులకుఁ దగినప్రతిక్రియల నాచరించు నని వారికి మిగుల నమ్మకము కలిగెను. కాని యచిరకాలమునందే వారి కాభ్రమయంతయు వదలిపోయెను. అప్పుడు ప్రజలందఱును యువరాజు తీవ్రాస్త్రములమూలమునను గఠినశాసనములమూలముననను దమ్ముదండించుటకై వచ్చియుండె నని భావించుకొనిరి. అందువలన మరల వారెప్పటివలె నల్లరులం జేయుట కారంభించిరి. యువరాజు శాంతిస్థాపనము

నకై చేసినయాత్ర యీవిధముగ నిష్ఫలమైపోయెను. అందుచే నాతఁడు నిరర్థకముగ స్వదేశమునకు మరలవలసినవాఁ డయ్యెను.

మహారాజగుబిందుసారుఁడు పుత్రముఖంబున నెల్లసంగతుల నాలకించెను. అప్పుడాతఁడు తనతప్పును దానే తెలిసికొనఁ గలిగెను. తోడనే యామహారాజు కుమారుఁ డగునశోకుని బిలిపించెను. పిమ్మట బిందుసారుఁ డశోకున కెల్లవృత్తాంతమును జెప్పి యేమేమిచేయవలయునో కూడఁ దెలియఁజేసెను. రాజ్యమున కతిదూరమునఁ బశ్చిమప్రాంతమునందు శాంతిస్థాపనము కొఱకు—విద్రోహదమనముకొఱకుఁగాదు—కుమారున కేమి కావలయునో తండ్రి యన్నియు నొసంగెను—కేవల మస్త్రములను సైన్యముమాత్ర మాతని కీయలేదు. అశోకుఁడు తండ్రియభిప్రాయమును గ్రహియించెను. ఆతఁడు నిర్భయుఁడై తక్షశిలకుఁ బ్రయాణ మయ్యెను. కొలఁదికాలమునందే యశోకుఁడు నిరపాయముగఁ దక్షశిలం బ్రవేశించెను; అచ్చటిప్రజల కందఱకును బ్రేమపూర్వకముగ దర్శన మొసంగెను; వారికష్టసుఖంబులఁ బరిశీలించెను; వారియభియోగకారణముల విస్పష్టముగ గ్రహించెను; వారికష్టములయెడల సహానుభూతిని బ్రకటించెను; కష్టనిర్వాపణమునకుఁ దగినప్రతిక్రియలం గావించెదనని చెప్పి వారిమనంబుల కూఱట కలిగించెను. రాజపుత్రుఁడు శస్త్రములనుగాని, సైన్యమునుగాని తీసికొని రాలేదనియుఁ, దమ్ము దండింపవలయు ననునుద్దేశముతో వచ్చినవాఁడు కాఁడని

యుఁ, దమలో శాంతిస్థాపనము చేయుటకే దర్శన మిచ్చియుండె ననియుఁ బ్రజలందఱును మొట్టమొదటనే భావించియుండిరి. తరువాత నాతనిదయార్ద్రహృదయమును, దదనుకూలవ్యవహారములను గాంచి తమకు క్షేమలాభములం గల్పించెద నని చెప్పినసమాదరశీతలంబు లగుసాంత్వనవచనంబుల నాలకించి ప్రజాగణ మంతయు శాంతభావమును వహించి యుండెను. అశోకునియాత్ర సఫల మైనది. పిత్రాజ్ఞాపరిపాలన మైనది.

పదునొకండవ ప్రకరణము.

గుణాదరము.

అశోకుఁడు తక్షశిలయందు శాంతిస్థాపనము చేసి రాజధానికి మరలివచ్చెను. పదియాఱేఁడులబాలకుఁ డగునారాజకుమారుఁ డొక్కఁడును బోయి ప్రౌఢులగువారికిఁగూడ నతిదుష్కరం బగుమహాకార్యమును సర్వశ్రేయస్సంపన్నముగ నెఱవేర్చుకొని వచ్చెను. మహారాజగు బిందుసారుఁ డింతకాలము వఱకును గురూపి యనియు, వికారాకారుఁ డనియుఁ దలంచి యశోకుని జూచుటకుఁగూడ నసహ్యపడుచుండెను. తక్షశిలయందు శాంతిని నెలకొల్పుటకై పోయినయశోకున కచ్చట నేవిషమసంకటమున నైనఁ బడి మరణించుటయే తటస్థించిన యెడల నది మహారాజునకు దుఃఖదాయకమే యగునో మఱియేమగునో మేమెంతమాత్రము నూహలవలన నిర్దేశింపఁజాలము. అప్పు డేమగునో చెప్పఁజాలముగాని పిత్రాజ్ఞాపరిపాలనతత్పరత, సాహసము, నీతికుశలత మొదలగురాజకులోచితసద్గుణగణంబులన్నియు నశోకునియందు మూర్తీభవించియున్నట్లు పొడకట్టుటచే నిప్పుడు మహారాజాతనియెడలఁ బరమాదరభావమునే సూచింపఁదొడంగెను.

ఆసమయమునకు సరిగ నుజ్జయనీమండలమును ప్రజానుకూలముగఁ బరిపాలించుటకుఁ దగినసమర్థుఁ డగురాజప్రతినిధి నొకని నియమించుట యావశ్యక మయ్యెను. ఎంతటిసమర్థులైనను దనయుద్యోగిజనులయం దింతటిమహోన్నతకార్యభారమునుఁ బెట్టుటకు మహారాజున కిష్టము లేకపోయెను. ప్రకృతమున నశోకుఁడు సకలసద్గుణగరిష్ఠుం డనియు, నసామాన్యప్రతిభాశాలియనియు ననుభవమునం దోఁచుటచే సార్వభౌముఁ డగుబిందుసారుఁడు బాగుగ నాలోచించి యవంతీమండలరాజప్రతినిధిపదంబున కశోకకుమారుఁడే యర్హుఁడని నిశ్చయించి యావిధముగ నియోగించి యాతని నచ్చటికిఁ బంపించెను.

ఇందూరునకుసమీపమున నవంతీనగరనామ మెల్లవారికిని బరిచిత మైనదియే. స్థలమాహాత్మ్యముచే నిప్పటికి నాపవిత్రనామము సుప్రసిద్ధముగనే యున్నది:—

" అయోధ్యా, మధురా, మాయా, కాశీ, కాంచీ, అవంతికా
పురీద్వారావతీచైవ, సప్తైతా మోక్షదాయికాః॥"

అనువిషయము సకలభారతజనసమీచీనమై యున్నది. అవంతీస్థానమున కాధునికనామము మాళవ్యము. అవంతీమండలమునకు రాజధాని యుజ్జయినీనగరము. మహాకవి యగు కాళిదాసుఁడా యుజ్జయినీనగరనామమున కమరత్వమును బ్రసాదించియున్నాఁడు. విక్రమాదిత్యునియుజ్జయినీనగరమునందలి సుధాధవళంబు లగుసుందరసౌధమాలికలును, నలోకసామాన్యరూపలావణ్యవిలాసవతు లగుపురపురంధ్రీమణుల విలాసవిభ్రమలీలారంగంబు లగురమ్యప్రమోదారామంబులును నిప్పు డేమైపోయినవి? అవి యన్నియును గాలవాహినీగర్భమునం గలసిపోయినవి. కాని మహాకవిశిరోమణి యగు కాళిదాసుఁడు తనకావ్యమునందుమాత్రము వానికన్నిటికిని శాశ్వతజీవనమును గల్పించి యున్నాఁడు. ఆమహాకవిసార్వభౌముఁడు తనమేఘసందేశ[illegible]ందు శాపగ్రస్తుఁ డగుయక్షునిచే నవసి[illegible]నకొందుకచుట్టుత్రోవమైనను నొకసారి [illegible]యుజ్జయినీనగరమునకుం బోయి యాపురవిలాసమును గన్నులకఱవుదీరఁగాంచి నీకన్నులకును జీవితమునకును సార్థక్యముం గూర్చుకొని మఱిపొమ్ము" అని చెప్పించియున్నాఁడు. సాహిత్యసంస్మరణమున కిప్పుడప్రస్తుతమే యైనను యథాసమయమున మానవీనపాఠకులకు మహాకవిశేఖరుం డగుకాళిదాసుని మేఘసందేశమహాకావ్యము నొకసారిపఠింపవలయు నని బోధించుట యసంగతకార్యము కాదని తలంచుచున్నారము.

అశోకుఁడు జనకునియానతిచే నాతనికిఁ బ్రతినిధియై యుజ్జయినీపట్టణమునం దుండెను. ఆతఁ డారమ్యమైన నగరమునం దుండి మిగులసమర్థతతో నవంతీమండలప్రజావర్గము ననుకూలశాసనములతోఁ బరిపాలించుచుండెను. ఆతనిధర్మశాసనసమయమునఁ బ్రజలలో నెట్టివిద్రోహములుగాని, దేశమునం దెట్టి దుర్భిక్షములుగాని లేవు. ప్రజలు నిరంతరసంతుష్టులై యుండిరి. ఆతఁడును సుఖసంపూర్ణుఁ డయ్యెను. అశోకునియౌవనమునందలి ప్రథమభాగ మీయుజ్జయినీనగరముననే గడచినది. ఆతఁ డామండలమునం దున్నప్పుడే విదిశానగరమునందలి యొకప్రసిద్ధవర్తకునితనయను బరమరూపలావణ్యవతి యగుకన్యకను బెండ్లియాడెను. నవయౌవనము, అప్రతిహతం బగుప్రతాపము, రమణీయంబగురాజధానీనగరము, విలాసవిభ్రమలీలారంగంబు లగుప్రమోదోద్యానములు, సకలసంపత్సమృద్ధంబగురాజ్యము, సుఖసంతుష్టు లగుప్రజలు, రూపయౌవనసంపన్నయు ననురక్తయు నగుధర్మపత్ని—ఇవి యశోకున కన్నియు ననుకూలించినవి. ఇవి యన్నియును లభించుటంబట్టియే యశోకుఁ డుజ్జయినియందున్నప్పుడు నిరంతరముఁ బరమానందముతోఁ గాలమును సార్థకముగఁ జేసికొనియెనని చెప్పవచ్చును. గుణములయందలియాదరముచేతనే తనతండ్రి రాజ్యప్రతినిధిగఁ జేసి తన్నుజ్జయినీనగరమునకుఁ బంపియుండె నని యశోకుఁడు భావించుకొనియెను.

పండ్రెండవప్రకరణము.

గృహసమాచారము.

అశోకుఁ డుజ్జయినీనగరమునం దుండి యవంతీమండలమున సుఖశాంతివిధానము లాచరించుచుఁ బరమానందమునఁ గాలక్షేపము చేయుచుండెను. ఆతని కచ్చటనున్నప్పుడే తానభ్యసించినరాజనీతికౌశల్యమును గార్యరూపమున నుపయోగించుకొనుట కవకాశము దొరకెను.

ఆతఁ డచ్చట నున్నకాలమునం దిచ్చటఁ బాటలీపుత్రమునందు స్థితిగతు లంతబాగుగ లేవు. ఆరాజస్థానమునఁ జిరకాలమునుండియు న్యాయసభ యొకటి యుండుటయు దానిమూలముననే మహారాజు రాజ్యకార్యములం దీర్చుచుండుటయు జరగుచుండెను. సార్వభౌముఁడగుబిందుసారుఁడుకూడ నీనియమము నతిక్రమించి యుండలేదు. ఆసభాలోచనలనుబట్టియే మగధరాజ్యము వివిధభాగములుగ విభజింపఁబడుటవలననున్నతోద్యోగులసంఖ్య యధిక మయ్యెను. ఆయుద్యోగు లందఱునుగూడ నాపరిపాలనాసభకు సభ్యులుగనే యుండిరి. చంద్రగుప్తుని ప్రభుత్వసమయమునం దిట్టిసభ్యులైదువందలమంది యున్నట్లు తెలియవచ్చుచున్నది. బిందుసారుఁడుకూడ వారి యాలోచనల ననుసరించియే రాజ్యమును బరిపాలించుచుండెను. ఆరాజసభామధ్యమున రాధాగుప్తుఁడు మంత్రియై యుండెను. ఖల్లాతకుఁడు ప్రధానమంత్రి కాకపోయినను నాతనిప్ర

భావ మెల్లవిషయములయందును నిరాఘాటముగఁ గొనసాగుచుండెను. రాజోద్యోగులందఱు నాతని మిగుల గౌరవించుచుండిరి. అశోకుఁడు తక్షశిలకుఁ బోయినకాలమున యువరాజగుసుషీముఁడు ప్రవీణుఁడగు నాఖల్లాతకుని జాల నగౌరవముగఁ జూచెను. రాజ్యమునకు భవిష్యత్ప్రభుఁడు కాఁదగిన యాయువరాజునడవడి యందఱకు నసంతుష్టిని గల్పించెను. అందఱును క్షుణ్ణహృదయులై భయపడుచుండిరి. యువరాజగుసుషీముని ధూర్తత్వమునుజూచి మంత్రియగురాధాగుప్తుఁడుమిగుల విరక్తుఁ డయ్యెను. అప్పటినుండియుఁ గ్రమక్రమముగ నారాజసభాసభ్యు లందఱును యువరాజునెడల నసంతుష్టులైపోయిరి. పిమ్మట నశోకుఁడు తక్షశిలయందు శాంతిని నెలకొల్పి మరలివచ్చెను. అప్పుడాతఁడు తన జనకునియొద్దఁ గలయున్నతోద్యోగుల నందఱను సన్మానించెను. అప్పుడురాధాగుప్తుఁడును ఖల్లాతకుఁడునుగూడ నెల్లవిధముల యువరాజుకంటె నశోకుఁడే యోగ్యతముఁడనినిశ్చయించుకొనిరి. రాజసభలోనిచాలమందిసభ్యులసమాదరవిశ్వాసములు క్రమక్రమముగ నశోకునివంకకే ప్రసరింపసాగెను; సుషీమునియందలి విరక్తియు, నశోకునియందలి యనురాగమును దినదినాభివృద్ధి నందుచుండెను. సుషీముఁడు యువరాజును జనకునకుఁ బ్రియపుత్రుఁడునుగూడ నై యుండెను. అయినను నశోకునిపక్షముననేయున్న యుద్యోగులయనురాగము ప్రబలతమమై యుండెను.

రాజధానియందలియున్నతోద్యోగులభావము లీవిధముగఁ బరిణమించుకాలమునందే యువరాజగుసుషీముఁడును నశోకుఁడునుగూడ నచ్చట లేకయుండిరి. అప్పుడు సుషీముఁడు తక్షశిలయందును నశోకుఁ డుజ్జయినియందు నుండిరి. ఈసమయమునందే యాకస్మికముగ మహారాజగుబిందుసారుఁడు వ్యాధిపీడితుఁ డయ్యెను. ఆవ్యాధి క్రమక్రమముగ వర్ధిల్లుచుండెను. అప్పుడు మహారాజు యువరాజగుసుషీముని బిల్పింపవలయు నని యాజ్ఞాపించెను. మహారాజు స్వస్థుఁడైయున్నను నస్వస్థుఁడైయున్నను నాతఁడెప్పుడును గార్యాచరణవిషయంబునఁ బరముఖాపేక్షకలవాఁడేయైయుండెను. ప్రభుఁడగుబిందుసారునియాజ్ఞయథావిధిగఁ బరిపాలింపఁబడినమాట సత్యమే—కాని యాతనియభిప్రాయము మాత్రము సిద్ధించినదికాదు. రాధాగుప్తుఁ డింతకుముందుగనే బయలుదేరి రావలయు నని యశోకునకు వార్త నంపియుండెను. ఇప్పుడుకూడ నుద్యోగపద్ధతి ననుసరించి సుషీమునకును మరల నశోకునకునుగూడ సమాచారము నంపించెను—అప్పటికే మహారాజువ్యాధి ముదిరిపోయినది. ఆరోగ్యము కలుగుననునాశయతిస్వల్పము—

పదుమూడవప్రకరణము.

రాజ్యలాభము.

మహారాజగుబిందుసారుఁడేఁబదివత్సరములు రాజ్యముచేసి క్రీ॥ పూ॥ 272 వ సంవత్సరమునందుఁ బరలోకగతుం

డయ్యెను. అప్పుడు మగధరాజ్యసింహాసనము శూన్యమైయుండెను. ఆతఁడు తనయనంతరమునందుఁ దనప్రియపుత్త్రుఁడగు సుషీముఁడే తనసింహాసనము నధిష్ఠింపఁగలఁ డనితలంచియుండెను. ఇట్టియాశచేతనే యాతఁడు తాను రోగశయ్యయందున్నప్పుడు తనకుమారుని దక్షశిలనుండి పిలిపింపవలయునని యాజ్ఞాపించి యున్నాఁడు. అప్పటియాతనియాజ్ఞ సరిగనే పరిపాలింపఁబడినది; కాని యాతనియాశమాత్రము ఫలియించినదికాదు. ఎందులకు ఫలియింపలేదో యాసంగతి యిదివఱకే చెప్పియున్నారము. రాధాగుప్తునిగూఢతంత్రముచే నశోకునకు దనతండ్రి వ్యాధిగ్రస్తుఁడై యుండె ననుసంగతి ముందుగనే తెలియవచ్చెను. ఆవార్త విన్నతోడనే యశోకుఁడు తటిద్వేగమున నుజ్జయినినుండి పాటలీపుత్త్రమునకు వచ్చియుండెను. కాని యాతని కప్పుడు జనకసందర్శనభాగ్యము లభియింపలేదు. శూన్యమైయున్న పితృసింహాసనమును మాత్ర మాతఁడు దర్శించెను.

రాధాగుప్తఖల్లాతకప్రముఖు లగురాజసభాసభ్యు లందఱు నేకగ్రీవముగ నిదివఱకే నిశ్చయించుకొనియుండుటచే వారందఱును గలసి యప్పుడే మగధరాజ్యమున కశోకునిరాజుగఁ జేసివైచిరి. బిందుసారునియనంతరమున నాతని ప్రియతమసతీరత్నమగుసుభద్రాంగికుమారుఁ డశోకుఁడే యావిశాల మగధరాజ్యమునకు మహిమాన్వితుఁ డగుమహారాజచంద్రుఁ డయ్యెను—ఈయుత్సాహవార్త రాజ్యమునం దంతటను బ్రకటింపఁబడియెను.

ఇట సుషీముఁడును నిశ్చింతుఁడై యుండలేదు. జనకుని కష్టవార్త విన్నతోడనే యాతఁడును సాధ్యమైనంతవఱకు శీఘ్రప్రయాణములు చేసి స్వదేశమునకు వచ్చియుండెను. తోడనే మంత్రు లందఱును గలసి మగధరాజ్యమున కశోకునే రాజుగ నెన్నుకొని రను సంగతి యాతని చెవులఁ బడియెను. బాహుబలముచే రాజధాని నాక్రమించుకొని పితృసింహాసనము నధిష్ఠించుటకంటె నాతని కిఁక గత్యంతర మేమియు లేదు. ఆకారణమున నాతఁ డధికసంఖ్యాకసైన్యముం గూర్చుకొని ససైన్యముగఁ బాటలీపుత్రసమీపమునకువచ్చి విడిసెను. చిరకాలము క్రిందటఁ బాటలీపుత్రము ప్రాకారపరిఘాద్వారములచే సురక్షితమై యుండెను. అశోకుని సేనానాయకు లింతకుముందే ప్రాకారమునకుఁ జుట్టునున్న యగాధమగు నగడ్తను జలశూన్యముగఁ జేసి తుపాకిమందు కసవు మొదలగువానితోఁ గప్పివైచి యుంచిరి. జనశూన్యంబును, తృణశోభితంబును నగు నా పరిఖం గాంచి సుషీముఁ డానందోత్ఫుల్లహృదయుఁ డయ్యెను. పరిఖానిరోధము లేకుండుటచే నెటులయినఁ బ్రాకారమును బగులఁగొట్టియో, లంఘించియో ససైన్యముగ నగరమధ్యమునం దనాయాసముగఁ బ్రవేశింపవచ్చునుగదా యని యాతఁ డాశపడియెను. ఇట్టియాశచేతనే యాతఁ డతివేగముగ సేనల నడిపించుకొని ప్రాకారసమీపమునకు వచ్చి నిలిచెను.

అశోకునిదండనాయకు లిది యంతయును గనిపెట్టి చూచుచునే యుండిరి. మహారణకుశలు రగు వారియుపాయము

ఫలించినది. సుషీముఁడు ససైన్యముగఁ బ్రాకారమునకు నగడ్తకును మధ్యభాగమునఁ బ్రవేశించి యుండెను. పంచాననము ప్రబలకిరాతునివలలోఁ దగులుకొన్నది. సుషీముఁడు ససైన్యముగ నట్లుండుటం గాంచి యశోకునిసైనికు లాపరిఖయందలి మందునకు నిప్పు ముట్టించిరి; మఱియుఁ బ్రాకారములపైనుండి నిరంతరబాణవర్షమును గురియింపసాగిరి. సుషీముఁడు తానెన్నఁడుఁ గలలోనైన ననుకొనియుండనిపన్నాగమునం బడి ససైన్యముగ నిహతుఁడైపోయెను.

అశోకునిసౌభాగ్యమార్గమున కడ్డముగనున్న కంటకవృక్ష మీవిధముగఁ బెల్లగింపఁబడిపోయెను.

నవీనుఁ డగు రాజు—ప్రవీణు లగు మంత్రులు—రణనీతికుశలు రగు దండనాయకులు—వీరందఱును యుద్ధానంతరమున నొక్కచోఁ గలిసికొనిరి; ఒక్కటేమాటగ మెలంగుచుండిరి; ఒక్కటేశరీరముగ భావించుకొనుచుండిరి. ఇఁక నట్టిరాజ్యమునకుఁ గొదవ యేమున్నది? అశోకున కప్పటికిని భ్రాతృసంబంధశత్రుత్వము నిశ్శేషము కాలేదు. అశోకుఁడు కేవలము తదేకదృష్టితో విద్రోహులగుసోదరులను సపరివారముగ నశింపఁజేయుటకై ప్రయత్నించుచునే యుండెను. ఇట్టికల్లోలములచే నశోకునకుఁ బితృసింహాసనము లభించినను బట్టాభిషేకము జరుగుట కాలస్యము కావలసివచ్చెను—

పదునాలుగవ ప్రకరణము.

రక్తప్రవాహము.

అశోకునకునకు సర్వరాజ్యమును లభియించినది. ఆతని ముఖ్యశత్రువులు నిహతులైపోయినసంగతియు సత్యమే. కాని యాతనికంతమాత్రమున నిశ్చింతుఁడైయుండుట కవకాశము కలుగలేదు. పూర్వమునుండియు రాజ్యమునందలి ప్రజలును రాజోద్యోగులును రెండుపక్షములుగ నేర్పడియుండిరి. కొందఱు అశోకునిపక్షమువారుగను, మఱికొందఱు సుషీమునిపక్షము వారుగనునుండిరి. అశోకునిపక్షము వారు ప్రజలలోనయ్యును గొలఁదిమందిమాత్రమేయుండిరి. ప్రజాసామాన్యమునఁ జాలమంది సుషీమునిపక్షమువారే యైయుండిరి. మానవలోకమెంతవికృతముగ మారిపోవుటతటస్థించినను, ధర్మాధర్మజ్ఞానము న్యాయాన్యాయవిచారణశక్తి, పాపనిందనము, పుణ్యకాంక్ష మొదలగుసద్గుణము లన్నియు నొక్కసారిగ నాశనము లైపోవఁజాలవు. "సుషీముఁడు యువరాజుగ నుండెను—సత్యధర్మానుసారముగ నాతఁడు పితృసింహాసనమున కుత్తరాధికారి యైయుండెను. బాల్యచాపల్యముచే నైన లోపము లాతనికడ నేవియైనను నుండిన నుండుఁగాక! సమయానుకూలముగ వానినన్నిటి నాతఁడు సవరించుకొనఁజాలకపోఁడు." అని యీవిధముగ భావించుకొనుచుఁ బ్రజలలోనను, మంత్రులలోనను జాలభాగమువఱ

కును సుషీమునియెడలనే యధికవిశ్వాసము కలిగెను. వారికశోకుఁడు రాజగుటసంతోషకరముగ లేదు. ఇంతియ కాక సర్వవిధముల రాజ్యార్హుఁడగుసుషీముఁడు కపటమార్గమున నన్యాయముగఁ జంపఁబడిపోయెను. అందువలనఁ బ్రజలలోఁ జాలమందికి సుషీమునియెడల జాలి కలిగెను. వారాతనిలోపముల నన్నిటిని మఱచిపోయిరి. అందఱు నాతనికొఱకే తమవిచారమును సూచించుచుండిరి—పతిపుత్రవిహీనలును, మహామహిషీమణులు నగునశోకునిసవతితల్లులయెడలఁగూడఁ బ్రజాభిప్రాయము సానురూపముగ నుండెను. ప్రజ లందఱును వారికష్టములను విచారించుచుండిరి. ఇట్టికారణములచే ననేకు లశోకునకు బహిరంగశత్రువులైపోయిరి. ఇంకను మిగిలియున్న యశోకుని వైమాత్రేయసోదరులుకూడ నాతనియెడల విరుద్ధాచరణముల నాచరించుచుండిరి.

ఈసకలకారణములవలనను నశోకున కొక్కప్పుడును నెమ్మదియనుమాట లేదయ్యెను. అప్పు డాతఁ డేవిధముచే నైనను శత్రుసంహారము చేయవలయు నని కృతసంకల్పుఁ డయ్యెను. ఆతఁడనేకు లగుగూఢచారులను నియమించి యుంచెను. వారందఱును జండికాలయములు, దేవాగారములు, సైన్యావాసములు, పుణ్యక్షేత్రములు మొదలగునానాప్రదేశముల నానావేషధారులై సంచరించుచు నానాసమాచారములను సంగ్రహించుకొని వచ్చి యశోకునకు నివేదించుచుండిరి.

ఎవ్వ రెచ్చట నేవిధముగ రాజద్రోహకార్యములం జేయవలయు నని యాలోచించుకొనుచుండిరో యంతయు నశోకున కతిగూఢముగఁ దెలిసిపోవుచుండెను. క్రమముగ నెందఱో రాజద్రోహులు రాజ్యమునందు నిండియున్నట్లు తెలియవచ్చెను. రాజపరివారమునందుఁగూడ ననేకులనామము లాదిద్రోహనామసహితములై వినఁబడుచుండెను. ఆకాలమునందు రాజద్రోహాపరాధులకు మరణదండనముకంటె మఱియొకశిక్ష యేదియును లేదు. రాజద్రోహులసంఖ్య వృద్ధియగుచున్నకొలందిని నరహత్యలసంఖ్యకూడఁ బ్రవర్ధిల్ల నారంభించెను. క్రమముగ నీనరహత్యల కొకవిశాలావాసముకూడ నిర్మింపఁబడియెను. ఆగృహమునకు నరక మని పేరు పెట్టఁబడియెను. పొరపాటుననో, కాక గూఢచారులయసత్యసమాచారమూలముననో గాని యొకనాఁ డొకబౌద్ధసన్యాసి యాహత్యాగారమునఁ బ్రవేశపెట్టఁబడియెను. చండగిరికుఁ డనుసాలెవాఁ డొకఁడు రాజద్రోహులశిరంబుల ఖండించుకార్యమునందు నియుక్తుఁడైయుండెను. ఆతఁడప్పు డందఱవలెనే యాసన్యాసినిగూడ నఱుకుటకు సన్నద్ధుఁ డయ్యెను; కాని యాసాధు వేమియో చెప్పుటవలన నాచండగిరికుఁ డాతనికిఁ గొన్నిదినములు గడు విచ్చెను. ఈగడువులోపలనే యాబౌద్ధపరివ్రాజకుని యపారయోగబలమాహాత్మ్యము ప్రకటిత మయ్యెను. ఆసంగతి యథాసమయమున మహారాజగునశోకునిచెవులఁ బడియెను. తోడనే యశోకుఁడు స్వయముగ నచ్చటికిఁ బోయి యాసాధుశే

ఖరుఁడు నిరపరాధి యని సప్రమాణముగ గ్రహించుటయే కాక యాతఁడు మహాయోగి యనికూడఁ దెలిసికొనియెను. అప్పు డశోకుఁ డాతనికి నమస్కరించి తనయపరాధమును క్షమింపఁ బ్రార్థించి యామహాత్ముని విడుదల చేయించెను. అప్పు డానరఘాతుకుఁ డగుచండగిరికుఁడు తానదివఱకుఁ జేసినమహాద్ధతికార్యములంగూర్చి యశోకునకు విన్నవించెను. నిందనీయంబగునీవ్యాపారమంతయు నప్పు డశోకునకు రాక్షసకృత్యముగ నగపడియెను. తత్క్షణమే యశోకుఁ డాహత్యామందిరము భస్మీభూతముగఁ జేయవలయు నని యాజ్ఞాపించెను. అది మొదలుగ రాజద్రోహులకు మరణదండనము తప్పిపోయినది; అట్టివారిని వారియపరాధములకుఁ దగురీతిని దండించుట కారంభమయ్యెను.

అదియే కారణముగా నంతటినుండి నవీనసార్వభౌముఁడగునశోకుఁడు బౌద్ధయతులవలన బౌద్ధధర్మములను మఱియు ననేకపుణ్యచరిత్రములను వినుచుఁ గ్రమముగా బౌద్ధపరివ్రాజకుల యోగబలమాహాత్మ్యములంగూడ స్వయముగఁ జూచి తెలిసికొనుచుండెను.

అశోకునిరాజ్యలోభకారణమున రాజ్యరక్షణమునకై యనేకులగునపరాధులును, నిరపరాధులును, శత్రులును, మిత్రులును, తనవారును, బెఱవారునుగూడఁ గఱకుకత్తులపాలైపోయిరి. రక్తప్రవాహములతో నాలుగుసంవత్సరము లీవిధముగఁ గడచిపోయినవి.

పదునేనవ ప్రకరణము.

అభిషేకము.

మహారాజు బిందుసారుఁడు లోకాంతరగతుఁడై యిప్పటికి నాలుగేండ్లయ్యెను. రాజ్యలోభపరవశుఁడైయున్న యశోకుఁడు బిందుసారుని మరణమునుగూర్చి దుఃఖించుట కెప్పుడును నించుకంతయు నవకాశము దొరకినదిగాదు. ఆతఁడు తనరాజ్యరక్షణమునకై సోదరుల నెల్లఁ జంపించుట కెంతమాత్రమును శంకించియుండలేదు. ఎందఱో భ్రాతలను, మఱియు నెందఱో పురజనులనుగూడ సంహరించి యాతఁ డిప్పుడు నిరపాయుఁడై నిష్కంటకుఁడై యున్నాఁడు. ఇన్నాళ్లకాతనికా పాటలీపుత్రమున—ఆ రక్తరంజితరాజమందిరమునఁ బట్టాభిషేకమహోత్సవము గావింపవలయునని యాలోచన తోఁచెను. రాజధర్మము—రాజచరిత్రమైనది!!!

సర్వసంతాపసంహారకం బగుసమయము. ఈనాలుగేండ్లలోనను రాజాంతఃపురమునందలియనేకులు తమశోకతాపములను మఱచిపోయియుండిరి. నగరమున శాంతి నెలకొల్పఁబడినది. నాగరకులు మరల సుఖసంతోషములచే నుల్లసితహృదయులై సంచరించుచు రాజపథశోభాపరంపరల వర్ధిల్లఁజేయుచుండిరి. శాంతిప్రియులును, సుఖప్రియులు నగునగరజనులహృదయములయందు మరల రణభేరీనినాదము చెవులఁ

బడుట తటస్థించునేమో యనుసందేహమైన నుదయించుట లేదు. ఇప్పుడు సంధ్యాసమీరణములచే నగరతోరణస్తంభములయందలి విజయపతాకలు సవిలాసముగ సంచలితము లగుచుండెను. విజయభేరీమధురనినాదములును, బూర్వవాహిని యగుజాహ్నవీతరంగకలకలనినాదంబులును గలసిమెలసి యపూర్వసంగీతస్వనంబును బ్రదర్శించుచుండెను. సంధ్యాసమయదీపమాలికలును, దిగంతవ్యాప్తంబు లగువిజయభేరీనినాదములును, కలకలనినాదినియు, మందగామినియు, నగుజాహ్నవీతరంగిణియందలి జలశీకరంబులచే నభిషిక్తంబు లగు వాతపోతంబులును వారిత్వక్చక్షుశ్శ్రోత్రంబుల స్పృశించుచు వారిపూర్వపుసంగతుల నన్నిటిని మఱపించుచుండెను. రాజాంతఃపురమునందలి పతిపుత్రవియోగదుఃఖిత లగుకొందఱు రాజమహిషులును నగరమునందలి ప్రతిహింసాపరాయణులును బలవంతులు నగుకొందఱుజనులును మాత్రము గాక తక్కినజనసామాన్యమంతయు బిందుసారునిమాటయు, యువరాజగుసుషీముఁడు మొదలగునితరభ్రాతృవరులహత్యలును, రాధాగుప్తునికౌటిల్యచరిత్రమునుగూడ సంపూర్ణముగ మఱచిపోయిరి. సాధారణజనులు తమతమవ్యాపారములు క్రమముగ జరుగుటయే చూచుకొనువారు కావున వారి కీయాలోచనయే లేదు. వారిసదుపాయములకు లోపము లేకుండ నున్నప్పుడే రాజ్యము నేరాజు పాలించిన వారి కేమి? న్యాయాన్యాయవిచారణచర్చయుఁ బ్రతిహింసాచరణాలోచనయుఁ జాలకాలమువఱకు వారి హృదయ

ములయందు మెఱయుచునే యుండెను; కాని నాలుగుసంవత్సరములు భయంకరముగ శోణితవాహినులు ప్రవహించిన తరువాత వారికి మరల మంచికాలము వచ్చినది. ఇప్పు డారాజ్యమునందలిప్రజ లందఱును ముక్తకంఠులై కౌముదీపులకితంబగు నారాత్రియందు విపులచంద్రికారంగమునందుండి యుచ్చైస్స్వరమున నీవిధముగ సాధువాదములంగావించుచుండిరి:—"జయమగుఁగాక! మహారా జగునశోకునకు జయమగుఁగాక!" రాజమందిరమునందును, సమున్నతప్రాసాదములయందును, ప్రకోష్ఠములయందును, మందిరములయందును, మఠములయందునుగూడ నావిజయనాదముచే ప్రతిధ్వనించుచుండెను.—"జయమగుఁగాక! మహారాజగునశోకునకు జయమగుఁగాక!"—అది జ్యేష్ఠమాసము; శుక్లపక్షము; పంచమీతిథి—సార్వభౌముఁ డగునశోకునిపట్టాభిషేకక్రియలుసర్వమును సంపన్నంబు లయ్యెను.

పదునాలవప్రకరణము.

దిగ్విజయము.

సార్వభౌముఁ డగునశోకుని ప్రతాపము దశదిశాపరివ్యాప్తమయ్యెను. సమస్తసామంతమహీపాలురు నాతనిసార్వభౌమత్వము నంగీకరించిరి. ఆతనిబాహుబలపరాక్రమము లందఱకును బరిచితము లయ్యెను. ఆతనిచతురంగబలములు దినదిన

ప్రవర్ధమానము లగుచుండెను. వారు కేవలము రాజ్యము శాంతిరక్షణము గావించుటచేతనే తృప్తివహించియుండుట లేదు. పశుబలము ధర్మబలముచే నియమితమును సంయతమును గాకున్నచో నది క్రమముగ ధర్మబలమును మించి యతిక్రూరముగఁ బరిణమింపఁగలదు. సేనానాయకు లాసంగతిని బాగుగ గ్రహించియుండిరి. మంత్రిగణముకూడ గ్రహించియుండెను. ఇప్పటికి నాలుగుసంవత్సరములనుండి మహారాజు యుద్ధవిద్రోహములలోనే మునింగియుండెను. శాంతినివహించి యెంతయో కాలము కాలేదు. ఇప్పుడు మరల దిగ్విజయార్థమై యుద్ధయాత్ర చేయవలయు ననిన సైనికులకుఁ గష్టముగ నుండును. ఈసంగతులన్నియు నాలోచించుకొని వారు మహారాజు చెప్పినట్లు చేయవలయు నని నిశ్చయించుకొనిరి. వారెల్ల సంగతులును విస్పష్టముగ నశోకసార్వభౌమునకుఁ దెలియఁజేసిరి. అశోకుఁడు దిగ్విజయయాత్ర చేయుటకు నిశ్చయించెను. కొలఁది కాలములోనే యందులకుఁ గావలసినప్రయత్నము లన్నియు సంపూర్ణములయ్యెను.

మగధదేశాధిపతి యగునశోకమహారా జప్పుడు కళింగదేశవిజయమునకై విశేషసేనాపరివృతుఁడై యుద్ధయాత్ర చేసెను. వర్తమానకాలమున నుత్కళము (ఉరియా) అనుపేరుగల మదరాసురాజధానియందలికొంతభాగ మప్పుడుకళింగదేశముగ వ్యవహరింపఁబడుచుండెను. కళింగదేశము నీలసముద్రసేవితమై యుండెను. ఆదేశమధ్యమునుండి వైతరిణీతరంగిణి ప్రవహించు

చుండెను. నీలాచలము మొదలగుచిన్న పెద్దపర్వతములవరుస లీదేశమున వ్యాపించి విరాజమానము లగుచుండెను. అప్పటి సముద్రము, నదులు, పర్వతపంక్తులు నిప్పటికి నాదేశమును సురక్షితముగఁ జేసి యుండుటచే నాదేశము నాక్రమించు కొనుట శత్రువులకు దుస్సాధ్యముగ నుండెను. మఱియొక విశేషము—ఖరస్రోతానది యాదేశముకడవఱకును వ్యాపించి యుండుటచే శత్రువులకు దుష్ప్రాప్యమై యుండెను. రఘువంశకావ్యమునందలి రఘుమహారాజు దిగ్విజయభాగమును జదివినచో మనమీవిషయము లన్నియు సప్రమాణముగ గ్రహియింపఁగలుగుదుము. అయోధ్యానాయకుఁ డగురఘుమహారాజు వంగదేశము నతిక్రమించి మదమాతంగములతో సేతువు నిర్మించి కపిశానదిని ససైన్యముగ దాఁటియున్నాఁడు.

" బలయుతుఁడు రఘువు నౌకా
బలసంపన్నులగువంగనృపతులగెలిచి ని
ర్మలగంగాస్రోతంబుల
నలవున నాఁటించె ఘనజయస్తంభములన్. "

\+ \+ \+ \+

" ఏనుఁగులసేతువులఁ గపి
శానదిఁ దరియించి రఘుఁడు చనియెఁ గళింగ
స్థానమునకు జయభటసం
తానముతో నుత్కటశత్రప్రదర్శితపథుఁడై. "

రఘుమహారాజు దిగ్విజయయాత్ర చేసినమార్గము ననుసరించియే మగధాధిపుఁ డగునశోకమహారాజుకూడవిపుల సైన్యముతోఁ గళింగమునకు గమనోద్యతుఁ డయ్యెను.

అప్పటికళింగప్రభుఁడు సామాన్యముగ నశోకునకు లోఁబడలేదు. ఆకారణముచే నిరువంకల సేనలకును మహారణము జరిగినది. కరితురంగపదాతిగణంబుల పదాఘాతములచేఁ బ్రభవించినరజఃపటల మాకాశము గప్పివైచెను. రథనేమినిస్వనంబులును, గజబృంహితధ్వనులును, హయహేషలును, వివిధాయుధఝణఝణారావంబులును గలసి సాగరతరంగనిర్ఘోషమును స్తబ్ధీభూతముగఁ జేసివైచెను. రణధరణీతలమున శోణితవాహినులు ప్రవహించెను. ఈవిధముగఁ గొన్నిదినములు గడచినపిమ్మట యుద్ధము ముగిసెను. ఆవిశాలజనపద మంతయు నశోకునియధీన మయ్యెను. కాని దేశము జనశూన్యమైపోయెను. అప్పు డశోకుఁడు రథారూఢుఁడై రణక్షేత్రమును బరీక్షించెను. ఆభీభత్సదర్శనమున నాతనిహృదయ మత్యంతవ్యాకులిత మయ్యెను. ఆకారణముచే విజయలక్ష్మి యాతని కుల్లాసము కలిగింపఁజాలకపోయెను. ఇంతియకాదు— ఆతనికించుకంతయూఱటనైనఁ గల్పింపలేకపోయెను. తనరాజ్యలోభముచే ననేకజనసంఘములు నాశనములైపోయెఁగదా యని యప్పుడాతఁడనుకొనియెను. అందుచే నాతఁడు మర్మభేదనంబగువిచారము ననుభవించెను. కాని యాతఁ డాయాం

తరిక పరివేదనము నెవ్వరియొద్దను బ్రకటించియుండలేదు. తదనంతర మాయశోకుఁడు కళింగరాజ్యసింహాసనమునం దాప్రభువునే మరలఁ బ్రతిష్ఠించి దేశపరిపాలనమున కనుకూలవ్యవస్థలం గావించి స్వదేశమునకు మరలెను. కొలఁదికాలమునకే యశోకుఁడు రాజధానిం బ్రవేశించెను. అప్పుడు రాజధానీనగరమున యథావిధిగ విజయోత్సవములు గావింపఁబడియెను.

పదునేడవ ప్రకరణము.

సంధిసమయము.

పాటలీపుత్రమునఁ గొన్నిదినములవఱకును యోత్సవములు జరిగినవి. క్రమముగా నుత్సవోచ్ఛ్వాసములు తగ్గ నారంభించెను. ఆనందతీవ్రప్రవాహములు మందీభూతములగుచుండెను. గజతురంగపదాతిగణంబుల కిఁక నిప్పుడు యుద్ధయాత్రానురూపంబు లగు వేషణభూషము లెంతమాత్రమును లేవు. నగరతోరణములయందలి పత్రపుష్పమాలికలు వాఁడిపోయినవి. పట్టణమంతయుఁ బూర్వమువలె నెమ్మదితోనుండెను; దూరమునుండి రణభేరీధ్వనుల నాలకించి యుద్ధయాత్రామహోత్సవముం జూడవలయు ననునుత్సాహముతోఁ గులవధూజనము గృహకార్యములను విడిచి గవాక్షములయొద్ద నిలిచియుండుట లేదు; వృద్ధులగువారలింటిముంగిలి దాఁటివచ్చుట లేదు. యౌవనులు

స్వకార్యములను వదలి వీథులవెంటఁ దిరుగుటలేదు. బాలకులు తమపుస్తకములను బాఱవైచి వీథులలోనికిఁ బరుగెత్తుకొని వచ్చుటలేదు. ఇప్పుడు నగరజనులందఱును నెమ్మదితోఁ దమతమపనుల నిర్వహించుకొనుట కారంభించిరి. రాజధానియందును రాజాస్థానమునందును మరలఁ బూర్వావస్థ నెలకొనియెను.

రాజ్యమంతటను బ్రజలందఱును బూర్వరీతిని నెమ్మదితోనుండిరి. కాని మహారాజగు నశోకుని మనోభావము మాత్రము యథాపూర్వముగ నున్నట్లగపడుటలేదు. ఇంతకాలమువఱకు మహారాజగు నశోకుఁ డెట్టిస్థితియం దుండెనో యితరులుకూడ నాస్థితియందే యుండిరి. తనహృదయమునం దెట్టివిషమచ్ఛాయ ప్రసరించుచుండెనో యింతకాలమువఱకు నశోకుఁడు గ్రహింపఁజాలకపోయెను. ఆమహాజుముఖమండలమున నాఛాయయావరించియున్నట్లితరులుకూడ నెవ్వరును గనుపెట్టలేకపోయిరి. ఇప్పుడు ప్రజలకందఱకును మంచిసమయము వచ్చినది. అందుచేతనే యశోకుఁడు తనహృదయమునఁ బ్రసరించియున్నవిషమచ్ఛాయను బాగుగ గ్రహింపఁగలిగెను. మంత్రులుకూడ నాసంగతిని దెలిసికొనఁగలిగిరి. మహారాజగు నశోకుని వాక్యోపవాక్యములవలనను, నాహారవిహారములవలనను, నాచారవ్యవహారములవలనను, నాదేశోపదేశములవలనను నాతని భావవైలక్షణ్యమెల్లరకును స్పష్టముగ బోధపడుచుండెను.

క్రమముగ మంత్రులందఱు నీవిషయముం గూర్చి యాలోచింప నారంభించిరి. ఒకనాఁడు మహారాజు దైనందినరాజ

కార్యములు నిర్వర్తించుకొని సభ చాలించి నగరునకుఁ బోయె
ను. తరువాత కొలఁది సేపటిలోననే మంత్రులందఱు నాస్థానము
నుండి వెలుపలకు వచ్చిరి. వారిలో నొకఁడు "అంతఃపురమునం
దేదియో జరిగియుండును." అనియెను. మఱియొకఁడు " అట్లు
కాదు. నేను వినియుంటిని. చండగిరికునికృత్యముల కాతఁడు
మిగులఁ గ్రోధావిష్టుఁడై యున్నాఁడు. ఆచండగిరికుఁడొకనాఁడు
నిరపరాధియు, నలౌకికశక్తిశాలియు నగుసముద్రగుప్తుఁ డను
నొకబౌద్ధసన్యాసిని జంపఁబోయెను; కాని యాతనియమానుష
శక్తింజూచి విస్మితుఁడును భయావహుఁడునై యావృత్తాంత
మును మహారాజున కెఱింగించెను. మహారాజు స్వయముగ
నరకగృహంబునకు వచ్చి యాసన్యాసియత్యద్భుతమహిమలను
గన్నాఱఁగనుఁగొని యాతని సందర్శించెను; ఆతనియొద్ద బౌద్ధ
ధర్మములంగూర్చి వినియుండెను. ఆపిమ్మటనే నరకమందిరము
నేలమట్టమైపోయినది. చండగిరికునకుఁ బ్రాణదండనము విధింపఁ
బడినది. అప్పటినుండియు మహారాజునకు మనసు తిరిగిపోయి
నది" అనియెను. అంతట మఱియొకఁడు "ఇదియే సత్యమైయుం
డును" అని యాతనివాక్యములను సమర్థించెను. మరల నాతఁడు
తక్కినమంత్రివర్గముంజూచి "మహారాజు కళింగదేశయుద్ధక్షే
త్రమున నసంఖ్యజనక్షయముం గాంచి యతివికలహృదయుఁడ
య్యెననియు, నిఁకనెన్నఁడును రాజ్యలోభముచే యుద్ధము చే
యఁగూడదని నిశ్చయించుకొనియెననియుఁ బ్రధానదండనాయ

కుని వలన నేను వినియుంటిని. రాజధర్మము సూక్ష్మతమమైనది.
రాజనీతి కృత్రిమమైనది—సరళభావముతో సకలవిషయములను
బ్రదర్శించుట యీరెంటికిని విరుద్ధము. కేవల మెల్లవిషయము
లను బాహ్యదృష్టితోఁ జూచుటయే యావశ్యకము. కానియం
తమాత్రమున నేమగును? మహారాజునొద్ద నిరంతరము నుండు
సన్నిధానవర్తులకుమాత్రమే యాతనిమనోభావములు బోధప
డుచుండును. అట్టివారియొద్ద నాతఁడు తనమనోభావముల నెట్లు
దాఁపఁగలుగును? మనోభావములు ముఖమునందును మాటల
యందును బ్రకాశితములగుచునే యుండును " అనియెను.

ఆనాఁడు మంత్రులీవిధముగ నాలోచించుకొనితమతమ
వాహనముల నధిరోహించి మందిరములకుఁ బోయిరి. అనంత
రమొకనాఁ డశోకసార్వభౌముఁడు తనవిలాససౌధమున వా
యువిహారము చేయుచు జాలకాంతరములనుండి వీథిని బోవు
చున్న పరమసుందరుఁ డగునొకబాలకుని జూచెను. ఆబాలకుని
శిరస్సు ముండితమైయుండెను; ఆతఁడు కాషాయవస్త్రములను
ధరించియుండెను; ఆతనిహస్తమునఁ గమండలువుండెను. మృ
ణాళసదృశంబులును, కోమలంబులును, సువృత్తంబులు నగునా
బాలకునిబాహువులు కావివసనముచే నర్ధావృతములై యుండె
ను. అందుచే నాబాలకునిశరీరకాంతి మఱింత స్పష్టముగను దేజో
వంతముగను గానవచ్చుచుండెను. ఆతనిముఖమండల మపూర్వ
తేజస్సంపన్నమై యుండెను. ఆతనివిశాలనేత్రద్వయమునుండి

యు, హృదయనిర్మలానందమును సుస్నిగ్ధకరుణామృతభావము
ను బహిర్గతము లగుచుండెను. అశోకుఁడు చాలసేపటివఱకు
నాబాలకుని దదేకదృష్టితోఁ జూచుచుండెను. ఆబాలుఁ డప్పుడు
తనలో నేమేమియో పాడుకొనుచుఁ బోవుచుండెను. ఆతనినింక
ను జూడవలయు ననియు నాతనిగానము బాగుగ నాలకింపవల
యుననియు మహారాజు మిగులఁ గుతూహలపడియెను. అప్పు
డొక సేవకున కాజ్ఞాపించుటచే సేవకుఁ డాబౌద్ధబాలసన్యాసి
నచ్చటకుఁ దీసికొనివచ్చెను.

మహారాజు పరమాదరముతో నాబాలయోగి నుచితా
సనమునఁ గూర్చుండఁ జేసెను; ఆతనియోగక్షేమములం దెలిసి
కొనియెను. అప్పుడాబాలయోగి తననామము నిగ్రోధుఁడనియుఁ
దనగురునిపేరు తిష్యుఁడనియుఁ దెలియఁజేసి యీక్రిందివిధముగ
గానముసేయఁదొడంగెను. దానిభావమిది——

"జీవునకు దేహము గేహమువంటిది. దేహరూపంబగు
నీగృహమును నిర్మించినతృష్ణం గూర్చి యన్వేషించుచు నేననేక
పర్యాయము లీజగంబునకు వచ్చియుంటిని; అనేకజన్మములను
గ్రహించియుంటిని. మరలమరల నెల్లకాలమును జన్మాంతరము
లనందుచుండుట యెంతదుఃఖకరము! ఓగృహనిర్మాణకారిణీ !
నేనిప్పటికి నిన్నుఁ బ్రత్యక్షముగఁ జూడఁగలిగితిని. ఇఁకనీవు మర
రల నీగృహమును నిర్మింపఁజాలవు. గృహస్తంభములను, బాహ్య
దండములను గూడ సంపూర్ణముగ నేను భగ్నము చేసివైచితిని.

సంస్కారవిహీనం బగు నాహృదయ మిప్పటికిఁ దృష్ణాక్షయసా
ధనమును గ్రహింపఁగలిగినది."

ఆబాలయోగిగానరూపబోధనమువలన నామహారాజు
హృదయమున మఱుపునఁబడిపోయిన యెన్నియో సంగతులు స్మృ
తికి వచ్చుచుండెను. ఆతనిప్రాణములు చేతనారహితములై పో
యెను. అప్పుడేమిచేయవలయునో యాతని కేమియుఁ దోఁచు
ట లేదు. బాలకుఁడు మరలమరలఁ బాడఁదొడంగెను——
"లెమ్ము! అలసుఁడవై యుండఁబోకుము. ధర్మాచరణముం
గావింపుము—ధర్మాచరణుఁ డిహలోకమునందును బరలోకము
నందునుగూడ సుఖియింపఁగలఁడు. సత్కర్మములను జేయుము!
అసత్కర్మములను జేయవలదు. ధర్మచారియగువాఁ డిహపర
లోకములయందు సుఖియై యుండఁగలఁడు."

మహారాజగు నశోకునిహృదయమునందుఁ గింకర్తవ్యతా
విమూఢత్వము వదలిపోయినది. ఆతనిహృదయమునుండి సందే
హాంధకారచ్ఛాయయు ప్రదీపాంధకారచ్ఛాయయును గూడ నశిం
చిపోయినవి. అతఁడు తనజీవితమును బౌద్ధధర్మప్రచారమునం
దే గడపవలయు నని నిశ్చయించుకొన్న సంధిసమయ మిదియే.

పదునెనిమిదవ ప్రకరణము.

నవజీవనము.

"ప్రాణములను రక్షింపవలసివచ్చినచోఁ బ్రాణదాన
మునే చేయవలయును." అమరత్వము నాపాదించునసనాతన

ధర్మమిదియే. మృత్యుమధ్యమునుండియే యమృతమును బొందుట—భోగమునందు లభియింపనిదికూడఁ ద్యాగమునందు లభియింపఁగలదు—సంభోగమున లేనిసుఖము సంయమనమునందున్నది. విలాసమున దుర్లభమైన యానందము విరాగమున సులభమైయున్నది. కాని యీసంగతి యందఱు నెఱుఁగరు. ఎఱింగినను గ్రహియింపఁగలిగినవారు కొంతమందిమాత్రమే—గ్రహించినను విశ్వాసముతోఁ బనిచేయువారు చాలఁదక్కువగా నుందురు.

రాజభోగములును, విలాసవిభ్రమములును నపరిమితములే యైయున్నను వానియందశోకునకుఁ దృప్తికలుగ లేదు. ఆతనిహృదయము విలాససుఖంబులఁ దేలియాడుచున్నను విచారించుచునే యుండెను. ఆకారణముచేతనే యాతఁడు తన ప్రాణములను బౌద్ధధర్మములకుఁ బూజోపహారములుగఁ జేసివైచెను. అందువలన నప్పుడాతనికి నవజీవనలాభము కలిగెను.

ఆనవజీవనమునం దాతఁడు నవనవజ్యోత్స్నాంతరాళమున నవనవాదర్శములం జూడఁగలిగెను. ఆతనికప్పుడు కర్తవ్యము బోధపడియెను. ఆనూత్నవిజ్ఞానతేజస్సాహాయ్యముచే నాతఁడు ముందుగఁ దనగృహమున సంస్కరణమున కారంభించెను. జీవునకుఁ బ్రేమసంయోగము లభించినది. నిరంతరముఁ దనయాహారమునకై యనేకములగుమృగములును బక్షులును సంహరింపఁబడుచుండుట నాతఁడు కనుంగొనియెను. ఉదరపోషణమునకై యించుక యన్నమును జలమును లభియించినచోఁ

బరితుష్టినందవచ్చు నని యాతఁడు భావించెను. "అందుకొఱకు జీవహింసచేయుట యెందులకు?" అని ప్రశ్నించుకొనియెను. పిమ్మట మహారాజగు నశోకుఁడు తనయాహారముకొఱకు మృగపక్షిమారణము గావింపఁగూడదని యాజ్ఞాపించెను.

రాజానందముకొఱకును, మంత్రులసంతోషముకొఱకును నిత్యనూతనంబులగుచిత్రవిచిత్రఖేలనములు జరగుచుండెడివి; అందుకొఱకొకవిశాలప్రాంగణమునఁ బశుపక్షిమృగాదులద్వంద్వయుద్ధములు జరగుచునుండెడివి. ఒక్కొక్కప్పుడు దుర్దాంతములగు సింహములతోడను, మదగజములతోడను, క్రూరశార్దూలములతోడను, ప్రబలవృషభములతోడను నపరాధులగు ప్రజలనుబోట్లాడించి వారిబలపరిమాణములు గ్రహియింపఁబడుచుండెను. ఈసకలవినోదవ్యాపారములును తుట్టతుద కేమైనవో మనము సులభముగ గ్రహియింపఁగలము. ఒకప్పు డట్టివిలాసక్రీడ లానందదాయకములుగనే యుండెను. ఇప్పు డాకాలము తిరిగిపోయినది. నూత్నతేజమునందు విస్పష్టముగఁ గానవచ్చుచున్న యార్తులయశ్రువర్షములును శిక్షితుల రక్తప్రవాహములును నాతని కసహ్యాపరివేదనముం గల్పించుచుండెను. ఆతనికరుణార్ద్రహృదయమునందు సర్వభూతసమానుభావ ముదయించెను. ఇఁక నాతఁడు చూచుచు నూరకుండఁజాలకపోయెను. అదిమొదలుగ నామహారాజు నిష్ఠురంబులును నిర్దాక్షిణ్యంబులు నగునట్టి కౌతుకక్రీడలను నిలిపివేయున ట్లాజ్ఞాపించెను.

ప్రేమావతారుఁడైన బుద్ధదేవుని ప్రియశిష్యుఁడగు నశోకుని హృదయమునఁ బ్రేమశక్తి యుదయించినది. ఆశక్తియే మహారాజు పాకశాలను, ప్రాసాదములను, ప్రాంగణములను గూడఁ బరిశుభ్రపఱచి రాజ్యమందంతటను వ్యాపించి పరిపాలింప నారంభించెను. మహారాజగు నశోకుఁ డిన్నాళ్ళవఱకును విహారార్థము వేటకుఁ బోవుచుండెను. ఆవేట చాల నాశ్చర్యకరమైనది. ఇప్పుడు వేట యనిన గొందఱు వేటగాండ్రును గొన్ని యేనుఁగులును, గొంతిపరివారమును, గొన్నితుపాకులును, బల్లెములును మనకు జ్ఞప్తికి వచ్చును. కాని మహారాజగు నశోకునికాలమునందుమాత్రము వేట మఱియొకవిధముగా నుండెను. ఆతఁడొక్కప్పుడు బంగారుపల్లకినెక్కియు, మఱియొకప్పుడు గజారోహణము చేసియు వేటకుఁ బోవుచుండెడివాఁడు. ఆతనినలువంకలను నాయుధహస్తులగు సైనికులును, నమూల్యవేషభూషణాలంకృతలగు వారనారీమణులునుగూడఁ బోవుచుండిరి. చుట్టును బరివేష్టించియున్న రజ్జుమధ్యమునుండి వారందఱును నడచుచుందురు. ఆరజ్జుమండలముచుట్టును శస్త్రధారిణులగు వీరనారీమణులు వేలకొలఁది తిరుగుచుందురు. దురదృష్టవశమునఁ దెలియక యెందెవ్వఁడైన నావీరనారీమణులు ధరియించి వచ్చుచున్న యారజ్జుసీమ నతిక్రమించినచోఁ దత్క్షణమే యాతనికి మరణదండన మగుచుండెను. ఈవిధము లగు నరహత్యలే విలాసక్రీడలుగా నున్నప్పు డిఁక బశుపక్షిమృగాదుల

మాట చెప్పవలసినదేమున్నది? మహారాజగు నశోకుఁడు బౌద్ధధర్మము నవలంబించినతరువాత నిట్టిదారుణసమారోహము లన్నిటిని రూపుమాపివైచెను. ఆతనిహృదయమునందలి కరుణాప్రవాహము మహారణ్యసీమవఱకును బ్రవహించుచుండెను. భయంకరారణ్యములయందలి జీవులుకూడ నిర్భయముగ సంచరించుట కవకాశము కలిగెను.

అశోకసార్వభౌముఁడు ప్రేమధర్మదీక్షితుఁడై క్రమక్రమముగా నిట్టి భోగవిలాసములను, క్రీడాకౌతుకములను, వ్యసనములనుగూడఁ బరిత్యజించివైచెను. భోగపరివర్తనమున సంయమనమారంభ మయ్యెను. నవజీవనలాభమునఁ జండాశోకుఁడు ధర్మాశోకుఁ డయ్యెను. బిందుసారసార్వభౌముని యప్రియపుత్త్రుఁ డిప్పుడు దేవతలకుఁగూడఁ బ్రియదర్శనుఁడయ్యెను.

పందొమ్మిదవ ప్రకరణము.

పరివర్తనము.

ప్రియదర్శనుఁ డగు నశోకుఁడు నవజీవనలాభానంతరము నుండియు బౌద్ధధర్మస్థాపనముకొఱకు విశేషప్రయత్నములను గావించెను. బౌద్ధధర్మములను సంస్కరించునిమిత్తము మహాజనసభలఁ గూర్చి చర్చించుట యీవిధమగు ప్రయత్నములలో

మా ఖ్యమైనది. భగవానుఁ డగుబుద్ధదేవునినిర్వాణానంతరమునఁ జాలమంది ప్రజలు సత్యధర్మముకొఱకును, శాంతిలాభముకొఱకును బుద్ధమతము నాశ్రయింపఁ జొచ్చిరి. క్రమముగా నీభారతవర్షమున బౌద్ధధర్మమే ప్రబలమయ్యెను. దేశమునందలి గొప్పవారందఱునుగూడ బౌద్ధులుగనే యుండిరి. రాజానుగ్రహము, రాజ్యసుఖశాసనములనుగూడఁ జాలవఱకట్టిబౌద్ధమతావలంబులగువారికే యనుకూలములుగనుండెను. లోకులందఱును బౌద్ధశ్రమణులను మిగుల గౌరవించుచుండిరి. ఇట్టిసుఖానుభవముకొఱకును గౌరవముకొఱకును జాలమంది బౌద్ధధర్మము నాశ్రయించుచుండిరి. అనేకనీచబ్రాహ్మణులు శ్రమణవేషధారులైరి. అట్టివారు తమబుద్ధికౌశల్యముచే బుద్ధమతప్రవర్తకులగు జనులలో వికృతాచారవ్యవహారరీతిని వ్యాప్తము చేయసాగిరి. ఆకాలమున విశేషవ్యాప్తమైయున్నహిందూమతము కూడ నాబౌద్ధధర్మవిభేదము నించుకంత కనుపెట్ట నారంభించెను. అశోకసార్వభౌముని రాజ్యకాలమునందుఁ బ్రప్రథమమున బౌద్ధమత మీవిధముగా నుండెను. అప్పుడుపగుప్తుఁడనునాతఁడు బౌద్ధసమాజమున మతాధికారిగానుండెను. ఆతఁడు నిష్ఠాగరిష్ఠుఁడును, బుద్ధభక్తుఁడు నైయుండెను. బౌద్ధశాస్త్రమునం దాతని కసాధారణప్రజ్ఞ యుండెను. ఆతఁడు పవిత్రబౌద్ధమతముంగూర్చి యితరులుచేయుచున్న యపచారములం జూచి మర్మాహతుఁడయ్యెను. ప్రచ్ఛన్నులగుదుర్వి

నీతుల దుర్బోధనములను మాన్పించుటకొఱ కాతఁడు సాధ్యమైనన్నిప్రయత్నములను జేయ నారంభించెను. కాని, స్వార్థపరాయణులగునట్టికపటవేషధారులనుబట్టి శాసించుట యాతనికి శక్యము కాకపోయెను. వారు చేయుచున్న విరుద్ధకార్యములం గనిపెట్టి శాసింపఁ జూచినప్పుడు వారు తమవాక్చాతుర్యముం జూపి తప్పించుకొనుచుండిరి. ఇది యంతయుఁ జూచుచు వినుచు నేమియుందోఁపక యుపగుప్తుఁడు, నిరాశవలనను విరక్తివలనను దనమతాధికారమును వదలుకొని యేకాంతవాసము చేయుచుండెను.

ఈసంగతు లన్నియు నశోకమహారాజునకు యథాసమయమునఁ గర్ణగోచరము లయ్యెను. అప్పుడాతఁడు బౌద్ధభిక్షులను దురాత్ములనుండి యుద్ధరించుటకు సంకల్పించుకొనియెను. కపటవేషధారులగు మతవిరోధులను రాజ్యమునుండి పాఱఁదోలినచో నప్పుడు నిష్కంటకముగ మతప్రచారము కాఁగలదని యాతని కాశయు, విశ్వాసమును గలిగెను. ఈయుద్దేశము ప్రకటించుటకై యామహారాజు తనయున్నతోద్యోగి నొక్కని భిక్షుమండలసాన్నిధ్యమునకుఁ బంపించెను. రాజోద్యోగి వారికి మహారాజాభిప్రాయమును దెలియఁజేసెను. కపటాత్ములగు మతవిరోధులు చాలభయపడిరి. రాజోద్దేశమును నిరర్థకముగఁ జేయుటకో మఱియొదులకోగాని భిక్షుమండలమునఁ గొందఱుకొందఱు రాజోద్దేశముంగూర్చి తీవ్రముగ నాలోచింపసాగిరి. ఇందువలన రాజోద్యోగికి విషమక్రోధము కలి

గెను. ఆకారణముం బట్టి యాయుద్యోగి యాభిక్షులలోఁ
గొందఱను వధించివైచెను. ఒకటిచేయఁబోయిన మఱియొకటి
యయ్యెను. రాజోద్యోగిచేసిన దుష్కార్య మశోకమహారాజు
నకుఁ దెలిసినది. ఆతఁ డిప్పుడు ధర్మాసక్తుఁడై యున్నాఁడు;
ఈభయంకరకార్యముఁ గూర్చి మిగులఁ బరితపించెను; ఈయప
రాధము తనదియే యని భావించుకొనియెను. ఏమనిన—తానే
యాయుద్యోగిని భిక్షుమండలమునొద్దకుఁ బంపియున్నాఁడు.
ఆతనిఁ బంపక పోయినచో నిట్టివిపరీతము కలిగియుండదుగదా
యని మహారాజగునశోకుఁడు భావించుకొనుచు నస్థిరచిత్తుఁ
డయ్యెను. అప్పు డాతఁడే స్వయముగఁ బోయి భిక్షుగణముం
జూచి "ఈనరహత్యలవిషయమున నపరాధ మెవ్వరిది ?"
అని ప్రశ్నించెను. కొందఱు రాజోద్యోగి యపరాధియనిరి.
మఱికొంద ఱట్టివానిని మాయొద్దకుఁ బంపుటచే మీరే యప
రాధు లనిరి.

ఇట్టిభిన్నాభిప్రాయములమధ్యమున మఱికొందఱు "చేసి
నపని మంచిదా చెడ్డదా ? ఆనిమిత్తమున దోషియెవ్వఁడు ?
అనువిషయముం గూర్చి విచారింపవలసివచ్చినచో నప్పుడు కర్త
యభిప్రాయమును దెలిసికొనవలసియుండును." అని చెప్పిరి.
ఏమైననేమి ? ఈవిషయమున సూక్ష్మవిచారణ చేయుటకు
మహాత్ముఁ డగునుపగుప్తుఁడే సమర్థుఁడు. మహారాజు పూర్వ
మునుండియు నుపగుప్తుని మిగుల గౌరవించుచుండెను. మఱి
యు భిన్నాభిప్రాయులగు భిక్షులతోఁ దనయభిప్రాయ మేకీ

వింపక పోవుటవలన నుపగుప్తుఁడు తనమతాధికారపథమును వద
లుకొని పోయినసంగతి కూడ మహారాజగునశోకునకుఁ దెలి
యును. ఆయుపగుప్తుఁ డిక్కడకువచ్చినచో నెల్లవిషయములను
సాధింపవచ్చు ననియెంచి యశోకుఁ డాతనిఁ దనయొద్దకుఁ దీసి
కొనివచ్చునట్లాజ్ఞాపించెను. కొంతమంది పోయి యాతని కా
సంగతిఁ దెలియఁజేసిరి. అప్పు డుపగుప్తుఁడు భిక్షుమండలము
నొద్దకు మరలవచ్చువిషయమునఁ దనయనిష్టమును సూచిం
చెను. పరితప్తహృదయుం డగుమహారాజంతమాత్రముతో
నూరకుండలేదు. ఆతఁడు మరల నాతని బలవంతముగఁ దీసి
కొనివచ్చుట కాజ్ఞాపించెను. అప్పు డుపగుప్తుఁ డేమియుం జేయఁ
జాలక త్వరలోనే వచ్చెద నని వార్తనంపించెను. అందువలన
నశోకున కించుక యూరట కలిగెను. తరువాత నుపగుప్తుఁడు
నౌకపైనుండి వచ్చుచుండె నని విని యశోకుఁడు గంగాతీరము
నకు వచ్చి యతివినయముతో నుపగుప్తునిం దర్శించి నమస్క
రించి యాతనిం దనతోఁ దీసికొనివచ్చి యొక సుసంపన్న
మగుసౌధమునం దాతని విడియించెను.

ఉపగుప్తుఁడు నగరమునకు వచ్చులోపల నేనేమి చేయవ
లయునో మహారాజిదివఱకే యాజ్ఞాపించియుండెను. రాజాజ్ఞ
ననుసరించి యెల్లకార్యములును సంపూర్ణము లయ్యెను. ఇఁక
నుపగుప్తుఁడు వచ్చుటయే మిగిలినపని. అతికష్టముచే నదియును
బూర్తియైనది.

నిర్దిష్టసమయమున నెల్లవారును సభామంటపమునకు వచ్చి యుండిరి. విశాలచంద్రశాలామంటపమున భిక్షుగణము కూడియుండెను. ఏవంకఁ జూచినను గాషాయవస్త్రధారులును ముండితశిరస్కులు నగుభిక్షులే యగపడుచుండిరి. ఆబుద్ధసన్న్యాసులకు మధ్యభాగమున నుపగుప్తుఁడు కూర్చుండి యుండెను. ఆతనిపార్శ్వమునందే మహారాజపీఠము వేయింపఁబడియెను. కాని యింకను నాపీఠము శూన్యముగనే యుండెను. అక్కడివారిదృష్టులన్నియు నాయుపగుప్తునివంకను, నాశూన్యసింహాసనమువంకను బ్రసరించుచుండెను. అందఱు నుత్సాహముతో నుండిరి. ఆయాలస్యము వారియుత్సాహమున కంతరాయముం గూర్చుచుండెను. ఇట్టిసమయమున నాసభామధ్యమునం దించుకచలనచిహ్నము గానవచ్చెను. ప్రశాంతజలరాశి మృదువాయువేగసంచలితమైన ట్లుండెను. సంయతచిత్తు లగుభిక్షుమండలములు భావతరంగవిలసితము లగుచుండెను. వారినిర్వికారవదనఫలకంబులనించుక కుతూహలము,నించుకవిస్మయము, నించుకయధైర్యమును గానవచ్చుచుండెను. క్రమముగ నాచంచలతరంగములు ప్రబలము లగుచుండెను. సభాసదు లెల్లరును లేచి నిలువఁబడిరి. అందఱివదనములనుండియు "మహారాజు! మహారాజు!" అనుమాట లస్పష్టస్వరముతో వెలువడియెను. అందఱును మహారాజుదర్శనమునకై తొందరపడుచుండిరి. కాని మహారాజెక్కడ? మణిభూషణవిరాజితుఁడును గిరీటాలంకృతుఁడును దండపాణియునగుమహారా జేడీ?—ప్రతినిమిష

మును నిరాశావిస్మిత మగుచుండెను. ఆసమయమునం దొక ప్రాచీనభిక్షుపార్శ్వస్థుఁడగు నవీనభిక్షుని వ్రేలితోఁ జూపుచు నందఱును "ఇతఁడే! ఆతనిపార్శ్వమునందున్న యీతఁడే!" అని యస్పష్టస్వరంబునఁ బలుక నారంభించిరి. విలక్షణాకారుఁడగు నొకపురుషుఁడు సామాన్యాకృతితో ససంభ్రముఁడై యందఱకు నమస్కరించుచు నాశూన్యాసనమువైపునకు వచ్చుచుండెను. ఆపీఠమును సమీపించి యాతఁడు ధర్మాచార్యుఁడగుసభాపతి కభివాదనముం గావించెను. ధర్మాచార్యుఁ డగు నుపగుప్తుఁ డప్పుడు లేచి యాతని నభినందించి యాశీర్వదించి తనపార్శ్వమునందున్నశూన్యాసనముపైఁ గూరుచుండు మని చెప్పెను. సభాసదు లందఱు ననిమేషనయనులై యానూతనాగంతుకపురుషునిం జూడ నారంభించిరి. నీలవర్ణంబును, విలక్షణంబును నగునాతనియాకారము నెవ్వరు నానవాలుపట్టలేదు. ఆనవాగతపురుషునియపూర్వవదనశోభయు, నలోకసామాన్యతేజోవిలసితనయనద్వయవిరాజితంబగు వదనమండలమును జూచి యందఱును విస్మితులై పోయిరి. ఆపురుషుని ప్రతిదృష్టి శ్రేణినుండియు నపూర్వరాజతేజఃపుంజములు ప్రకాశితము లగుచుండెను—మహారాజు పీఠము నలంకరించెను. సభ్యులెల్లరును దమతమపీఠములపై నిశ్శబ్దముగఁ గూర్చుండిరి.

పంచేంద్రియవ్యాపారమంతయుఁ గన్నులలోనే నిలిచి యుండుటవలన సభ్యులం దెవ్వరికిని శబ్దస్పర్శరసగంధానుభవ మగుటలేదు. సర్వదేహశక్తులును, సర్వమనశ్శక్తులునుగూడ

నప్పుడొక్కకన్నులయందు మాత్రమే యేకీభవించి యుండెను. అందఱునేకాగ్రదృష్టితో మహారాజును మహాత్ముఁడగు నుపగుప్తుని జూచుచుండిరి. అప్పు డశోకుఁ డుపగుప్తుని కెదురుగ లేచి నిలువఁబడి వినయవచనములతోఁ బూర్వోక్తభీభత్సవ్యాపారముం గూర్చి లేచి "ఈవిషయమున నేనెంతవఱకపరాధిని?" అని ప్రశ్నించెను. ధర్మాచార్యుఁ డాద్యోపాంతముగ నెల్లసంగతులను విని యించుకసేపాలోచించి "మహారాజా! నీవు ధర్మప్రాణుఁడవు. ధర్మవిజయమును సాధించుటయే నీయుద్దేశము. ధర్మరక్షణమే ప్రజారక్షణము. రాజ్యరక్షణము. ధార్మికసంఘరక్షణము. ధర్మము ధార్మికులను గాపాడును. నీయుద్దేశము మహత్తరమైనది. సాధుసమ్మతమైనది. దేవతలు మానవులయభిప్రాయములను, నుద్దేశములను గ్రహించి వారివారి కర్మములం గూర్చి విచారణ చేయుచుందురు. ఈవిషయమునఁ గూడ నీసనాతననీతియే యుపయోగింపఁబడఁగలదు. బాగుగ నాలోచించిచూడఁగా నీదుఃఖకరహత్యాసంబంధమున నీవు సంపూర్ణముగ నిరపరాధివి." అనియెను.

మహారాజగునశోకుఁ డిప్పటికి శాంతచిత్తుఁడయ్యెను. అప్పుడాతఁడు ధర్మాచార్యులకును సభ్యులకును వందనము లాచరించి మరలఁ దనపీఠము నలంకరించెను. ధీమంతులును, బ్రాజ్ఞులు నగుభిక్షు లందఱు నుపగుప్తుని ధర్మనిర్దేశమునకు సంతుష్టచిత్తులైరి. ప్రియదర్శనుఁ డగునశోకుఁడు మేఘముక్తసుధాకరునివలె నధికతరప్రియదర్శనుఁడై ప్రకాశించెను.

ఇరువదియవ ప్రకరణము.

సంస్కరణసభ.

మహారాజుహృదయమును గ్రహించినతోడనే భిక్షుమండలికిఁ గలసకలసందేహములును వదలిపోయినవి. అనంతరము వారందఱును నశోకునిసదుద్దేశముంగూర్చి సంతుష్టులైరి. విశ్వాసముగల నిష్ఠావంతులగుబౌద్ధులు స్వార్థపరులైన కపటవేషధారులను దమబౌద్ధసమాజమునుండి తొలఁగించివేయుటకు బద్ధకంకణులైరి. కపటాత్ముల దురుక్తులచే గర్హితంబు లగుదురాచారములను రూపుమాపుటకు వారందఱును బ్రయత్నింపసాగిరి. భగవానుఁ డగుబుద్ధదేవుని సదుపదేశము లన్నియు నేవిధముగ లోకమున సర్వోత్తమస్థానము నలంకరించునో యావిషయముంగూర్చి బౌద్ధధర్మాసక్తులగువా రెల్లరు నాలోచింపసాగిరి. సార్వభౌముఁ డగునశోకుఁడు పూర్వమునుండియు నిందులకే ప్రయత్నించుచుండెను. ఇప్పుడు సామాన్యముగనే ధర్మప్రచారమును సంస్కరణమును జేయవచ్చునని తెలిసికొనియెను. కపటాత్ములబోధనమువలన దురాచారులగు బౌద్ధులంగాంచి విరక్తుఁడై తనయాచార్యత్వమును ద్యజియించి మధురానగరమునకుఁ బోయియుండిన మహాత్ముఁడగునుపగుప్తుఁడు మరల నిప్పుడు పాటలీపుత్రనగరమునకు వచ్చియుండెను.

బౌద్ధధర్మమునకును, సంఘమునకును వర్ధిల్లుట కనుకూలదినములు వచ్చినవి. ఇచ్ఛాక్రియాజ్ఞానశక్తులు మూఁడు

నొక్కచో సమ్మిళితములై యుండెను. అశోకమహారాజు తన సదుద్దేశము నుపగుప్తునకు నివేదించెను. నైష్ఠికులును, ధర్మైకజీవనులు నగు భిక్షులు తమతమయభిప్రాయములను ధర్మాచార్యునకు విశదీకరించిరి. అందఱయభిప్రాయములనుబట్టియు నాలోచింపఁగా మతప్రవర్ధనమున కొకసంస్కరణసభ యేర్పఱుపవలయునని నిశ్చయింపఁబడియెను. ఇచ్ఛయు, సామర్థ్యమును, నుపాదానము నేకమైనప్పుడు కర్మానుష్ఠానమునకు విలంబము కలుగఁబోదు. పాటలీపుత్రనగరమున బౌద్ధధర్మసమాజసంస్కరణార్థమై యొక్కగొప్పసభ కూడెను. ధర్మాచార్యుఁడగునుపగుప్తుఁడు సభాధ్యక్షుఁడయ్యెను. నియమవంతులును శాస్త్రజ్ఞులును, సుధీరులు నర్హులు నగు వేయిమందిబౌద్ధనైష్ఠికులతో నొకసమితి యేర్పఱుపఁబడియెను. కార్యనిర్వాహణవిషయంబున నట్టిసమితికిఁ దొమ్మిదిమాసము లవధి యేర్పఱుపఁబడియెను.

ఈసభయం దనేకదేశస్థులగు బౌద్ధులు చేరియుండిరి. అశోకమహారాజుకూడ నీమహాసభాసభ్యుఁడైయుండెను. మహాధికారి యగునుపగుప్తుఁడు మహారాజసమక్షమున సభాగణసమాగతులగు బౌద్ధులనందఱను వారివారిధర్మమతవిశ్వాసములంగూర్చి విచారణ చేయుచుండెను; వారునడచుకొనవలసిన పద్ధతులనన్నిటిని వారికి బోధించుచుండెను. వారికార్యకలాపముల విస్పష్టముగఁ దెలిసికొనుచుండెను. ఈవిధముగఁ బరీక్షించుటవలన ననేకులగు కపటాత్ముల చరిత్రములు తెలియ

వచ్చుటచే ధర్మవిరుద్ధాచారానుష్ఠానములసంగతులుకూడ విస్పష్టములు కాఁజొచ్చెను. సభాపరీక్షయం దెవ్వరు స్వార్థపరులును గపటాత్ములు నని నిశ్చయింపఁబడుదురో యట్టివారు బౌద్ధసంఘమునుండి రాజాజ్ఞచేఁ దఱిమివేయఁబడుచుండిరి. ఈరీతిగా నాఱువేలమంది కపటవేషధారులు బౌద్ధసంఘమునుండి తొలఁగింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. పిమ్మట నాయర్హసభ దురాత్ములదురాచారములను రూపుమాపి భగవంతుఁడగు బుద్ధదేవుని విశుద్ధధర్మసూత్రములను లిపిబద్ధములుగఁ జేయఁగలిగెను. ఈపరిశుద్ధసభాసాహాయ్యమున బౌద్ధధర్మపవిత్రగ్రంథము (త్రిరత్న) వహ్నిసంస్కృతం బగుసువర్ణమువలె విశుద్ధమై మరల నందఱకును బరిగ్రహయోగ్యమయ్యెను.

అశోకసార్వభౌముని జీవితచరిత్రమునందును, బౌద్ధధర్మేతిహాసమునందును నీమహాసంస్కారసభావిషయము చిరస్మరణీయమైనది.

ఇ రు వ ది యొ క ట వ ప్ర క ర ణ ము.

సద్గురువు.

మౌర్యతిలకుఁ డగునశోకసార్వభౌముఁడు పూర్వాపరధర్మాచారి యగునుపగుప్తునియెడల భక్తిశ్రద్ధలు గలవాఁడై యుండెను. ఇప్పుడు మతము, సంఘసంస్కరణము మొదలగు

వానియం దాతనితోఁ గలసిపనిచేయుటచే నశోకుఁడు ధర్మాచార్యుఁడగు నుపగుప్తునిసద్గుణములకు ముగ్ధుఁడైపోయెను. ఆ రాజశిష్యుని యుదారహృదయమును, నసాధారణగుణగణములును, నన్నిటికంటెనధికం బగునాతని ధర్మైకచింతయు బాగుగఁ దెలిసికొని యుపగుప్తుఁడుకూడ నశోకునిసద్గుణములకు ముగ్ధుఁడైపోయెను. తామిరువురును గలిసియుండుట మిగులభాగ్యమని యిరువురును దలంచుకొనుచుండిరి. పుణ్యనదీప్రవాహద్వయ మేకత్రమిళితమయ్యెను. ఇరువురిప్రార్థనములును సఫలీకృతము లయ్యెను.

విశ్వజనప్రేమధారాద్వయమొక్కచో మిళితమయ్యెను. అట్లుమిళితములైనయాధారావాహినులు రెండు ననంతసాగరసమ్మిళితములయ్యెను. విశ్వహితప్రశాంతసాగరము వానియొదుట ననంతవిస్తృతమైయుండెను. మానవపశుపక్షికీటపతంగవృక్షలతాచేతనాచేతనములతో నిండియున్నయీవిశ్వమునకంతకును గల్యాణముకొఱకును, వికాసముకొఱకును, సాహాయ్యముకొఱకునునాయనంతమంగళసాగరమువిరాజమానమగుచుండెను. ఇప్పుడాయిరువురిహృదయములు నావైపునకే పోవుచుండెను. ఈదివ్యమార్గమునందలిప్రథమపథికుఁడును, ప్రేమావతారుఁడును, భగవానుఁడు నగుబుద్ధదేవుని యడుగుజాడల ననుసరించిపోవుటయే యాగురుశిష్యుల యేకాంతోద్దేశమై యుండెను. బుద్ధదేవునిపాదరజముచేనే యేస్థలములు పుణ్యతీర్థములుగఁబరిణమించినవో యాస్థానములను దర్శింపవలయు నని వారిరువురును

ప్రప్రథమమున నుద్యుక్తులైరి. చతుస్సముద్రముద్రితమును, హిమాచలశోభితంబును నగుభారతవర్షమున కంతకు నాతఁడు చక్రవర్తియై యుండెను. ఇప్పుడాతనియుద్దేశ మేమి? ధనపదార్థసంగ్రహము, మార్గసంస్కారము మొదలగువానివిషయమై యాతఁడెవ్వరికిని నాజ్ఞాపించియుండలేదు. ఆతనిహృదయ మాపవిత్రమనోరథపరిపూర్ణమై యుండెను. కాని వ్రతాచరణమునకుఁ బూర్వము నియమసాధనముం బోలె నాతఁడు పూజనీయుఁడగు నుపగుప్తాచార్యుని ప్రబోధనములవలనఁ దీర్థయాత్రోద్యోగము నందుఁ దనమనఃప్రాణముల నేకీభవింపఁ జేసెను. అశోకమహారాజా! నీవేధన్యుఁడవు! నీయదృష్టమెంత ధన్యమైనది! నీగురుబల మెంతధన్యమైనది! ఉపగుప్తుఁ డుపదేశకుఁడై యుండఁగా నీవుపరమసౌభాగ్యసంపన్నుఁడ వైతివనుటలో నేమియాశ్చర్యమున్నది?

ఇరువదిరెండవప్రకరణము.

పుణ్యప్రసంగము.

ఏమహాపురుషుఁడుపదేశకుఁడుగా లభించుటవలనఁదాను ధన్యుఁడ నైతి నని ధర్మశీలుఁడును, ప్రియదర్శనుఁడు నగునశోకసార్వభౌముఁడు భావించుకొనుచుండెనో యాధర్మాచార్యుని పుణ్యకథాప్రసంగములంగూర్చి యాలోచించుకొని మనముకూ

డ ధన్యుల మగుదము.—ఉపగుప్తుఁడు కాశీనివాసియు, సుగంధద్రవ్యవిక్రేతయునగుగుప్తునితనయుఁడు. పదునేడు సంవత్సరములయీడుననే యాతనిమతాసక్తి యతిప్రబల మయ్యెను. ధర్మము కొఱకును, సద్గురులాభము కొఱకును నాతఁడు దేశదేశములఁ దిరిగి తిరిగి తుదకుఁ జంపానగరమునకు వచ్చెను. ఆసమయమునం దచ్చట శాస్త్రజ్ఞుఁడును, భక్తుఁడును, సనవాసుఁ డను పేరుగల బౌద్ధమతాచార్యుఁడు వాసముచేయుచుండెను. ఉపగుప్తుఁడామహాత్ముని దర్శించి తనయభిమతమును దెలియఁజేసెను. ఆబౌద్ధగురుఁ డాయువకునియసామాన్యప్రతిభావంతము లగు ముఖలక్షణములం గనుపెట్టెను. ఆతని సకలాంగకములం గల శుభలక్షణములను గ్రహియించెను; ఆతని దనశిష్యునిగాఁ జేసికొనుటకు స్థిరపఱచుకొనియెను. కాని, యాయువకునియుద్దేశమునందలిదృఢత్వమును, మనఃపరితాపమును బరీక్షించుటయావశ్యకమని యోచించుకొనియెను. ఇట్లు శిష్యులను బరీక్షించుట ప్రాచీనకాలమునందు నాగరికతనందినయితరదేశములయందుఁగూడఁ బ్రచారమునం దుండెను. ప్రాచీనగ్రీసుదేశమతాచార్యుఁడగు "పిథాగోరన్" అనునతఁడు తనయుపదేశముం గోరివచ్చిన యువకుల నేడుదినములవఱకు నంధకారగృహమునమృత్తికానిమ్నభాగమునందుంచి పరీక్షించుచుండెనని తెలియవచ్చుచున్నది. ఆయవరోధానంతరమునం దెవ్వఁడు నిశ్చలహృదయముతోఁ దనయుపదేశములనే యాకాంక్షించునో యట్టివానినే యాతఁడు తనశిష్యునిగా గ్రహించుచుండెనఁట! అన్ని

సంగతులును నేర్చికొనుట కందఱును సమర్థులు కారు. అందుచేత నెవ్వఁడేవిషయమును గ్రహించుట కుపయుక్తుఁడో యాసంగతిని బరీక్షించి నిశ్చయించుట యుపదేశకునకుఁ బ్రథమకర్తవ్యము. ఎవ్వనికన్నులయం దశ్రువులును, సర్వాంగకములఁ బులకలును లేకుండునో యట్టివాఁడు భక్తిమార్గమునఁబథికుఁడుగానుండుట కర్హుఁడు కాఁడు. ఏమైననేమి! బౌద్ధాచార్యుఁడగు సనవాసుఁడాయుపగుప్తుని శిష్యునిగాఁగ్రహించి "ఓకుమారా! మనుష్యహృదయ మాకాశమువంటిది. ఈయాకాశమున వివిధహృదయభావములనుండి చింతామేఘము లుత్పన్నము లగుచున్నవి. ఈమేఘములు విశేషసమయములలోఁ గృష్ణవర్ణములై యుండును. మఱియు వీనిలో ననేకములు నిర్మలములును, ధవళములు నై యుండును. నీవు కొంతకాలమువఱకు నిర్జనస్థలమున నివసించియుండుము. ఎదుట నొకయుదకకలశము నుంచుకొని నీలశ్వేతవర్ణంబులగుకొన్నిశిలాఖండములను సంగ్రహించియుంచుము. నీహృదయాకాశమున నెప్పుడెట్టిరంగుగల చింతామేఘ మగపడునో యట్టిసమయమున నట్టిరంగుగలయుపలఖండమును జలపూర్ణకలశమున నిక్షేపించుచుండుము. అనంతర ముదయమున నాజలమును దీసివైచి యందున్నశిలాఖండములను వర్ణానుసారముగ విభాగముచేసి చూచుచుండుము. ఇట్లు చేయుచుండుటవలన నేమిఫలము లభియించునో యాసంగతి నాకు నిర్దిష్టదినమునం దెఱింగింపుము." అని యుపదేశించెను.

ఉపగుప్తుఁడు సనవాసునియాజ్ఞానుసారముగఁ బ్రవర్తిం

షం దొడంగెను. మొట్టమొదటం గొన్నిదినములవఱకు నీలశిలాఖండసంఖ్య యధికముగం గానవచ్చెను. అనంతరము క్రమక్రమముగ నాసంఖ్య తగ్గిపోవనారంభించెను. తుదకన్నియును శ్వేతోపలఖండములే యయ్యెను. యువకునియానందమునకుం బరిమితిలేకపోయెను. అప్పు డుపగుప్తుండు సనవాసుని దర్శించి యెల్లసంగతులును మనవిచేసెను. ఈయువకునకుం జిత్తశుద్ధి యయ్యెనని సనవాసుండు గ్రహించెను. అనంతరము సనవాసుం డాయుపగుప్తుని దనశిష్యునిగం జేసికొని యథావిధిగ ధర్మోపదేశములం జేయుచుండెను; సావధానముగ ననేకరహస్యధర్మముల నాతనికి బోధించెను; సర్వసిద్ధుల నాతండు గ్రహించునట్లు చేసెను. ఉపగుప్తుం డచిరకాలమునందే బౌద్ధులందఱిలోనను సిద్ధపురుషుండను ప్రతిష్ఠాలాభమును బొందెను; పూజాప్రశంసాపాత్రుండయ్యెను. కొంతకాలమునకు సనవాసుండు పరమసిద్ధి నందుటచే నాతనిసింహాసనమున కుపగుప్తుం డధికారియై బుద్ధధర్మప్రచారము చేయనారంభించెను. ఈవిధముగ నాతండు చాలకాలము నానాస్థానములయందు నానాజాతుల బుద్ధధర్మప్రశాంతవచనములను ధర్మాసక్తులగుస్త్రీపురుషుల కందఱకును బోధింపసాగెను.

ఉపగుప్తునికీర్తి నలుదెసల వ్యాపించెను. ఆతనిపుణ్యప్రసన్నముఖమండలము పూర్ణిమాచంద్రునివలె లోకులకు మనోమోహన మగుచుండెను. ఆతనిపవిత్రముఖోద్గత యగువాణి యమృతస్వరూపిణియై యుండెను. సంచారసమయమునం దా

తనియశస్సౌరభ మాతనికంటె ముందుగనే ప్రయాణము చేయుచుండెను. అందువలన ముగ్ధులై యాతనియపూర్వపుణ్యమూర్తిని దర్శించుటకును, నాతనిపవిత్రోపదేశముల వినుటకును జనులందఱును గుంపులుగుంపులుగ వచ్చి యాతని నెదుర్కొనుచుండిరి. ఒకప్పు డాతండు మధురానగరమునకుం బోయినప్పు డీవిధముగ జనసంఘము లాతని నెదుర్కొనుట తటస్థించెను. అప్పు డాతండు విశాలరాజమార్గమున సకలజనాగ్రవర్తియై నడచుచుండెను. ఉభయపార్శ్వములయందలి గృహగవాక్షములనుండియు నాబాలవృద్ధజనంబులు పరమానందముతో నాతనిం దర్శించుచుండిరి; తమశక్తికొలంది నాతని బ్రశంసించుచుండిరి; ప్రణామము లాచరించుచుండిరి. కాని జగతియందెల్లవారియభిరుచులు నొక్కటేరీతిగ నుండంబోవు. అట్లుకానిచో నవఘనశ్యాముండును జటావల్కలధారియు నగుశ్రీరామచంద్రమూర్తి పవిత్రమనోహరకాంతిం జూచి పాపాత్మురాలగుశూర్పణఖ చిత్తవిభ్రాంతిగాంచుట యెందులకు? మధురానగరరాజమార్గమున శ్రీనిధియగునుపగుప్తునింజూచి రూపయౌవనసంపన్నయు, నతృప్తహృదయయు, నగువాసవదత్తయనుపణ్యకాంత వికలచిత్త యయ్యెను. యువతియగునామె స్త్రీజనసులభంబగు సిగ్గునువిడిచి యుపగుప్తునియొద్దకుం దన యభిమతముం దెలుపు నొకదూతిక నంపెను. ఉపగుప్తుం డాదూతినిర్బంధవచనములను మన్నింపలేదు. దూతి చెప్పవలసిన దంతయును జెప్పెను. ఆతండు ధర్మాచార్యుండు. లోకము

ను బాపపథమునుండి మరలించుటయేకదా యాతనివిధాయక కృత్యము? అయినను నాతఁ డామెయొద్దకుఁబోయి బోధింప లేదు. అరివర్గములకుతంత్రములం బడిపోయినవాఁ డాప్తవాక్యముల నెట్లులక్ష్యముచేయఁగలుగును? మంచిసమయమున బోధింపవలయు నని ధర్మాచార్యుఁడు నిరీక్షించుచుండెను. కొంత కాలము జరగిపోయినది.

ఆయువతీమణి యానగరమునఁ దనసౌందర్యసంపత్తిని యథాపూర్వముగనే విక్రయించుచుండెను. ఒకప్పుడు ధనవంతుఁ డగునొకయువకుఁడు రత్నాలంకారభూషితుఁడై యానందమునఁ గాలక్షేపము చేయువలయునని యామెయింటికి వచ్చెను. అప్పుడా వేశ్య నియమితద్రవ్యముతోఁ దృప్తినొందలేదు. ఆతని రత్నాలంకారములనుగూడ గ్రహింపవలయునని యామెయాశ! విషప్రయోగముచే నాతనిజంపి యాపాపాత్మురా లాతనియొద్ద నున్న సర్వస్వమును హరించివైచెను. ఆతనిమృతదేహ మొక రహస్యస్థలమునఁ బూడ్పఁబడియెను. కాని పాపము దాఁగలేదు. ఆదుర్మార్గురాలు పట్టువడియెను. అప్పటిశాసనానుసారముగా నామెముక్కును జెవులను గోయించి యరణ్యమధ్యమునం దామెనువిడిచిపెట్టుటకుఁ దీర్మానింపఁబడియె. ఆవిధముగనేకఠినశిక్ష యయ్యెను. ఆక్రూరరాక్షసి శరీరయాతనచేతను, క్షుద్బాధచేతను, పిపాసాపీడచేతను నల్లాడుచు నాయరణ్యమునంబడి వికృతనాదముతో నేడ్చుచుండెను. ఆసమయమున ధర్మాచార్యుఁడగు నుపగుప్తుఁ డాయరణ్యమార్గమునబయలుదేరి యెచ్చటికోపోవు

చు నావికటార్తనాదము నాలకించి యాదురాత్మురాలిచెంతకు వచ్చెను. అప్పుడాపాపాత్మురా లాయుపగుప్తునిం జూచి నిశ్చేష్టయయ్యెను. అంతలోనే యామెకుఁ బూర్వవృత్తాంతముజ్ఞప్తికివచ్చుటయు దారుణాభిమానముతో నాతనిం జూచి "ఇప్పుడు నాయొద్దకెందులకు వచ్చితివి? నీకొఱకు నిరీక్షించి యున్నప్పుడు నీవు రాలేదు. ఇప్పు డెందులకు వచ్చితివి? నాయీదుర్గతిం జూచి పరిహసించుటకై వచ్చితివా?" అనియెను. ప్రప్రథమమున నామహాత్ముఁ డెట్టియుత్తరము నీయ లేదు. ఆవరఘూర్ణిని తననోటికి వచ్చినట్లెల్లఁ బ్రేలి శ్రాంతయై యూరకుండెను. అప్పుడుపగుప్తుఁడు రెండుమూఁడుమాటలతో నామెను బ్రబోధించి యామె గాయములపై మందువైచి బాధానివారణముం గావించెను; అన్నపానాదులచే నామె యాయాసము నడఁగించెను. ఉపగుప్తునియుపచారములచే నామె త్వరలోనే సుస్వస్థురాలయ్యెను. అప్పు డామె కుటిలవిటప్రదత్తంబగుమదిరారసంబునకును, ముక్తపురుషప్రదత్తంబగుశుద్ధజలంబునకును గల భేదమును బాగుగ గ్రహించెను; సురభిచందనకుంకుమాద్యంగరాగములకును, శోణితప్రలేపమునకు నెంతభేదమున్నదియో యామెకప్పటికి బోధపడియెను. మందభాగ్యురాలగు నామెకిన్నాళ్లకుఁ దెలిసినది! ప్రలుబ్ధులగు నాగరికులచాటూక్తులకును, ననాసక్తుఁడగుభిక్షుని యుపదేశములకు నెంతయంతరమున్నది! ఆనిర్భాగ్యురాలి కిప్పటి కనుభవమునకు వచ్చినది.

దీపమాలాసుశోభితంబగు రాజమార్గమధ్యమునఁగూడ జనులు దిగ్భ్రాంతులై త్రోవదప్పిపోవుచున్నారు. కాని విజనారణ్యమున నర్ధరాత్రమున మేఘాంధకారమధ్యమున క్షణప్రభ యగువిద్యుత్ప్రకాశముచేతనే విహ్వలచిత్తులగుపథికులు తమమార్గమును గనుఁగొనఁగలుగుచున్నారు. మందభాగ్యురాలగు నాయువతి యదృష్టముకూడ నీవిధముగా ఘటిల్లినది. ఆమూఢురాలు సుఖసౌందర్యైశ్వర్యప్రభలలో నెట్టిగతికిఁ బోవలయునో యింతకాలమువఱకుఁ గనుఁగొనఁజాలకపోయెను. కాని యిప్పుడామె తనజీవితదుర్దినఘనాంధకారమున మహాత్ముఁడగు నుపగుప్తుని యుపదేశదీపకాంతిచే నాత్మైకశుద్ధమార్గమును గ్రహింపఁగలిగెను. ఆనిర్భాగ్యురా లిఁక నామార్గమును విడువలేదు. అప్పటినుండియు నామె ధర్మపథమును బట్టిపోయి తుద కమృతసదనమును జేరుకొనఁగలిగెను. ధర్మమునకును ధార్మికులకును గలమహిమ యిట్టిదియే.

ఇరువదిమూఁడవప్రకరణము.

పుణ్యస్మృతి.

బౌద్ధధర్మమందిరమున గాలివానయడఁగినతరువాత మహారాజగు నశోకుఁడు బౌద్ధక్షేత్రముల నన్నింటిని దర్శింపవలయు నని యత్యుత్సాహము కలవాఁ డయ్యెను. భగవానుఁడగు

బుద్ధదేవునిపాదరజోలేశముచే నేస్థలములు పవిత్రములైనవో శ్రీమంతుఁ డగునాతనిచితాభస్మమే త్రిలోకపవిత్రమైనదని యేపుణ్యతీర్థములయందు భాషింపఁబడుచుండెనో, యాసర్వతీర్థములనుగూడఁ దాను స్వయముగఁ బోయి దర్శింపవలయునని యాతఁడు వేఁడుకపడుచుండెను. ఆపావనక్షేత్రములయందుఁ దానొనరించుధర్మసంస్థాపనములపుణ్యస్మృతి చిరకాలమువఱకు జాగరితమగుచుండవలయునని యాతఁ డిచ్ఛయించుచుండెను. ఇంతవఱ కనేకకారణములచే నాతనికోరిక నెఱవేఱినది కాదు. ఇప్పుడు శుభసమయము తటస్థించినది. ఇఁక నాలస్యము చేయరాదని మహారాజు నిశ్చయించుకొనియెను.

బౌద్ధోపాసకుఁడును, బహుశ్రుతుండును, ధర్మాచార్యుఁడు నగునుపగుప్తుఁడు మహారాజునకుఁ బవిత్రక్షేత్రముల ప్రాచీనచరిత్రమును బోధించి యుండెను. ఉపగుప్తుఁ డాపుణ్యక్షేత్రముల నన్నిటిని స్వయముగ నిదివఱకే చూచియుండెను. అందుచేతనే యాతఁ డామహారాజునకు సకలపుణ్యక్షేత్రమహిమలను యథారీతిగ మనోహరముగ బోధింపఁగలిగెను. మహాత్ముఁడగునుపగుప్తుని స్వభావవర్ణనావశమున నాపుణ్యక్షేత్రములన్నియు నామహారాజునకు మనోనయనగోచరములై యుండెను. అప్పుడు మహారాజు తీర్థయాత్రార్థము సంపూర్ణప్రియయత్నుఁ డయ్యెను.

నిర్దిష్టశుభదివసమున మహారాజగు నశోకుఁడును మహాత్ముఁడగునుపగుప్తుఁడును దీర్ఘయాత్రకు బయలువెడలిరి. పాటలీ

పుత్రపరిసరవాహిని యగు భాగీరథిం దాటి వారిరువురును వైశాలీనగరమునకుఁ బ్రయాణము చేసిరి. ఆవైశాలీనగరము పాటలీపుత్రమున కీశాన్యమున ముప్పదిమైళ్ల దూరమున నం దుండెను. బౌద్ధేతిహాసమునందు వైశాలీనగరము సుప్రసిద్ధ మైనది. ఒకసమయమునందు బుద్ధదేవుఁ డీనగరమును దర్శించి మిగులఁ బ్రశంసించి యుండెను. జైనమతగురుం డగు తీర్థంకర మహావీరస్వామిజన్మభూమి యగు నావాగ్రామ మా వైశాలీనగరమునకు సమీపమునందే యుండెను. సుప్రసిద్ధ మగు మహావనవిహారము దానిసమీపముననే యుండెను. ఆవిహారమునందు బుద్ధదేవుఁ డనేకపర్యాయములు తనశిష్యులకు శాంతిమతధర్మోపదేశములను బ్రసాదించి యున్నాఁడు. అశోకమహారాజును, మహాత్ముఁడగు నుపగుప్తుఁడును, దా మానగరమునందు బ్రవేశించి పరమానందము నొందిరి. అచ్చటి ప్రత్యేకదృశ్యములు వారిపుణ్యస్మృతులను బ్రగాఢములుగఁ జేసివైచెను. అచ్చటిప్రజలు మహారాజగు నజాతశత్రునిఁ దిరస్కరించి స్వరాజ్యప్రతిష్ఠాపనముఁ జేసికొని యుండిరి. ఆస్థానమునం దసంఖ్యదండనాయకు లేకీభవించి యనుకూలనిబంధనములతో రాజకార్యనిర్వహణము చేయుచుండిరి. వైశాలీనగరమున బౌద్ధప్రభావ మప్పుడును నిరాఘాటముగ నెలకొని యుండెను. అచ్చటి వాలుకారామవిహారస్థానమునం దప్పుడు చాలమంది భిక్షులును, శ్రమణులును వాసము చేయుచుండిరి.

అశోకమహారా జాస్థలమునఁ గొన్ని స్తూపములను నిర్మించెను. ఆస్తూపములజీర్ణాంశము లిప్పటికిని యాత్రికులకుఁ బూర్వస్మృతిని గలిగించుచున్నవి. వైశాలీనగరమునుండి యశోకుఁడు సపరివారముగ రామగ్రామమునకుఁ బ్రయాణ మయ్యెను. రామగ్రామ మనోమానదీతీరమునం దున్నది. అచ్చటి యామ్రకాననమందే మహాత్ముఁడగు సిద్ధార్థుఁడు తనవినీలభ్రమరకుంతలదామమును దరవారి కెఱచేసి యుండెను. అచ్చటనే యామహానుభావుఁడు తనయమూల్యాలంకారములం దీసి ఛందకున కిచ్చివైచెను. యువరాజగు బుద్ధదేవుఁ డొకవ్యాధునిం బిలిచి తనయమూల్యప్రధానముల నాతని కిచ్చి యాతనిజీర్ణవస్త్రఖండమును దాను ధరియించిన దివ్యస్థలమాస్థలమే. అచ్చటనే సిద్ధార్థుఁడు ప్రప్రథమమున సన్యాసాశ్రమగ్రహణముఁ జేసియుండెను. భగవానుఁడగు సిద్ధార్థుని గృహధర్మత్యాగము, సన్యాసాశ్రమస్వీకారము మొదలగు సద్భావవిషయములం గూర్చి యుపగుప్తుఁ డశోకున కతిమనోహరముగ వర్ణించి చెప్పెను. ఆపుణ్యచరిత్రమంతయు నాలకించి, పుణ్యస్మృతిం గూర్పు నచ్చటిదృశ్యములం గాంచి యశోకసార్వభౌముఁడు ధర్మభావావిష్టహృదయుఁ డయ్యెను. వారాస్థలమునఁ గొన్నిదినము లుండి యనంతరము పరమపూజ్యుఁ డగు బుద్ధదేవుని చితాభస్మముపై నిర్మింపఁబడిన స్తూపమును దర్శించి ప్రదక్షిణప్రణామములం గావించి యచ్చటనుండి కాశీనగరమునకుఁ బ్రయాణమైరి. పిమ్మటఁ

ప్రియదర్శనుఁ డగునశోకుని యానతిచే నచ్చట నతిసుందరంబగు నొకసింహస్తంభము నిర్మింపఁబడియెను.

రామగ్రామమునందలిపుణ్యస్మృతిస్థానముల నన్నిటిని దర్శించినపిమ్మట వారు కాశీనగరమునఁ బ్రవేశించిరి. ఆనగరము ప్రకృతిరామణీయకదర్శనస్థానములలో సుప్రసిద్ధమైనది. ఆనగరోపకంఠమునందలిసాలవనంబున శాంతిస్థాపకుఁ డగు బుద్ధదేవుఁడు నిర్వాణలాభమును బొందియున్నాఁడు. భగవానుఁ డగుసిద్ధార్థుఁ డీస్థలముననే భిక్షుమండలి కంతకు నంత్యోపదేశమును బ్రసాదించియుండెను. ఉపగుప్తుఁ డశోకున కాచరిత్రమును స్మృతికిఁ దెచ్చి యానందింపఁ జేసెను. బుద్ధదేవుఁడు తన మృత్యుశయ్యయందు శయనించియుండి కొలిచియున్నభిక్షుమండలిం గాంచి "ఓసాధులారా! సంయోగవశముననే సకలపదార్థములు నుత్పన్నము లగుచున్నవి; సంయోగవశమున నుదయించుపదార్థము లన్నియు నాశనశీలము లైనవే. ఈసత్యమును మీ రెల్లప్పుడును స్మరించుకొనుచు సర్వదా సావధానులై విధాయకకృత్యముల నేమరక నెఱవేర్చుకొనుచుండుఁడు. ఇదియే నాకడపటియుపదేశము." అని బోధించెను. ఈసంగతి యశోకునకుఁ జెప్పుచు నావిశాలోన్నతసాలవనంబున బుద్ధదేవునిమహానిర్వాణలాభపుణ్యస్థలంబున నిలువఁబడి యాసిద్ధార్థుని పవిత్రజీవితచరిత్రమును గల్పనానయనములతో దర్శించుచు, వానిని మిగుల వర్ణించుచు మహాభక్తుఁడగునుపగుప్తుఁడు భగవానుని యమృతమయపరిశాంతోక్తుల నుచ్చారణ చేయ

నారంభించెను. అప్పు డచ్చటనున్న వారందఱవదనములను నొకపూర్వభావావేశ మయ్యెను. మహారా జగునశోకునికుశీనగరతీర్థయాత్ర యీవిధముగ సఫలమయ్యెను. ఆతనిమనఃప్రాణములు పుణ్యస్రోతమునఁ బవిత్రస్నానముం గావించెను.

ప్రియదర్శనుఁడగునశోకుఁడు తనతీర్థదర్శనము చిరస్మరణీయమగునట్లు చేయునుద్దేశముతో నచ్చట నొకవిశాలస్తూపమును నిర్మింపఁజేసి దానిసమీపమునం దొకశిలాస్తంభముపై బుద్ధదేవుని పవిత్రనిర్వాణవృత్తాంతము నక్షరరూపమున వెల్లడియింపఁ జేసెను.

అచ్చటనుండి "భక్తబృందలుంబినీవిహారోద్యానము"ను జూచుటకు బయలుదేరెను. ఆపవిత్రస్థానమున సిద్ధార్థుఁడు జనియించెను. ప్రపంచమునంగలపుణ్యక్షేత్రము లన్నిటిలోనను లుంబినీక్షేత్రము ముఖ్యమైనది. ఉపగుప్తుఁడు లలితవచనములతో భక్తిగద్గదస్వరముతో బుద్ధదేవుని జన్మచరిత్రమును సవిస్తరముగ వర్ణించి చెప్పెను. స్థానమాహాత్మ్యము, ప్రసంగపవిత్రత, శ్రోతలయాదరభావము, వక్తయోగ్యత, భాషాలాలిత్యము సర్వము నేకీభవించుటచే నాదివ్యక్షేత్ర మపూర్వశోభావిలసితమై కానవచ్చెను. నయనశ్రవణహృదయంబులకు సమ్మేళనానుభవం బయ్యెను. తీర్థయాత్రికులందఱును దాము ధన్యుల మైతి మని భావించుకొనిరి.

అశోకమహారా జాదివ్యస్థలమును జిరస్మరణీయముగఁ జేయవలయు ననునుద్దేశముతో నచ్చటనత్యున్నతం బగుశిలా

స్తంభమును నిర్మింపఁజేసెను; ఆశిలాస్తంభమునం దీక్రిందివాక్యములను జిత్రింపఁజేసెను.

“దేవతాగణప్రియదర్శనుఁ డగునశోకమహారాజు తీర్థయాత్రలు చేయుచు నిచ్చటికి వచ్చి యీశిలాస్తంభమును నిర్మింపఁజేసెను. ఈదివ్యక్షేత్రము భగవానుఁ డగుబుద్ధదేవుని జన్మస్థానము.”

ఈపుణ్యస్థలమాహాత్మ్యమును స్మరించుకొనుచు నాక్షేత్రగౌరవమును వృద్ధిచేయునుద్దేశముతో బోధిసత్వునిపావననామముపై నాలుంబినీక్షేత్రమును నిష్కరముగఁ జేసివైచెను. పిమ్మట నందఱును గలసి కపిలవస్తునగరమువైపునకుఁ బ్రయాణము చేసిరి. శాక్యరాజల రాజధానీగౌరవచరిత్రమున నాలోకప్రసిద్ధంబగు నగరసుఖసమృద్ధుల విశేషముంగూర్చి వారు వినియుండిరి. కాని యింతవఱకు నాసౌభాగ్యమును వారు దర్శింపలేదు. సిద్ధార్థుని సన్యాసగ్రహణానంతరమున రాజనగరసౌభాగ్యము మ్లానమై యుండెను. తరువాత రెండువందలసంవత్సరములలోఁ గాలతరంగాఘాతములచే నానగరసౌందర్యము వినష్టమైపోయినది. పవిత్రస్థలమునను బూర్వస్మృతినిగలిగించునిటుకలును, శిలాఖండములును మాత్రము నిలిచియున్నవి. ఒక్కొక్కచోటఁ బ్రశస్తశిలాఖండములపైఁ జిత్రింపఁబడిన సిద్ధార్థుని తల్లిదండ్రులప్రతిమూర్తులు కానవచ్చుచుండెను. అక్కడక్కడ సిద్ధార్థుని జననచరిత్రమును, నాతనిగృహత్యాగవృత్తాంత

మును బ్రదర్శించు దృశ్యము లతిమనోహరముగఁ గానవచ్చుచుండెను. ఆనగరమునందలి విశాలసౌధములును, ప్రాకారములును నిప్పు డేమైపోయినవి? ఇప్పు డచ్చట నెల్లచోటులను విహారములును మఠములును చైత్యములునుమాత్రము విరాజమానము లగుచుండెను. బౌద్ధభిక్షులు రాజయాత్రికులకు భగ్నస్తూపముల నొక్కొక్కటిగఁ జూపుచు వానిపూర్వచరిత్రమును వర్ణించి చెప్పుచుండిరి. ఈవిధముగా మహారాజును, ధర్మాచార్యుఁడగునుపగుప్తుఁడును దక్కిన యాత్రికులును గూడ నచ్చట దర్శింపవలసిన దృశ్యముల నన్నిటిని దర్శించిరి. అనంతరము మహారా జానగరమును విడుచుటకు మునుపే మహాత్ముఁడగుబుద్ధుని బాల్యకౌమారయౌవనవివిధఘటనాపరంపరల నన్నిటిని జిరస్మరణీయములుగఁ జేయునుద్దేశముతో స్తూపస్తంభకూపపరిఘాదులను నిర్మించుట కాజ్ఞాపించెను. శాక్యరాజపుత్రుఁడగు సిద్ధార్థుని సన్యాసగ్రహణమువలన విలాసమందిరప్రమోదోద్యానములయవస్థఁ జూచి రాజర్షియగు నశోకుని హృదయమును, వాసనారహితుఁడగు నుపగుప్తుని హృదయమును మఱింత నిస్పృహత్వముం గాంచెను. అప్పుడు వారి హృదయములయందు, సంసారానిత్యత్వమును, దృశ్యజగత్పదార్థముల యశాశ్వతత్వమును, నిశ్చయముగ విస్పష్టముగఁ గానవచ్చెను.

కపిలవస్తునగరమును దర్శించుటచే వారికి ధనజనసుఖైశ్వర్యముల యస్థిరత్వముంగూర్చి బాగుగ బోధపడియెను. ఆ

యనుభవముతోడనే వారు భగవానుఁడగుసిద్ధార్థునివైరాగ్యముం గూర్చి స్మరియింపఁదొడంగిరి. రూపము, యౌవనము, స్వాస్థ్యము, సుఖము, మహాభాగ్యము మొదలగు సర్వభోగోపకరణములు కరగతములై యుండినను మహాత్ముఁడగుబుద్ధదేవుఁడు వానినన్నిటినిగూడ నశాశ్వతపదార్థములని గ్రహించి స్వేచ్ఛగఁ ద్యజించివైచి జగత్కల్యాణముకొఱ కాత్మసమర్పణముం గావించియుండెను. ఆబుద్ధదేవునిమహానుభావ మెంతటియలోకసామాన్య మైనదియో యాసంగతి ధర్మప్రాణులగునశోకోపగుప్తులు కపిలవస్తునగరమును దర్శించి సంపూర్ణముగ గ్రహియింపఁగలిగిరి.

పిమ్మట వా రాకపిలవస్తునగరమునువిడిచి క్రమముగాఁ గోణకమున్యాశ్రమం బగులలితనగరమును దర్శించిరి. అనంతరము వా రచ్చటినుండిపోయి యథాకాలమున శ్రావస్తినగరమునఁ బ్రవేశించిరి. బౌద్ధభారతమున శ్రావస్తినగరము వాణిజ్యము, ధనము, భాగ్యము, సుఖసమృద్ధి మొదలగువానియందుఁ బాటలీపుత్రమునకుఁ దీసిపోవునది కాదు. వాణిజ్యోపయోగమునకై బౌద్ధభారతప్రధాననగరములకు శ్రావస్తినగరమునుండి సుగమంబు లగురాజమార్గములు విశేషించి యుండెను. అంతియకాదు. శ్రావస్తి బౌద్ధగణమున కొకప్రధానక్షేత్రముగా నుండెను. భగవానుఁడగుబుద్ధుఁడు తనజీవితమునందలి చాలకాల మీక్షేత్రమునందే గడపియున్నాఁడు. బుద్ధదేవుఁడును, బౌద్ధభిక్షులును నివసించుటకును, ధర్మప్రచారోప

యోగముకొఱకును, దానవీరుఁడును, భక్తశ్రేష్ఠుఁడు నగుసుదత్తుఁడనువర్తకుఁడొకఁడు తన జేతవనమును బోధిసత్త్వునకు సమర్పించియుండెను. ఆ జేతవన మతిరమణీయమైనది. సుదత్తుఁడీపరమరమణీయోద్యానమును జేతుఁడనుయువరాజునొద్దఁ బదునెనిమిదికోట్లసువర్ణములకుఁ గొనియుండెను

కాని యాయువరాజు సుదత్తునిధనమును స్వయముగ స్వీకరించి యుండలేదు. ఆతఁ డాధనముతో జేతవనమునందు బుద్ధదేవునకును, నాతనిశిష్యులకును సుఖోపయోగముకొఱకును; ధర్మప్రచారమునకు సాహాయ్యముకొఱకును వలయునేర్పాటులను గావించెను. ఆ జేతవనమునందు భక్తుఁడగుసుదత్తుఁడును, మహాసుభద్ర, కుంతలసుభద్ర, యనునాతనితనయలును భగవానుఁడగుబుద్ధదేవుని సశిష్యముగ సేవించి ధన్యులైరి. బౌద్ధేతిహాసమున శ్రావస్తినగరముస్మృతివైభవముచే నేమి, వైరాగ్యముచే నేమి, భోగముచే నేమి, త్యాగముచే నేమి యనేకవిధములఁ బ్రకాశితమగుచుండెను. ధర్మాచార్యుఁడును బురాణజ్ఞుఁడు నగు నుపగుప్తుఁ డాసమస్తవృత్తాంతమును మహారాజునకు నాతనియనుచరులకు నామూలాగ్రముగ వినిపించెను. బుద్ధదేవుని యపూర్వమహిమాన్వితచరిత్రమును, శ్రేష్ఠియగుసుదత్తుఁడు, యువరాజగుజేతుఁడునుగావించిన మహత్తరత్యాగచరిత్రమును విని యందఱును శ్రద్ధావనతులైరి. సార్వభౌముఁడగునశోకుఁ డాస్థలమునఁగూడ యథాపూర్వముగ ననేక

స్తూపములును, స్తంభములును నిర్మింపఁజేసి యటనుండి గయాక్షేత్రమునకుఁ బ్రయాణమయ్యెను.

మహారాజు గయయందలి నిరంజనతీరమునందున్న యురుబిల్వగ్రామమును బోధిద్రుమమునుగూడ దర్శించెను. ఉపగుప్తుఁడు సిద్ధార్థునియసాధారణాభ్యాసముంగూర్చియు, నాతనిబుద్ధత్వలాభముంగూర్చియు లలితవచనములతో మహారాజునకుబోధించెను. ఆపుణ్యస్థానదర్శనమును, నచ్చటివారిపుణ్యచరిత్రశ్రవణమును గావించి మగధేశ్వరుఁడగు నశోకుఁడు వారణాసీనగరమునుగూర్చి ప్రయాణము చేసెను. మహాత్ముఁడగుబుద్ధదేవుఁడొకప్పుడుపకాముఁడనుతత్త్వజ్ఞునితో నీకాశీపురమునుఁ గూర్చియిట్లు చెప్పెను. "నేను కాశికిఁ బోఁగలను. కాశికిఁ బోయి యచ్చట నప్రతిహతంబగుధర్మసంస్థాపనమును జేయఁగలను" అని—

ఆదిన మొకటి; ఈదినము మఱియొకటి. ఆదినమున బుద్ధదేవుఁడు చెప్పిన "పోఁగలను" అను భవిష్యత్కాలమిఁక లేదు. ఇప్పుడాతని కాశీకానగరాగమనము ధర్మచక్రపరివర్తనమున నిదివఱకే పరిణతమైపోయినది. ఇఁక నచ్చట నాపుణ్యస్మృతిమాత్రమే జాగరిత మగుచున్నది. భగవానుఁడగు సిద్ధార్థునిపవిత్రపదరజోలేశముచేఁ బావనమైన యాకాశీకాక్షేత్రమును దర్శించునభిలాషతో నచ్చటివారిపుణ్యచరిత్రములను వినవలయుననుకోరికతో భక్తులు విచ్చేసియుండిరి. రాజర్షి యగునశోకుఁడు

ను ధర్మాచార్యుఁడగునుపగుప్తుఁడును, రాజానుచరులును గాశీకానగరమును దర్శించిరి. సమీపమునందున్న సారానాథమును దర్శించి కృతార్థులైతి మనుకొనిరి.

అశోకసార్వభౌముని దూరతీర్థయాత్ర సంపూర్ణమయ్యెను. అంతట వారు కాశీకానగర వాహినియగు గంగానదియందలి నావనారోహించి యథాసమయమునకుఁ బాటలీపుత్రమునకు వచ్చిచేరిరి. వారితీర్థప్రవాసము సంపూర్ణమయ్యెను.

ఇరువదినాలుగవ ప్రకరణము.

పుణ్యప్రభావము.

తీర్థయాత్రకుఁ బోయి వచ్చినతరువాత నశోకునిచరిత్రమునందును, నాతనియాచారవ్యవహారాదికార్యములయందును విశిష్టపరిణామ మగపడుచుండెను. తీర్థయాత్రాసమయమునం గలిగినపుణ్యప్రసంగశ్రవణమాహాత్మ్యమును, పవిత్రవిషయాలోచనముచే లభియించినపుణ్యప్రభావమునుగూడ నాతనిప్రతికార్యమునందును బింబిత మగుచుండెను. నానాదేశములను దర్శించి నానాశ్రేణులయందలి నానాజాతిజనులతోఁ గలిసికొనుటవలనం గలిగినప్రత్యక్షప్రథమఫల మేమనిన—అందువలన నాతనిహృదయమందున్న సంకీర్ణతయు దూరమైపోయెను. త్యాగశీలుఁడగునశోకునిహృదయము మఱింతయుదార మయ్యెను.

ఇట్టిసత్సంగమువలనను, బహుతీర్థక్షేత్రసందర్శనమువలనను, సాధుసజ్జనసంబంధమువలనను, నశోకునకు భూమండలమువఱకుఁగూడ కుటుంబమును వృద్ధి యయ్యెను. సాధుసజ్జనమండల మంతయు నాతనికుటుంబమయ్యెను. అశోకునకుఁ దీర్థయాత్రవలన నీసకలసత్ఫలములును సంపూర్ణముగ లభియించెను.

తీర్థయాత్రావసరమున నాతఁడు తనరాజ్యమునందలి విశేషభాగములను దర్శించెను. ఎచ్చటఁ జెరువులను ద్రవ్వింపవలయునో, యెచ్చట వంతెనలను గట్టింపవలయునో, యెచ్చట సుగమంబులగు రాజమార్గముల నేర్పఱుపవలయునో యాతఁడు స్వయముగఁ జూచియుండెను. ప్రజాసామాన్యమంతయు నెట్లుకాలక్షేపము చేయుచుండెనో ప్రజలకృషివాణిజ్యాదుల యవస్థ యెట్లుండెనో వారినిత్యనైమిత్తికక్రియాకలాపము లేవిధముగా నుండెనో యంతయు నాతఁడు స్వయముగఁ జూచి గ్రహింపఁగలిగెను. రాజధానికి దూరమునం దున్న జనపదములయందలిబలవంతులయత్యాచారములు, దుర్బలులదురవస్థలును నివారించువిషయమున రాజోద్యోగు లందఱు నెట్లు మనఃపూర్వకముగఁ బనిచేయుచుండిరో యాసంగతికూడ నాతనికి స్పష్టముగ బోధపడియెను.

ప్రజావత్సలుఁడును, ధర్మప్రాణుఁడును, సహృదయుఁడు నగు నశోకమహారాజు స్వయముగ దేశమునందలిస్థితిగతుల నన్నిటిని దెలిసికొని ప్రజాసుఖవర్ధనముకొఱకును, దుఃఖనివారణముకొఱకును గావలసిన సదుపాయముల నన్నిటిని గావించెను. సామాన్యజనులందఱును ధర్మకర్మములు, సత్కార్యములు మొదలగువానివలనఁ బవిత్రముగ జీవయాత్ర నడపుకొనునట్లు వారి వారి కనుకూలముగనుండునట్టి యుక్తాయుక్తకార్యములనుగూడ నశోకమహారాజు స్వయముగఁ దెలిసికొని సంపూర్ణముగఁ గావించివైచెను. ఈసకలసత్కార్యములవలననే లోకమునం దాతనికి ధర్మాశోకుఁడని విశేషవిఖ్యాతి లభియించెను. ధర్మాశోకుని చరిత్రాంతరాళమున శ్రీబుద్ధదేవుని శాంతిమతధర్మపవిత్రాత్మోపదేశములును, సార్వభౌముఁడగు నాతని సకలపుణ్యక్షేత్రసందర్శనమును, మహాత్ముఁడగు నుపగుప్తు సత్సంగమువలనంగలిగిన పుణ్యప్రభావమును సుప్రసిద్ధములై విస్పష్టముగ విరాజిల్లుచుండెను.

ఇరువదియైదవప్రకరణము.

అశోకసామ్రాజ్యము.

సౌభాగ్యమయం బగుభూఖండమున మహాభాగుఁడగు నశోకసార్వభౌముని పుణ్యప్రభావ మెంతటియౌన్నత్యము నువహించియుండెనో యెంతదూరమువఱకు వ్యాపించియుండెనో యాసంగతి యావశ్యకముగఁ దెలిసికొనవలసియున్నది. మౌర్యప్రభుఁడగు చంద్రగుప్తుఁడు భారతసామ్రాజ్యమునకుఁ జక్రి

త్రియై యుండెను. ఆతనిపుత్రుండు బిందుసారుండు. తండ్రియనంతరమున బిందుసారుం డీవిశాలరాజ్యమునకుం బ్రభుం డయ్యెను. బిందుసారునియనంతరమున నాతనికుమారుండగునీయశోకసార్వభౌముం డఖిలరాజ్యభారము వహించియుండెను. ఆతండు పితృపైతామహంబగు రాజ్యమంతయును గరగతముచేసికొనియుండెను. అంతియే కాకయితనికుం దనపూర్వులకులభియింపని కళింగరాజ్యమునుగూడ నశోకుండు స్వీయబాహుబలముచే సంపాదించి యుండెను. ఏకారణముచేతనో యాకళింగరాజ్యము నశోకుండు తనపరిపాలనమునందుంచుకొనక పూర్వప్రభునకే దానినొసంగి యాతని దనసామంతప్రభునిగాం జేసికొనియెను. అప్పటినుండియుం గళింగము సార్వభౌముండగునశోకునకు సామంతరాజ్యములలో నొక్కటి యయ్యెను. కళింగమును జయించినతరువాత నాతండు తన పూర్వరాజ్యము నింకనువృద్ధిచేయవలయు నను రాజ్యకాంక్షను వదలి యుద్ధవిగ్రహములను విరమించివైచెను. ఒక్కద్రవిడదేశమునందలి కొంతభాగముగాక భారతవర్షమంతయు నశోకునకు సామ్రాజ్యమై యుండెను. ఇప్పటిదొరతనమువారిభారతసామ్రాజ్యముకంటె నశోకునిరాజ్యమే చాలం బెద్దదిగానుండెను. ఉత్తరమున గాంధారము మొదలు కాబూల్‌స్థానమునుండిదక్షిణమున కన్యాకుమారిపర్యంతమును, బశ్చిమమున సౌరాష్ట్రము మొదలు తూర్పునం దామ్రలిప్తవఱకును నశోకసామ్రాజ్యము వ్యాపించియుండెను. ఇదియంతయు నాతనియధికారమునకు లోంబడియున్న దేశమై యుండెను. కాని యీదేశ

ముకం గావలనున్న దేశములయందుంగూడ నాతనిపుణ్యప్రభావము వ్యాపించి యుండెను. ఉత్తరమున నేపాళము, టిబెట్టు; దక్షిణమున సింహళము. తూర్పున బ్రహ్మదేశము (బర్మా)వఱకుంగూడ నాతనిపుణ్యప్రభావము సుప్రసిద్ధమై యుండెను. ప్రాగ్జ్యోతిషమండలమున (ఆసామ్ ప్రదేశము) బుద్ధమతప్రచార మేమియు నున్నట్లగపడదు. ఒక్కమాటలోం జెప్పవలసివచ్చినచో ఆసాము, బర్మా కాకతక్కినసాగరమేఖలాహిమాద్రిశోభితసమస్తసమగ్రభారతవర్షమును నశోకుని సామ్రాజ్యమే యైయుండెనని పరిగణింపవచ్చును. ఈవిశాలభూమండలమునం బల్లెలు మొదలు పట్టణములవఱకును, స్థలపథములయందును, జలపథములయందును సర్వప్రదేశములయందును జనోపయోగకరంబులగు కార్యముల నెన్నటినో సార్వభౌముండగు నశోకుండు గావించి యుండెను.

ఇరువదియాఱవప్రకరణము.

దేశస్థితి.

అశోకునిప్రభుత్వమునందు మొదటం గొంతకాలము వఱకు దేశమునం దశాంతి కలిగెను. కళింగయుద్ధముకూడ నట్టి యశాంతికారణములలో ముఖ్యమైనదిగానుండెను. కళింగవిజయానంతరమున నాతనిప్రభుత్వములో ముఖ్యముగ నుల్లేఖింపవలసిన యశాంతికారణము లేవియును లేవు.

రాజ్యాధికారముకొఱకు యుద్ధముచేయుట యావశ్యకము. కాని ప్రజాహృదయరాజ్యాధికారముకొఱకుమాత్రము శాంతిస్థాపనము ముఖ్యావశ్యక మైనది. ప్రజావత్సలుఁ డగు ధర్మాశోకుఁ డీసత్యమును గ్రహియించియుండెను. అందుచేతనే యాతఁడు మిగులఁబరిశ్రమచేసి తనవిశాలసామ్రాజ్యమున శాంతిస్థాపనమును గావించెను. దేశమునం దంతటను శాంతి నెలకొనియుండుటచేఁ గృషివాణిజ్యాదులును శిల్పాదికళలును గూడ నిరాఘాటముగ నున్నతిం బొందుట కవకాశము కలిగెను. అందువలనఁ బ్రజలకుఁగూడ నౌన్నత్యములభియించెను. అశోకునిరాజ్యకాలమున దేశమునందలి కృషి, వాణిజ్యము, శిల్పము శిక్ష మొదలగువానియవస్థ యెట్లుండెనో ప్రత్యేకముగ సంక్షేపముగఁ జెప్పుచున్నాము.

కృషి:—చిరకాలమునుండి భారతవర్షము కృషిప్రధానమైనదేశము. ఆవిరియంత్రములు, విద్యుద్యంత్రములు, దారుయంత్రములు నయోమార్గములు మొదలగునవి ప్రబలియున్నయిక్కాలమునందుఁగూడ నీదేశమునందు నూటికిడెబ్బదిమంది కృషిజీవను లున్నారు. ఇప్పటికేఁ జాలకాలమునకుఁ బూర్వమునందీదేశమునఁ జాలమంది కృషిమీఁదనే యాధారపడి యుండిరని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. ప్రభువుల యాదాయమునందలి హానివృద్ధులు చాలవఱకీవ్యవసాయమునుబట్టియే యుండును. కావునఁ గేవలమును రాజు కృషికోపయోగకార్యములను జేయుటయందే జాగరూకుఁడై యుండ

వలయును. అశోకుఁడు తనరాజ్యమున వ్యవసాయమున కనుకూలముకొఱకును, సస్యక్షేత్రములఁ దడుపుటకును వలసినన్ని కాలువలను ద్రవ్వించెను. అనేకస్థలములయందలికొండవాగులను గట్టించి నీరునిలవచేయించి యనుకూలోపయోగములను గావించెను. అదనుతప్పకుండఁ బొలములఁ దడుపుకొనుటకుఁ గూడఁ దగినసదుపాయముల నేర్పఱచెను. ఈపనులన్నియు యథాక్రమముగ జరపుటకుఁ దగినయుద్యోగులు నియమింపఁబడి యుండిరి. వారిమూలమునఁ గృషికులయొద్దనుండి యథోచితముగ నీటిపన్ను గ్రహింపఁబడుచుండెను. అప్పుడీనీటిపన్నున కుదకభాగమని పేరు. ఇప్పటికంటె నాకాలమునందే సస్యక్షేత్రములు మిగులవిరివిగ నుండెను. కొలఁదిప్రయత్నములతోఁ గొలఁదిభూమిని గృషిచేయుటచేతనే కృషికులగృహములు సంపన్నము లగుచుండెను. కృషిచేసినభూమి విరివిగనున్నను బంట సరిగాలేనప్పుడు పండినపంటలో నాఱవపాలు మాత్రమే రాజునకుఁ బన్నుగఁ జెల్లింపవలసియుండుటవలనఁ గృషికులకును వారిపరివారమునకును గావలసినంతయాదాయము లభియించుచునే యుండెను. అందువలన నతివృష్టి, యనావృష్టి మొదలగు నీతిబాధలు తటస్థించినప్పుడుగూడఁ బ్రజలకుఁదిండిలేక దేశములఁబట్టిపోవలసినయవసరము లేకుండెను; అట్టివారిసంరక్షణముకొఱకు రాజు తనకోశమునుండి ధనమును వెచ్చింపవలసిన యావశ్యకమును లేకుండనుండెను. విశేషముగ ధనమున్నంత మాత్రమునఁ బ్రజలుసుఖులై యుందురనుట కవకాశము లేదు.

ఒక్కొక్కప్పుడు ధనమిచ్చినను నాహారపదార్థములు లభింపక పోవచ్చును. కావునఁ బ్రతిగృహమునను సంవత్సరమునకుఁ జాలినన్ని యాహారపదార్థములు నిలువయుండునట్లు యేర్పాటు చేయవలసియుండును. ధర్మప్రాణుఁడును, దయామూర్తియునగు నశోకసార్వభౌముని రాజ్యపాలనమునం దట్టి సర్వోపయోగకరం బగు నేర్పాటు చేయఁబడియుండెను. మనుష్యజీవనమునకు ముఖ్యముగఁ గావలసినవి మూఁడు; అన్నము, వస్త్రము, జలము. ఇవియథోచితముగఁ బ్రజాసామాన్యమునకెంతకును లభియించునట్లు చేయుట రాజునకుఁ బ్రధానకర్తవ్యము. ధర్మాశోకునిరాజ్యకాలమునం దీపద్ధతిని యథావిధిగఁ బరిపాలించిన ట్లాతనిపవిత్రచరిత్రమునందు విస్పష్టముగఁ దెలియవచ్చుచున్నది.

వాణిజ్యము:—అప్పటిప్రజలసుఖము, సౌకర్యము, అభిరుచి మొదలగువాని ననుసరించి యావశ్యకములగు మార్గములు ఘట్టములు, యానవాహనాదికములును సురక్షితముగ నెలకొల్పఁబడియుండెను. ఆకాలమున స్థలమార్గములును, జలమార్గములునుగూడ జనుల రాకపోకలకుఁ జాలననుకూలముగ నుండెను. కాని యాకాలమున సస్యములు, దారుపదార్థములు మొదలగు భారపదార్థము లొకదేశమునుండి మఱియొకదేశమునకుఁ దీసికొనిపోవుటవలన లాభము లేకయుండెను. ఇక్కాలమున బారిసాలు బియ్యము, సుందరవనదారువులు, రాణిగంజినేలబొగ్గు, బర్మాకిరోసెనునూనె మొదలగునవి దేశదేశాంతరములకుఁ బంపుటవలన లాభము లభియించుచున్నది. ఆకాలమున నట్టిపద్ధతి లేదు. అప్పటివర్తకులు స్వదేశవర్తకమునం దేమి, విదేశవర్తకమునందేమి యిట్టివస్తువుల నుపయోగించెడువారు గారు. అప్పటివారు పట్టుబట్టలు, మజిలినులు, అస్త్రశస్త్రములు, సూచీశిల్పచిత్రితములగుజిలుగువలువలు, సుగంధద్రవ్యములు, కస్తూరి, శిలాజిత్తు గజదంతములు, గజదంతనిర్మితములగువిచిత్రవస్తువులు, రత్నాభరణములు, వెండి, బంగారము మొదలగువస్తువులతో దేశవిదేశవర్తకమును జేయుచుండెడివారు. వర్తకు లిట్టిలఘుభారవస్తువులను దీసికొని దేశాంతరములకుఁ బోయి వర్తకము చేయుటవలన వారికి మిగులసదుపాయముగ నుండెను. ప్రయాణమునఁ గష్టముండెడిది కాదు. ఆవర్తకులు తరచుగ గుంపులుగుంపులుగఁ బ్రయాణము చేయుచుండిరి. వారు సుప్రశస్త రాజమార్గమును వదలి పల్లెలకుఁ బోవలసి యున్నప్పుడు గ్రామస్థులు వారిని దమయూరికిఁ దీసికొనిపోయి నిరపాయస్థలమున నివసింపఁ జేయుచుండిరి. నిర్జనపథంబుల దూరముగఁ బోవలసినప్పుడును, రాత్రికాలములఁ బ్రయాణము చేయవలసినప్పుడును రాజభటులు వారికి రక్షకులై యొకచోటినుండి మఱియొకచోటికిఁ బంపుచుండిరి. ఇట్టి సదుపాయములకొఱకు వర్తకులకు శుల్కము విధింపఁబడియుండెను. ఈవిధముగా వర్తకులకు నిర్జనపథములయందును, నెడారులయందును, దుర్గమస్థానములయందును, రాత్రికాలములయందును, చోరాది బాధలనుండి రక్షించుటకొఱకుఁ దగినంతమంది రక్షకభటులు నియమింపఁబడి యుండిరి. అశోకరాజ్య

మునం దంతటను వర్తకుల కిట్టియనేకవిధములగు సౌకర్యములుండెను. విదేశవర్తకముకొఱకు జలమార్గములయందుఁగూడ నట్టిసౌకర్యములుండెను. వర్తకులవర్తకవస్తువుల వెలల ననుసరించి సుంకములు నిర్ణయింపఁబడుచుండెను. ఈకార్యములన్నియు విశ్వాసముగలసమర్థుఁడగునుద్యోగివలన నెఱవేర్పఁబడుచుండెను. వర్తమానకాలమున రేవులయందును నితరస్థలములయందును వర్తకపుసరకులపై విధింపఁబడుచుండుసుంకము పూర్వకాలమునకంటె నధికముగానున్నది. రాజ్యాభ్యుదయమున కిది యొకప్రధానోపాయముగా నుండెను. కాని యాకాలమున వ్యవసాయమును, వాణిజ్యమును నింతవిస్తారముగ లేకపోయినను మహారాజగునశోకుఁడు వ్యవసాయవర్తకముల కొఱకుఁ జేసినసదుపాయములంగూర్చి యింతకాలమునకుఁ దరువాత వినినప్పుడు ప్రేమమూర్తి యగునశోకుని యుదారహృదయముంగూర్చి యెల్లరు నేకగ్రీవముగఁ బ్రశంసింపవలసియున్నది.

శిల్పము—అశోకునిరాజ్యకాలమున భారతవర్షమునం దంతటను శిల్పవిషయమున విశేషాదరము కలదు. మౌర్యకులతిలకుండగునశోకునిరాజధానిని, రాజప్రాసాదభగ్నావశేషములను జూచి చీనాదేశపరివ్రాజకుఁడగుఫాహియాను తనమనంబున నీనగరమును, నీరాజప్రాసాదమును మానవనిర్మితములే యగునా యని యాశ్చర్యపడియెను. కోటగోడలమీఁది చంద్రశిలాఫలకములపై నాకాలపుజనుల దైనికజీవనోత్సవములను, యా

త్రాస్థలవిశేషములనుగూర్చినచిత్రములను జూచి ఫాహియాను ముగ్ధుఁడైపోయెను. రాజసభామంటపమునందలిదారుస్తంభములపై స్వర్ణరౌప్యరసరంజితంబులగుదృశ్యములంగాంచి యాతఁడెంతమాత్రమును వర్ణింపఁజాలకపోయెను. శిల్పమునకుఁ జీనాదేశము సుప్రసిద్ధమైనది. అట్టిచీనాదేశమునందలిసుప్రసిద్ధశిల్పరచనానిపుణుఁడగు ఫాహియానువంటివాఁడశోకునికాలమునందలి శిల్పములంగాంచి యింతవింతపడుటం జూడఁగా నప్పటిమనవారి శిల్పరచనాప్రావీణ్య మెంతయధికముగా నుండెడిదో బోధపడఁగలదు. అశోకుఁడు తనరాజ్యకాలమునఁ దనరాజధానియం దనేకస్థలములయందు స్తూపములను స్తంభములను విశేషముగ స్థాపించి యుండెను. వానిసంఖ్య యెనుబదినాలుగువేలు; కాలసముద్రతరంగములలో నవియన్నియు నిప్పు డెట్లుభగ్నములై పోయినవి! కాని యిప్పటికిని భారతవర్షమున వివిధస్థలములయందాస్తూపస్తంభభగ్నావశేషములు జలమగ్నంబు లగునౌకావశేషములవలె నగపడుచునే యున్నవి. భూపాలమునొద్దనున్న సాంచిస్తూపమును, గాశియొద్ద నున్నసారానాథస్తూపమును వీనిలో ముఖ్యములైనవి. అశోకునికాలమున శాశ్వతశిల్పరచనలు విశేషముగ నుండెడివి. పర్వతములపైఁ జెక్కఁబడినవియు, వివిధస్థలములయందగపడుశిలాఖండములపైఁ జెక్కఁబడినవియు నగుశిల్పమూర్తులం జూచినచో నాకాలమున విశేషముగనున్న వివిధశిల్పరచనావిశేషములు బోధపడఁగలవు. అప్పటియువతీమణు లెట్టియలంకారములను ధరియించు

చుండిరో వానినిబట్టి స్పష్టముగఁ దెలిసికొనవచ్చును; కంకణములు,కంఠహారములు, కర్ణపుష్పములు మొదలగునలంకారములప్పుడు విశేషముగ వాడుకలోనుండెను. చరిత్రమునందశోకయుగముం గూర్చినవర్ణనమును బఠించినప్పుడును, నప్పటి చిత్రశిల్పములంబరీక్షించినప్పుడును నప్పటివారు విశేషవేషభూషణాలంకృతులైయున్నట్లు స్పష్టపడఁగలదు. భాగవతవర్ణితంబగు శ్రీకృష్ణునిమోహనపింఛమును,బీతాంబరధారణమును నప్పటిపురుషులసమాదరాలంకారములై యుండెను. ధనికులు, వర్తకులు మొదలగువారియుష్ణీషములయందు శ్రీకృష్ణునిచూడాలంకారమువలె నొకయమూల్యాలంకారము ఫణిఫణారూపమున విరాజిల్లుచుండెడిది. ధరించినపరిధానము నందనందనునిపీతాంబరమువలె నలరారుచుండెడిది. ఆపీతాంబరమునకుఁ గ్రిందియంచులు మెఱయుచుండెడివి. అట్టివస్త్రములపై నమూల్యకాంచీదామము లలంకారములుగ నుండెడివి. ఇరువదిమూఁడుసంవత్సరములకుఁ బూర్వమువఱకు బంగాళాబాలికల కటి మండలములపై నిట్టిచంద్రహారములును సూర్యహారములును ధరియింపఁబడుచుండెను. అప్పటిపురుషులలో నిట్టియలంకారరచనలుండెను. ఏఁబదిసంవత్సరములకుఁ బూర్వము బంగాళాదేశమునందలినిమ్నజాతిపురుషులలోఁ దలపైఁ బక్షిఱెక్కలను గత్తిరించి జూలుగాఁ జేసిధరియించునలవాటుండెడిది. పురాతనకాలపువస్తువులకును, వర్తమానకాలపువస్తువులకును నేవిషయమునందైన నించుకసాదృశ్యమగపడుచున్నప్పుడు దానింగూర్చి యించుక

యాలోచించి విభేదకారణమును దెలిసికొని నిర్ణయింపవలసియుండును. కావున నింతవఱకు వ్రాయవలసివచ్చినది. ఎట్లో యొకవిధముగ నిప్పు డశోకునికాలమునాఁటి ప్రజలవేషభూషణాదులంగూర్చి యించుకపరిచయముం గలిగింపఁజాలితిమి. ఈ స్వల్పపరిచయముంబట్టి యాలోచింపఁగా నప్పటివారియభిరుచులును, సౌందర్యాదులును బాగుగ బోధపడఁగలవు. అశోకయుగమునఁ గట్టడపుఁబనులు, చెక్కడపుఁబనులు, రత్నపుఁబనులు, చిత్రపుఁబనులు మొదలగుశిల్పములేకాక యింకను వివిధశిల్పములు విశేషించి యున్నట్లగపడుచున్నది. వీనిలోనేత, వడ్రము, కమ్మరము కుండలుచేయుట మొదలగుపనులు ప్రధానములై యుండెను. ఈపనివాండ్రు ధర్మాశోకరాజ్యమున వృత్తుల ననుభవించుచు సుఖజీవనము చేయుచుండిరి. ఒక్కమాటలోఁ జెప్పవలెనన్నచో నిట్టివారిచేఁ జేయఁబడుశిల్పము లన్నియు నభివృద్ధిలో నున్నవనియు, జనసమాదరముం గాంచియున్నవనియుఁ జెప్పవలయును.

శిక్ష—బ్రాహ్మణప్రధానమగు భారతవర్షమున "విద్యాశిక్షణము" అనుమాట యగ్రవర్ణోచితవిద్యాశిక్ష యని యెల్లరకును మనస్సునకుఁ దట్టును; గురువు, శిష్యుఁడు, గురుగృహము, బ్రహ్మచర్యము, గురుదక్షిణ మొదలగునవి యన్నియు జ్ఞప్తికి వచ్చును. మేమిప్పు డేయుగమునుగూర్చి చెప్పుచుంటిమో యాకాలమున భారతవర్షమున బ్రాహ్మణప్రభావము లేనేలేదు. శిక్ష కేవల మగ్రవర్ణములవారిచేతులలో నే

బంధింపఁబడి యుండలేదు. బౌద్ధమతమునందు జాతిభేదము లేదు. జాతిభేదము లేదని చెప్పినప్పుడు విద్యాశిక్ష సర్వజనములయందును వ్యాపించియుండెనని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. మతముతోఁగూడ విద్యాశిక్షణమునకు విశేషసంపర్కము కలిగియుండెను. శాస్త్రాలోచనము, శాస్త్రబోధనము ధర్మసంహిత మొదలగువానితో సంబంధముగల యెల్లవారికిని వ్రాయుటకును జదువుటకును వలయు ననుకూలోపపత్తులు కావలసియుండెను. సకలదేశములయందలి ప్రాచీనేతిహాసములయందు నిదియే యగపడుచున్నది. బౌద్ధయుగమునందుఁగూడ నీవిద్యాశిక్ష విశేషించి యుండెను. బౌద్ధశ్రమణులును, భిక్షులును, మఠములయందును విహారములయందును వాసము చేయుచు శిష్యులకు విద్యాదానమును జేయుచుండిరి. వర్తమానకాలమునందువలె స్కూళ్ళును, కాలేజీలును, ఎలిమెంటరీపాఠశాలలు నప్పుడు లేవు. బుద్ధధర్మప్రధానమగు బర్మాదేశమునం దిప్పటికిని భిక్షులు దారుమందిరములయందుండి విద్యార్థులకు విద్యాదానము చేయుచున్నారు. అశోకసామ్రాజ్యమున నసంఖ్యము లగుమఠములును విహారములు నుండెను. కేవలము మతబోధకును, విద్యాశిక్షకును గావలసినన్ని సదుపాయము లాకాలమునం దుండెనని చెప్పుట కెంతమాత్రమును సందేహము లేదు. సకలదేశములయందును సకలసమయములయందును విశేషజనపదములలో విద్యాశిక్షణవిషయమున సుప్రసిద్ధములై యుండుస్థానములు కొన్నిమాత్రమే యుండును. ఇంగ్లాండునకు

లండను ప్రధాననగరమే యైనను నది విద్యావిషయమున మాత్రము ప్రసిద్ధమైనది కాదు; ఆక్సుఫర్డు, కేంబ్రిడ్జి యనునవి విద్యావిషయమునఁ బ్రధానములు. భారతవర్షమునం దిప్పటికిని వారాణసి, పూనా, నవద్వీపము మొదలగుస్థానములు సంస్కృతవిద్యాశిక్షకుఁ బ్రసిద్ధములై యున్నవి. అశోకునికాలమున రాజగృహసమీపమునందున్న నలాందాయును, పశ్చిమోత్తరభాగమునందున్న తక్షశిలయును విద్యాస్థానములందుఁ బ్రధానములై యుండెను. అశోకమహారాజు నలాందయందు విద్యార్థుల కుపయోగముగానుండుకొఱ కనేకగృహములను గట్టించి యిచ్చెను. అందు విద్యార్థులపోషణమునకుఁ దగినయుపపత్తులను సమృద్ధములుగ సమకూర్చి యుంచెను. అశోకుఁడు స్వయముగ విద్యాపోషణకార్యములయందు సముత్సాహియై యుండెను. ఆతనిరాజ్యమున విద్యలకును, విద్వాంసులకును బరమాదరమున్నదని చెప్పుచున్నప్పుడు విద్యార్థులకు విద్యాలాభము సర్వసులభముగ నుండెనని చెప్పుటలో నింత యేమున్నది?

శ్రమణులును భిక్షువులునే కాక మఱియొకతరగతివారి వలనఁగూడ నాకాలమున లోకశిక్షావిషయమున విశేషసాహాయ్యము లభియించుచుండెను. వారే పరివ్రాజకులు. పరివ్రాజకులు సంవత్సరమున కెనిమిదిమాసములు గ్రామగ్రామమునకును నగరనగరమునకును దిరుగుచుండెడివారు; ఆయాస్థానములయందు విజ్ఞానపరిపూర్ణంబు లగునుపదేశములఁ జేయుచుండెడి

వారు. వీరిశిక్షాపద్ధతులయం దొకవిశేషమున్నది. వీరు ముందుగఁ దమ్ముదర్శించినవారితో సంభాషించుట కారంభింతురు. పిమ్మట నేదేనొకవిషయముం దీసికొని యందలితత్త్వమును విస్పష్టముగఁ బ్రబోధించుచుందురు. ఇందువలన జనసాధారణమునకంతకును విజ్ఞానలాభము కలుగుచుండెను. జనసంఘమున జ్ఞానము విస్తరిల్లుచుండెను. పరివ్రాజకులయందుఁ బ్రజలందఱును విశేషముగ భక్తిశ్రద్ధలుకలిగి యుండిరి. ఇట్టివారు నివసించుటకును బ్రజలను బోధించుటకును ధనికులగువారు గ్రామములయందును నగరములయందును బ్రశాంతమంటపములను గట్టించియుండిరి. ఇట్టిమంటపములను గట్టించుట మిగులఁ బుణ్యమనియు, ధర్మమనియుఁ బ్రతిష్ఠాకరమనియు నప్పటివారు తలంచుచుండిరి. శ్రావస్తీనగరమున రాణియగుమల్లికచేఁ బ్రతిష్ఠింపఁబడినమంటప మిట్టిపరివ్రాజకుల యుపయోగము కొఱకే యుపయోగింపఁబడియెను. వైశాలీనగరోపకంఠమునం గలసుప్రసిద్ధంబును, మనోహరంబును నగుచంపకవన మిట్టిపరివ్రాజకగణంబులకొఱకే ప్రతిష్ఠింపఁబడియెను.

పరివ్రాజకసంప్రదాయమున స్త్రీలుగూడ లోకశిక్షణమునకు సాహాయ్యపడుచుండిరి. పరివ్రాజికలును, బరివ్రాజకులు నిప్పటి సన్న్యాసినీసన్న్యాసులంబోలెఁ గఠోరవ్రతపరాయణులు గాకపోయినను వారుచిరకాలమువఱకు బ్రహ్మచర్యవ్రతమును స్వీకరించుచుండిరి. విజ్ఞానమయంబు లగువీరియుపదేశములను గ్రహించుటకు గ్రామగ్రామములయందు ననేకసభలు గా

వింపఁబడుచుండెను. ఆసభలకు బ్రాహ్మణపండితులును బరివ్రాజకులునుగూడఁ బిలువఁబడుచుండిరి. సభయందలియుపన్యాసములు ముగిసినతరువాత సమాగతులగుప్రజలయుపయోగముకొఱకు నానాశాస్త్రచర్చలు జరుగుచుండెను. పెద్దపెద్దపల్లెలలో నిట్టిసభలు విశేషముగ జరుగుచుండెను. పరివ్రాజకులట్టిచోటికిఁ దఱచుగ వచ్చుచుఁ బోవుచుండిరి. బౌద్ధభారతేతిహాసమునుబట్టి యాలోచింపఁగా నాకాలమున గ్రామోపకంఠములను, రాజపథపార్శ్వములను, పుణ్యక్షేత్రములను నివసించుటకుఁ బరివ్రాజకులకును, సాధువులకును, సన్న్యాసులకును తగినప్రశాంతములగుగృహములును మంటపములును నిర్మింపఁబడి యున్నట్లు స్పష్టపడుచున్నది. ఇందువలన జనసామాన్యమునకంతకును జ్ఞానాసక్తి, మతప్రవృత్తి, సాధుభక్తి మొదలగునవి యుత్తరోత్తరాభివృద్ధినందుట కవకాశము కలిగియుండెను. ఈకారణములంబట్టి యాకాలపుఁబ్రజలు క్షేమముగానుండిరనియు, విద్యావంతులై యుండిరనియుఁ జెప్పుట కెంతమాత్రమును సందేహము లేదు.

ఇరువదియేడవప్రకరణము.

ప్రజావస్థ.

భారతవర్షమున చిరకాలమునుండి విశేషించి పల్లెలే ప్రధానముగాఁ గలదేశము. ఇప్పటిబ్రిటిషుభారతవర్షమున నిన్ని

నగరములు, నుపనగరములు గలిగి నాగరికసంఖ్య యతిశయించియున్నను జాలభాగము పల్లెలుగానుండుటయేకాక జనసంఘమునం దధికాంశజనులు పల్లెలయందే యున్నారు. అశోకుని రాజ్యకాలమునఁ బల్లీసమాజమే ప్రధానముగా నుండెను. పల్లెలయందలి శ్యాములశోభామధ్యమున నన్నవస్త్రములకును జలమునకును బాధలేకుండ నాఁకలిదప్పికలనుమాట మెఱుంగక శీతాతపబాధలకు లోఁబడక స్వస్థచిత్తులై యారోగ్యవంతులై ప్రజలెల్లరును దమతమకష్టసుఖంబుల ననుభవించుచుఁ గాలము గడపుకొనుచుండిరి. మాటిమాటికిని వారు తమలోఁ దాము కలహించి రాజద్వారమునకుఁ దగవులకై పోవుట లేదు. పల్లెటూరివారందఱును దామెన్నుకొనిన యొక పెద్దమనుష్యునిమూలమునఁ దమతగవులను దీర్చుకొనుచుండిరి. గ్రామమునందలిప్రజలందఱును దమచిన్నపెద్దతగవుల నాపెద్దకే నివేదించుచుండిరి. ప్రజలందఱును సంఘమునకు భయపడుచుండిరి. దేశమునందలి మతధర్మముల వారెన్నఁడు నుల్లంఘించుటలేదు. వారు సామాజికనీతిపద్ధతులకు విరుద్ధముగ సంచరించుట కెంతమాత్రము నిష్టపడెడువారు కారు. ఈసర్వవిషయములయందును సమాజశాసనము లుండెను.

"ధనము" అన్నంతమాత్రమున నిప్పుడు నోటు, కంపెనీపత్రము, మొహరీ, రూపాయి, వజ్రము, ముత్యము, బంగారము, వెండి మొదలగునవి మనకు జ్ఞప్తికి వచ్చును. ఇప్పుడు రైలు స్టీమరు మొదలగువానిసాహాయ్యమున సరకులను దేశ

విదేశములకుఁ దీసికొనిపోవుటకు సౌకర్యము లున్నవి. బ్యాంకినోటు, చీటీ, హుండీ, బంగారము, రూపాయలు మొదలగువానిప్రచారమువలనఁ గ్రయవిక్రయములకు విశేషముగ సదుపాయములున్నవి. వర్తకప్రచారముకూడ విచ్చలవిడిగ జరగుచున్నది. పూర్వకాలమునందుఁ గృషికుఁడు తనయాహారపదార్థములనుమాత్రము విక్రయింపక కేవలము ప్రత్తి, నారమొదలగువానినిమాత్రము విక్రయించుచుండెడివాఁడు. ఆతనికి వానిమూలముననే విశేషమూల్యము లభియించుచుండెడిది. ఇట్టివిశేషవ్యాపారములవలననే యనేకులు ధనవంతులగుచుండిరి. ఇప్పుడు వర్తకమునందుఁ గ్రయవిక్రయములకు సదుపాయములుండుటచే వర్తకులును గృషికులకంటెను ధనికులగుచుండిరి. ఈకారణముచేధనము పల్లెలయందేమి, నగరములయందేమి కొంతమంది యొద్దమాత్రమే నిలువఁబడిపోవుచుండెను.

అశోకునికాలమునందుమాత్ర మిట్టిక్రయవిక్రయవ్యాపారము దేశవిదేశములయందు జరుపుకొనుటకు సౌకర్యములు లేవు. కేవలము పల్లెలయందు ధనవంతులు లేనేలేరు. ఆకాలమునఁ గేవలము ధనికుఁడును లేఁడు; దరిద్రుఁడును లేఁడు. గృహస్థులు గోధనమునే మహాధనముగఁ జూచుకొనుచుండెడివారు. ప్రతిగ్రామమునందును వ్యవసాయముచేయుట కున్నంతభూమితో సమానముగ గోభూమికూడనుండెడిది. పల్లెలయందుఁ బశువులు లేనిగృహస్థు లెవ్వరును లేరు. సామాన్యకృషికునకైనను గూలిపని చేయుట యవమానకరముగ నుండెడిది.

ఆకాలమునఁ బల్లెలయందు ఋణము లేనివాఁడును, దేశాంతరమునకుఁ బోనివాఁడును శాకాన్నభోజియును సుఖజీవనులుగఁ బరిగణింపఁబడుచుండెడివారు.

చరిత్రమునం దశోకయుగమున స్థాపత్యశిల్పరచనవిశేషముగ నున్నట్లు కానవచ్చుచున్నది. అప్పటిస్తూపములును, స్తంభములును సౌధములునుగూడ నిప్పుడు భగ్నములై యున్నవి. ఆభగ్నావశేషములం గాంచుటచేతనే మనకు మహాశ్చర్యము కలుగుచున్నది. వీనినిబట్టియు, నింకనునగపడుచున్నచిత్రములంబట్టియు నశోకునిరాజ్యమునందు నగరములలో సుధాధవళితంబు లగుసుందరసౌధములు విశేషముగ నున్నవని చెప్పుటకెంతమాత్రమును సంశయములేదు. అప్పుడు నగరములయం దేడంతస్తుల మేడలుకూడ నున్నట్లు తెలియవచ్చుచున్నది. నగరములయందు విలాసవిభ్రమములనుఁగూడ నభావములేదు. నాగరికజనులలో సామాజికశాసనమెంతవఱకుఁ బ్రాబల్యమును వహించియుండెనో బాగుగఁ దెలియవచ్చుట లేదు. కాని మానవప్రకృతులనుబట్టి యాలోచింపఁగా నప్పటిపల్లెలయందలివారికంటె నగరవాస్తవ్యుల స్థితి సర్వవిధముల మించియే యుండవలయునని తోఁచుచున్నది. ఇప్పటినగరస్వాస్థ్యసౌకర్యములు మ్యునిసిపాలిటీవారిచేతులయం దున్నట్లే యప్పటినగరశాసనముకూడ నిర్దిష్టసంఖ్యాకు లగుప్రజలహస్తములయం దుండెను. ముప్పదిమంది పెద్దమనుష్యులతో నట్టిసభ యేర్పఱుపఁబడి యుండెడిది. వీరిలో నైదైదుగురినితీసి యాఱు

శాఖాసమితులుగా విభజింపఁబడుచుండెను. ఈసమితులన్నియును వేఱువేఱుగ నగరమునందలి వేఱువేఱుభాగముల కార్యముల దీర్చుచుండెను. శిల్పము, వాణిజ్యము మొదలగుసకలకార్యములు నీసమితులమూలముననే ప్రచారితములగుచుండెను. సరకులయెగుమతిదిగుమతులు, పన్నులు, కొలతలు, తూనికలు మొదలగువానిలెక్కలును, గృహములు, జననములు, మరణములు మొదలగువానిలెక్కలును, విదేశీయులనివాసములు, వారిస్థితిగతులు మొదలగువానిలెక్కలు, వైద్యశాలాస్థాపనములు, ప్రచారములు మొదలగువానివిషయమున నెల్లవిధముల ననుకూలము లగునేర్పాటులు గావింపఁబడియుండెను.

పల్లెలయందును నగరములయందు నశోకునిధర్మశాసనమున నెట్టికష్టములును లేక జనులు సుఖముగ నివసించుచుండిరి. అశోకుఁడు తన యైహికాముష్మికసుఖాభివృద్ధికై కావలసినకార్యముల నన్నిటిని సంపూర్ణముగఁ గావించెను. ఆతఁడు రాజనామమునకుఁ దగియుండెను. ప్రజారంజనమే యాతనిపరమధర్మము. ఆతఁడు ప్రజలను బిడ్డలవలెఁ బాలించుచుండెను. ఇట్టిసద్గుణములచే నశోకుఁడు రఘుమహారాజుతో సమానుఁడని చెప్పుట కెంతయుఁ దగియుండెను.

\+ \+ \+ \+

“సపితాపితరస్తాసాం కేవలంజన్మహేతవః”

ప్రజావత్సలుఁడగుప్రభువే ధన్యుఁడు. అట్టిరాజు చేఁబ్రి

పాలింపఁబడుదేశమే పుణ్యమయమైనది. అట్టిరాజును సేవించుచు నాతనిదేశమున వసియించుచున్న ప్రజలసౌభాగ్యమే భాగ్యము.

ఇరువదియెనిమిదవప్రకరణము.

శాసనప్రణాళి.

అశోకసార్వభౌమునిశాసనప్రణాళిక యతిసుందరమైనది. ఆతనివిశాలసామ్రాజ్యమున వివిధప్రదేశములయందు వివిధరీతుల శాసనము లుపయోగపడుచుండెను. ప్రత్యేకప్రదేశములయం దొక్కొక్క రాజప్రతినిధి శాసించుచుండెను. రాజకుమారులుగాని రాజబంధులుగాని, యోగ్యపురుషులుగాని యాయాప్రదేశముల శాసనకర్త లగుచుండిరి.

ప్రాదేశికశాసనకర్తలయధీనమున నొకయధికారియుండి యిట్టికార్యములఁ జేయుచుండు. ఆయుద్యోగ మిప్పటికమీషనరులయుద్యోగమువంటిది. ఆయుద్యోగికి రాజూకుఁడని పేరు. అట్టిరాజూకునిచేతిక్రింద "ప్రాదేశికుఁడు" కార్యముల నిర్వహించుచుండును. ఆయుద్యోగ మిప్పటిజిల్లామేజస్ట్రేటుపదవివంటిది. ప్రాదేశికులక్రింద "యుక్తుఁడు" "ఉపయుక్తుఁడు" అనునుద్యోగులుందురు. మిగిలినయుద్యోగులు యథాయోగ్యముగ లెక్కలవిషయమునను గచేరివ్యవహారములయందును నియోగింపఁబడి యుందురు. అప్పటి చిల్లరయుద్యోగులకు లేఖకులని

పేరు. రాజధానియందలి యెల్లలెక్కలను దెలియఁబరచుట కిప్పటి "సెక్రిటరీయేట్" వలె నొకగొప్పకచేరి యున్నది.

"రాజానశ్చారచక్షుషః" అనుమాట మనదేశమున మిగులవాడుకలో నున్నది. అట్టిగుప్తచారు లశోకునిరాజ్యమునందుఁగూడ నున్నారు. అందుఁబ్రధానగూఢచారులకు "ప్రతివేదకు" లనిపేరు. వారెల్లప్పుడును జంఘికాలయము మొదలు వేశ్యాలయమువఱకును గుప్తచరులై యుందురు. ఉన్నతస్థితియందున్న వేశ్యాగణముకూడ వార్తాసంగ్రహణమునఁ బనిచేయుచుండెను. రాజ్యశాసనముకొఱకును, రాజునకును, రాజ్యమునకును విపత్తులఁగువారిని నిగ్రహించుటకును, ప్రజాధర్మమును నీతిని బరిపాలించుచు వారియున్నతికిఁ దగుపద్ధతుల నాలోచించుటకును దగినకట్టుదిట్టములు చేయఁబడి యుండెను. క్రీస్తురాజ్యమునం దన్యాన్యవిభాగములనఁదగు మతమొక్కరీతినే యెట్లువ్యాపించి యున్నదియో యశోకుని రాజ్యమునందుఁగూడ నట్లే వ్యాపించి యుండెను. ఇట్టిమతవిభాగకార్యములనుగూర్చి తెలిసికొనఁదలంచినచో "ధర్మమహామాత్రు" డనుపేరుగల మతప్రవర్తకునియుల్లేఖములను జదువవలయును.

మహారాజగు ధర్మాశోకునిరాజ్యమున యుద్ధవిగ్రహములు లేవు. కాని యాతనిసైన్యవిభాగముమాత్ర మతిప్రబలమై యుండెను. ఆతఁడు నగరశాసనవిషయంబునం జేసినయుద్యోగవిభాగమువలెనే సైన్యశాసనవిషయంబునఁగూడ నాఱుశాఖలుగా విభజించెను. అతనిబలవిభాగమున నౌకాసేన, పదాతి

సేన, అశ్వసేన, రథసేన, గజసేన, మొదలగు నాలుశాఖలు కలవు. వీనిమూలమున రణసామగ్రులను బంపుట, రసస్సంగ్రహము, వస్తుసంచయ ప్రేషణము మొదలగుకార్యములు నిర్వహింపఁబడుచుండెను. రాజ్యమునందలి యంతర్ద్రోహముల నడఁగించుటకేమి, బహిశ్శత్రువు లాక్రమింపకుండ రాజ్యమును గాపాడుటకేమి మహారాజగునశోకుఁడు తనబలమును విభాగించి యాశాఖలమూలమున సర్వసంరక్షణమునకును సదుపాయములఁ గావించియుండెను.

సకలవిషయములను బాగుగవిమర్శించిచూడఁగా మహారాజగు నశోకునికాలమున రాజ్యశాసనపద్ధతు లన్నియు నాకాలమునకు సర్వవిధముల నుపయోగకరములై సర్వసంపూర్ణములై యుండెను.

ఇరువదితొమ్మిదవప్రకరణము.

ధర్మమాగళము.

అశోకసార్వభౌముని కాలమున బౌద్ధమతము రాజునకును బ్రజలకునుగూడఁ బరమాదరణీయముగా నుండెను. రాజునకును బ్రజలకునుగూడ నొక్కటేమతమగుటవలన రాజునకును, బ్రజలకును, మతమునకునుగూడ సర్వశ్రేయములును లభియింపఁగలవు. అశోకునిరాజ్యమున నట్టిభాగ్యము లభియిం

చినది. అశోకుఁడు తనప్రజలయైహికసుఖసమృద్ధులకొఱ కెంతవఱకుఁ బ్రయత్నించి పనిచేసినదియు నిదివఱకే విశేషించిచెప్పియున్నాము. కాని యశోకుఁడు తనప్రజలందఱు నైహికసుఖసంపన్నులై యుండిరన్నంతమాత్రమునఁ దృప్తివహించియుండలేదు. ఆతఁడు తనప్రజలయాముష్మికసుఖమునకై యుపయోగపడుధర్మము, నీతిమొదలగువానిరక్షణమునకై కావలసిన కార్యముల నన్నిటిని జేసెను. ఆతఁడు తనప్రజలలో బౌద్ధధర్మానుష్ఠాన మెంతనియమముగ నడచుచున్నదో పరీక్షించుటకు ధర్మోద్యోగులను గొందఱను నియోగించియుండెను. యూరపుఖండమునందలి క్రీస్తురాజ్యములలో మతప్రవర్తనమునకై ప్రత్యేకకార్యనిర్వాహకులు నియమింపఁబడియుందురు. ఇంగ్లీషు రాజ్యమున ట్రిపన్కై ఆర్చిబిషప్, చ్యాపలేన్ మొదలగు వారున్నట్లు మనకుఁ దెలియవచ్చుచున్నది. ఇట్టివారుకూడ రాజ్యపాలనోద్యోగవిభాగములయం దొకతరగతివిభాగోద్యోగులైయున్నారు. వీరు క్రీస్తుప్రజలలోని మతాచారముల యనుష్ఠానములంగూర్చి విచారణచేయుచుందురు. మహారాజగునశోకుని రాజ్యమునందుఁగూడ నిట్టియేర్పాటు లున్నవి. ధర్మమహామాత్రుఁడు, స్త్రైర్యమహామాత్రుఁడు, కర్మికుఁడు మొదలగుకర్మచారులవ్రాఁతలనుబట్టి యిప్పటికిని ధర్మాశోకుని రాజ్యపాలనేతిహాసమును మనము సంపూర్ణముగ గ్రహింపవచ్చును.

బౌద్ధధర్మమున జాతిభేదము లేకుండుటచే సర్వదేశములయందును, సర్వజనులయందు నీమతము వ్యాపించుట కవకాశ

ము కలిగెను. మహారాజగునశోకుఁడు బుద్ధదేవునిధర్మమును, నాతనిశాంత్యుపదేశములను సర్వత్ర వ్యాపింపఁ జేయుటకై నానాదేశములకు బుద్ధమతప్రచారకులను బంపించుచుండెను. ఏయేదేశముల కెవ్వరెవ్వరు మతప్రచారార్థము పంపఁబడిరో యావిషయమీక్రిందిపట్టికలో వివరింపఁబడియున్నది.

(1)	కాశ్మీరము, గాంధారము—	మజ్ఝన్తికుఁడు.
(2)	మహిషమండలము—	మహాదేవుఁడు.
(3)	వనవాసీ—	రక్షితుఁడు.
(4)	అపరాంత—	ధర్మరక్షితుఁడు.
(5)	మహారాష్ట్ర—	మహాధర్మరక్షితుఁడు.
(6)	యవనలోక— (గ్రీసు)	మహారక్షితుఁడు.
(7)	హిమవంత—	మజ్ఝిమ దూరభిసారుఁడు, మహాదేవుఁడు, మూలవదేవుఁడు.
(8)	సువర్ణభూమి—	సేనుఁడు, ఉత్తరుఁడు.
(9)	సింహళ—	మహేంద్రుఁడు; సంఘమిత్ర

ఈపట్టికం జూచినచో నశోకసార్వభౌముని ప్రభావమెంతవఱకు వ్యాపించినదియుఁ దెలియఁగలదు. గాంధార (కాందహార) మప్పు డాతనిరాజ్యమునకుఁ జేరియుండెను. అంతదూరమునందున్న గాంధారమునుగూడ నతిక్రమించి యాతనిమతప్రచారకులు యవన (గ్రీస్) దేశముకూడఁ బోయియుండిరి. మఱియు దక్షిణసముద్రమును దాఁటి సింహళమున మహేంద్రుఁడును, నాతనిసోదరి యగుసంఘమిత్రయును మతప్రచారము

గావించియుండిరి. మహారాజగునశోకుఁ డెట్టిశ్రద్ధతోఁ బ్రయత్నించి బౌద్ధమతప్రచారమును గావించియుండెనో యట్టిపూనికతో భారతవర్షమునం దేరాజును నెట్టిమతమును బ్రచారితము గావించియుండలేదు. మతపవిత్రతాసంరక్షణమునకొఱకు మతప్రచారమునకొఱకు మతస్థిరత్వమునకొఱకు సర్వవిధములఁ బ్రయత్నించుటచేఁ బ్రియదర్శుఁడగునశోకునినామము సర్వజగచ్చరిత్రమునందును జిరసముజ్జ్వలితమై విలసిల్లుచున్నది.

ముప్పదియవ ప్రకరణము.

భూతదయ.

అహింసయేపరమధర్మమనుమాట యశోకుఁడుపుట్టుటకుఁబూర్వము చాలఁగాలముక్రిందటినుండియే భారతవర్షమునఁ బ్రచారమునందున్నది. అయినను వేదవిహితయజ్ఞయాగాదులయందును, దేవతామహోత్సవములయందును, లెక్కలేనన్నిజీవములు హింసింపఁబడుచునే యుండెను. మానవభోజనాదులయందంతకంటెను నధికముగ జీవహింస లగుచుండెను. భగవానుఁడగుబుద్ధదేవుఁడును, తీర్థంకరమహావీరస్వామియును జేసినయమోఘప్రయత్నములవలన నట్టిజీవహింసలు చాలవఱకుఁ దగ్గిపోయెను. అహింసయే పరమధర్మమనుమాట వారిమూలముననే సర్వసామాన్యముగ నందఱకును బోధపడియెను. ఆకాలము

నుండియే జీవహింస తగ్గుట కారంభమయ్యెను. ఎట్టిజీవికైన నెట్టియనిష్టమునైనఁ జేయకుండుట యహింస యనియు, సర్వజీవులను ప్రేమించుచు సర్వజీవులకును హితసాధనములం గావించుట సర్వభూతదయయనియు సర్వసాధారణముగఁ దెలిసిపోయెను.

మహారాజగు నశోకుఁడు సర్వభూతముల క్షేమముకొఱకును గావించిన యేర్పాటులనుగూర్చి పఠియించినచో "నహింస" "భూతదయ" అనువానివిభేదము స్పష్టముగ బోధపడఁగలదు. ప్రజారంజనము చేయువాఁడే రాజు. ప్రజారంజనము చేయుటయే రాజత్వమునకు ముఖ్యోద్దేశము. ఈపద్ధతియందశోకసార్వభౌముఁడు సర్వవిధముల నాదర్శప్రభుఁడై యుండెను. ప్రజారంజనమునకై యాతఁడు చేయనికార్య మెదియును లేదు. ప్రజారంజనము చేయుటమాత్రముచే నాతఁడు నిశ్చింతుఁడై యుండలేదు. ఆతనిప్రేమామృతపవిత్రప్రవాహము పశుపక్షికీటపతంగపర్యంతమును ప్రవహించి యుండెను. అవికూడ నాతనిప్రేమ రాజ్యమునఁ బ్రజలేయైయుండెను!! వానిని రక్షించుటయు రంజించుటయుఁగూడ నవశ్యకర్తవ్యమే యని యాలోచించి ప్రియమాశోకసార్వభౌముఁ డావిషయమునఁగూడఁ దనరాజ్యమునందనేకవిధములగు శాసనములను బ్రకటించియుండెను. అట్టిశాసనములలోఁ గొన్నిటినిమాత్రమిక్రింద లిఖియించుచున్నారము.

"ఇంతటినుండి నారాజ్యమునందెచ్చటను నీక్రిందిజీవులను హింసింపఁగూడదు:—చిలుక, గోరవంక, చక్రవాకము, రాజహంస, గింజలనేరికొనితినుపక్షులు— పికిలిపిట్ట, కూర్మము,

శంకరమత్స్యము, వానరము, ఆబోతు, ఖడ్గమృగము, పావురము, గువ్వ, పిచ్చుక, ఆఁడుమేఁక, ఆఁడుపంది, గర్భిణి, దుగ్ధవతి, గాడిద, గుఱ్ఱము, గోవు—మొదలగునవి" అశోకునిశాసనములనుబట్టిచూడఁగా నాషాఢపూర్ణిమ మొదలు కార్తికపూర్ణిమవఱకును, మఱియు నితరమాసములయందలి విశేషనిర్దిష్టదినములయందును, మత్స్యవధయు, మత్స్యవిక్రయమునుగూడ నిషిద్ధములైయుండెను. ఇట్లు నిషేధించి శాసించుటచేఁగూడ నాతఁడు తృప్తుఁడై యుండలేదు. జీవజంతువులు నివసించుటకును జీవించుటకునుగూడ ననేకఫలవృక్షములుగలతోఁటలనుగూడ నిర్మించెను. దేశమునందంతటను చికిత్సాలయములఁ గట్టించెను. రెండువేలసంవత్సరములకుఁ దరువాత నిప్పుడు మనము జీవక్లేశనివారిణీసభలను స్థాపించి యప్పుడప్పుడు పశుపక్షిమత్స్యాదులను హింసించుట దోషమని నిషేధించుచు నచ్చటచ్చటఁ బశుచికిత్సాలయములను స్థాపించుటచేతమాత్రమే మనము నాగరకులమనియు గౌరవాన్వితులమనియు భావించుకొనుచున్నారము! కాని యశోకునిచరిత్రమును బఠించినచో నెంతయో పూర్వకాలమునందే మన భారతవర్షమునం దిట్టిసౌకర్యములు విశేషించి విధాయకాచరణమునందుండెనని బోధపడఁగలదు—అప్పుడు మనహృదయము శ్రద్ధాప్రశంసావిస్మయపరిపూర్ణము కాఁగలదు !!

ముప్పదియొకటవ ప్రకరణము.

ఆత్మమంగళము.

ప్రియదర్శనుఁడగు నశోకుఁడు తనవిశాల రాజ్యమునందలి శాంతికొఱకును, నందలియసంఖ్యాక ప్రజాగణహితసాధనముకొఱకును, భగవానుఁడగుబుద్ధదేవుని శాంతిమతప్రచారముకొఱకును పశుపక్షికీటాదిసర్వప్రాణిసంరక్షణముకొఱకును దనజీవితము నంతను వినియోగించి యథానుకూలములగు నేర్పాటులను గావించియుండెను. ఇట్టిసకలసత్కార్యములను శ్రద్ధతోఁగావించుచున్నయాతనికిఁ గ్రమముగ వార్ధక్యము తటస్థించెను. పరమేశ్వరునివిచిత్రవిధానములచే జీవితకాలమునందలి సంధ్యాసమయము శాంతిమయముగా నుండునదృష్ట మెవ్వరికోగాని లభింపదు. పుణ్యశ్లోకుఁ డగునశోకుఁడుకూడ నీకఠోరనియమము నతిక్రమింపఁజాలకపోయెను.

మహారాజగునశోకునకు రాణులు చాలమంది యుండిరి. అందఱిలోనను "తిష్యరక్షిత" యనురాణి యాతనిజీవితమునందలినానాదుఃఖములకును గారణభూతురాలయ్యెను. ఆమెతంత్రమువలననే యువరాజగుకుణాలుఁ డంధుఁడయ్యెను. తిష్యరక్షిత కుటిలహృదయయు, దుశ్చరిత్రయు నైయుండెను. రాజాంతఃపురమున నిట్టి కాలసర్పిణియు, రాజ్యమున కిట్టియంధుఁడగుభావిమహారాజును దటస్థించుటచే నప్పటియాతనిహృదయ

భావ మెట్లుండునో యూహించుకొన్నచో సులభముగనే బోధపడఁగలదు! ఇట్టిసమయమునందే యాతనిప్రియసహోదరుఁడగు వీతాశోకుఁడు కాలవశముచే నొకయాభీరునిచేతులలోఁబడిమరణించెను. ఇట్టియనివార్యసంఘటనములచేమహారాజగునశోకుఁడు విషణ్ణుఁడైపోయెను. అందుచే నాతనికి సంసారమున విరక్తి కలిగెను. అంతటినుండి యాతఁడురాజర్షివలెసంసారబంధమును ద్రెంచికొని కాలయాపనము గావించుచుండెను. కుణాలునియభావనీయదుర్దశచే నాతనిపౌత్రుఁ డగుసంపాది రాజ్యమునకు యువరాజయ్యెను. అప్పుడు ప్రియదర్శి యగునశోకుఁడు నామమాత్రమున రాజైయుండెను. యువరాజగుసంపాది మంత్రి మొదలగురాజోద్యోగులపైఁ దనయధికారము జూపుచు రాజ్యమంతయుఁ దానే పాలించుచుండెను. అశోకమహారాజు ధర్మచింతచే ధర్మకర్మములతోడను బుణ్యప్రసంగములతోడను గాలక్షేపము చేసికొనుచుండెను.

ఒకనాఁ డశోకసార్వభౌముఁ డుపగుప్తు వలన నఖిలధర్మముల నాలకించుచు "మహాత్మా! భగవానుఁడగుబుద్ధదేవుని మతాభివృద్ధికొఱకై యేపుణ్యాత్ముఁడు విశేషధనమును దానముచేసియుండెనో సెలవీయవలయును" అని ప్రశ్నించెను. అందుపై నుపగుప్తుఁడు "మహారాజా! శ్రావస్తినగరవాసి యగు ననాథపిండుఁ డనుశ్రేష్ఠియొక్కఁడే యావిషయమున నందఱికంటెను విశేషముగ ద్రవ్యదానమును జేసియున్నాఁడు" అని చెప్పుచు నాతఁడు చేసినదానముల నన్నిటిని విస్పష్టముగ వివ

రించెను. ఆమాటలు విని యశోకుఁడు "సేనావిషయమున నూఱుకోట్లసువర్ణముద్రల దానము చేయుదును; ఇంతకుఁబూర్వమే తొంబదియాఱుకోట్లముద్రలను వినియోగించితిని. ఇఁక తక్కిన నాలుగుకోట్లముద్రలనుగూడ వెచ్చించెదను" అని చెప్పి యంతటినుండి యశోకుఁడు ప్రతిదినమును దనయాహారానంతరమునఁ దనస్వర్ణభోజనపాత్రమును బౌద్ధసంఘమునకుఁ బంపివైచుచుండెను. ఇంతియకాక యనేకవిధములగు దానములను గావించుచుండెను. క్రమముగ నీసంగతి యువరాజునకును గర్ణగోచరమయ్యెను. ఈవిధముగ మహారాజు దానముచేయుచుండినచో రాజకోశ మచిరకాలములోనే శూన్యము కాఁగలదని యాతఁ డూహించుకొనియెను. పిమ్మట నాతఁడు మహారాజునకు స్వర్ణభోజనపాత్రను బంపుటమాన్పించి రౌప్యపాత్రను బంపునట్లాజ్ఞాపించెను; తుదకదియును లేకుండఁ జేసెను. ఆసంగతి యంతయును సంపూర్ణముగ గ్రహించి సార్వభౌముఁ డగు నశోకుఁడు మర్మాహతుఁ డయ్యెను.

ఒకనాఁడు మహారాజు శ్రీమదశోకుఁడు విషణ్ణభావముతోఁ గూర్చుండియుండఁగా మంత్రియగు రాధాగుప్తుఁడు వచ్చి యాతనియవస్థం జూచి కృతాంజలియై "మహారాజా! ఈవిధముగ విచారాయత్తులై యుంటిరేల?" అని ప్రశ్నించెను. అందుపై మహారాజు "రాధాగుప్తా! నాకుఁగోశముపైనధికారము లేదు. ఈవిశాలరాజ్యమునకు రాజరాజేశ్వరుఁడనైయున్నను నాకొక్క కాసునకు గతి లేకుండఁబోయినది! నాకోరిక తీరినది

కాదు! నేను బౌద్ధసంఘమున కీయఁదలఁచిన శతకోటిస్వర్ణముద్రలను నీయఁజాలకపోయితిని—వ్యర్థుఁడనైయున్న నేనిప్పుడేమి చేయఁగలను? ఋణవిముక్తుఁడ నగుటకు సాధన మేమున్నది? ఇదిగో! నాయొద్ద నొక్క యుసిరికకాయ మాత్రమున్నది! మంత్రిశేఖరా! నీవీ యామలకమును దీసికొనిపోయి కుక్కుటారామమునం దున్న బౌద్ధసంఘమున కర్పింపుము! అచ్చటనున్న పూజ్యులగు మహాత్ములకం దఱకు నిదియే యశోకుని తుదిదానమని నివేదింపుము! అందఱును దయతో దీనిని బరిగ్రహించి సమముగ విభజించుకొనవలయునని నేను ప్రార్థించినట్లు వారితో మనవి చేయుము!" అని చెప్పెను.

ఇట్లుచెప్పి మంత్రి కాయామలకము నిచ్చుచు నశోకసార్వభౌముఁ డొకదానశాసనమును వ్రాయించెను. మహారాజగు నశోకుఁ డీదానపత్రమున సముద్రమేఖలావలయితం బగు నాతనివిశాలరాజ్యమంతయును బౌద్ధసంఘమునకు దానము చేసివైచెను. ఆసమయమునందే యాతఁడు తనయాత్మమంగళమునకై యీవిధముగఁ బ్రార్థించెను.

"నేనిప్పుడు నారాజకోశము కాక తక్కినరత్నరత్నాకరవిశోభిత విశాలరాజ్యమంతయును భగవానుఁడగుబుద్ధదేవునిభక్తసంఘమునకు దానముచేసివైచితిని—ఈదానమునకుఁ బ్రతిఫలముగ నేనెట్టిసుఖమును గోరుకొనుట లేదు—ఇంద్రాధిపత్యము నభిలషింపలేను. బ్రహ్మలోకమును వాంఛింపలేను. ఇవి యన్నియును నలినీదళగతజలచంచలములు! క్షణభంగుర

ములు!—చిత్తపరిశుద్ధిఁగోరి—దృఢవిశ్వాసము—నభిలషించి ఆత్మసంయమలాభమును వాంఛించి నేనీదానముం గావించితిని—ఇదియే నాయాత్మమంగళము !! ”

ఇట్టిప్రార్థనమును బ్రకటించి యశోకసార్వభౌముఁ డాతని సర్వస్వమును ద్యజియించివైచెను. ఆముహూర్తమునందే యాతఁడు తిరోహితుఁ డైపోయెను.

వందనము.

అనంతసాగరవక్షమున సంపూర్ణజ్యోతిర్మయసూర్యమండలముం బోలి యనంతకాలసముద్రమున మహిమాన్విత మహారాజసార్వభౌముఁ డగు నశోకుఁ డంతర్హితుఁ డైపోయెను. మహాపురుషు లందఱకంటెను మహాపురుషుఁడు!

రెండువేలసంవత్సరములు గడచిపోయినవి. కాలప్రవాహమునం దెన్నియోకీర్తిచిత్రములు భగ్నములైపోయినవి—తేలిపోయినవి. ఓమహారాజా! ఓభారతగౌరవమూర్తీ! నీకీర్తిచిత్రములుమాత్ర మెన్నినాశనములైపోలేదు! కాని యశరీరిణి యగువాణికిమాత్రము నాశనము లేదు! ఓసార్వభౌమా! ధర్మాశోకా! నీవిశాలకీర్తికీర్తనములను, నీవిశాలరాజ్యసుఖశాసనకథాప్రతిధ్వనులలో మేమిప్పటికిని వినుచునే యున్నారము! పరమపావనశోభాభాసమానంబగు నీపాటలీపుత్ర మిప్పుడెక్కడ నున్నది? నయనాభిరామంబగు నీకుక్కుటారామం బిప్పు డేమైపోయినది? ఆసాంచిస్తూప మగపడదేమి?— ఆగుహామందిర మేది? కాలతరంగకఠోరాఘాతములచే నందిప్పుడు కొన్ని లుప్తములైపోయినవి! కొన్ని భగ్నములైపోయినవి! కొన్నివికృతములైపోయినవి! కాని యంతటిఘనప్రతిష్ఠాపనములం గావించిన నీహృదయమునందలి శాశ్వతశుభోద్దేశమును నీపూర్వకథాభారతీప్రసాదముచే మేమిప్పటికిని మాతృదరికుటీరములయందుండి యాకర్ణించుచు నానందపులకాంకితవిగ్రహులమై వెంటనే యవనతమస్తకులమై నీరాజ్యలక్ష్మికి సహస్రశతసహస్రాభివాదనములం గావించుచున్నారము!!

ఓరాజచూడామణీ! నీప్రజలయైహికాముష్మికసుఖసమృద్ధులం గూర్చియు, నీసర్వసుఖశాసనములంగూర్చియు, నీదుష్టశిక్షణశిష్టపరిపాలనతత్పరతంగూర్చియు, నీరాజ్యసుఖశాంతిస్థాపనము లంగూర్చియు, నీసర్వభూతదయాళుత్వముంగూర్చియు నిప్పటికిని భారతవర్షమునందలి దూరతమగిరిగహ్వరములయందుఁగూడఁ బ్రతిధ్వనులు బయలుదేరుచున్నవి.

ఓకీర్తిభూషణా! రాజర్షీ! నీవుచేసినసత్కార్యములకు—బుద్ధదేవుని శాంతిమతప్రచారమునకు—నీవుచేసినసౌకర్యములకు సాగరమేఖలావలయితంబగు సర్వరాజ్యప్రదానమునకుఁ బ్రతిఫలముగ నీవెట్టిసుఖమును గోరలేదు. ఇంద్రత్వము కోరలేదు. బ్రహ్మత్వము కోరలేదు. కేవలము స్వధర్మమున దృఢవిశ్వాసమును, జిత్తశుద్ధియు, నాత్మసంయమమునుమాత్రమే నీవు

కోరుకొంటివి. పరమేశ్వరానుగ్రహమున నీవాంఛితము సంపూర్ణముగ ఫలియించినది!

ఓ రాజర్షీ! జరామరణాతీతంబగు నేలోకమునం దిప్పుడు నీవుంటివో యాలోకము నుండి నీకృపామృతకటాక్షముల నొకసారి నీప్రియభారతవర్షముపై బ్రసరింపఁ జేయుము! ఓ శాంతిప్రియా! నీభారతవర్షము చిరశాంతిసౌభాగ్యవిరాజితంబగునట్లుగ నాశీర్వదింపుము!

ఓ ప్రియదర్శనా! నీపవిత్రచరిత్రము—నీరాజ్యపాలనచాతుర్యము—నీరాజ్యవిస్తారము, భారతవర్షమునందలి ప్రజలకందఱకును జిరకాల మాదర్శకమై విరాజిల్లుచుండుఁగాక !!

END OF
TITLE